సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 337
సోమవారం 27-2-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'



ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా
మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 19 పరుగులతో గెలుపు -12లో



విశ్రాంత జీవనం.. హాయిగా..!
రిటైర్మెంట్ ప్లానింగ్‌పై 'మనీ పాఠశాల' ఆర్థిక సూచనలు - 13లో




త్వరలో మరో భారత్ జోడో
భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో మరోసారి దేశవ్యాప్త యాత్ర ఉంటుందని ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ సంకేతాలిచ్చారు.
- వివరాలు 6లో▶



ఈ-సంజీవనితో డిజిటల్ విప్లవం
ఆన్‌లైన్‌లో మెడికల్ కన్సల్టేషన్ చేసే ఈ-సంజీవని యాప్ ద్వారా పదికోట్ల మంది లబ్ధి పొందారని ప్రధాని మోదీ తెలిపారు.
- వివరాలు 6లో▶



కశ్మీరీ పండిట్‌పై కాల్పులు
పుల్వామా జిల్లాలో ఆదివారం ఉగ్రవాదుల కాల్పుల్లో సంజయ్ శర్మ అనే కశ్మీరీ పండిట్ మృతిచెందాడు.
- వివరాలు 6లో▶



ఇటలీ సముద్రంలో పడవ మునక
ఇటలీ సముద్ర జలాల్లో వలసదారులు ప్రయాణిస్తున్న ఓ పడవ మునిగిపోయిన ఘటనలో 58 మృతదేహాలను వెలికితీశారు.
- వివరాలు 6లో▶

మెడికో ప్రీతి కన్నుమూత

మృత్యువుతో పోరాడి ఓడిన కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థిని

సీనియర్ సైఫ్ వేధింపులతో వరంగల్ ఎంజీఎంలో ఆత్మహత్యాయత్నం

ఐదు రోజులుగా నిమ్స్‌లోని ఆర్ఐసీయూలో చికిత్స

ఆదివారం రాత్రి 9.10కి ప్రాణాలు వదిలినట్టు ప్రకటించిన వైద్యులు

- శోక సంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులు, స్నేహితులు.. ఆమె ఎలా మృతి చెందిందో చెప్పాలంటూ నిమ్స్‌లో ఆందోళన
- కేఎంసీ అనస్తీషియా విభాగం హెచ్ఓడీని సస్పెండ్ చేయాలని డిమాండ్.. మద్దతుగా నిలిచిన గిరిజన, విద్యార్థి సంఘాలు.. అర్ధరాత్రి వరకు ఉద్రిక్తత
- సిట్టింగ్ జడ్జితో విచారణకు తండ్రి నరేందర్ డిమాండ్
- బాధిత కుటుంబానికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ప్రకటించిన ప్రభుత్వం
- ప్రీతి మృతి బాధాకరం: మంత్రి హరీశ్


ప్రీతి మృతదేహాన్ని చూసి రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు


ప్రీతి (ఫైల్)

లక్డీకాపూల్ (హైదరాబాద్)/ సాక్షి, వరంగల్ /సాక్షి, హైదరాబాద్: సీనియర్ వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసిన మెడికల్ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి (26) కన్నుమూసింది. ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడిన ఆమె ఆదివారం రాత్రి 9.10 గంటలకు ప్రాణాలు విడిచినట్టు నిమ్స్ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. దీనితో ఆమె తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, స్నేహితులు శోక సంద్రంలో మునిగిపోయారు. ప్రీతి మృతికి కారణమేంటో చెప్పాలని, నిందితుడు సైఫ్, కాకతీయ మెడికల్ కాలేజీ అనస్తీషియా విభాగం హెడ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తగిన చర్యలు చేపట్టేదాకా మృతదేహాన్ని తరలించబోమంటూ నిమ్స్ వద్ద ఆందోళనకు దిగారు. దీనితో ఆదివారం అర్ధరాత్రి తర్వాతా నిమ్స్ వద్ద ఉద్రిక్తత నెలకొంది.

అసలేం జరిగింది?
జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గిర్నితండాకు చెందిన ధరావత్ నరేందర్ వరంగల్‌లోని ఆర్‌పీఎఫ్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య శారద, ముగ్గురు కుమార్తెలు
మిగతా 3వ పేజీలో ▶

నిమ్స్ వద్ద ఆందోళన.. ఉద్రిక్తత
ప్రీతి మృతి చెందినట్టుగా ప్రకటించిన నిమ్స్ వైద్యులు మృతదేహాన్ని నేరుగా వరంగల్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వచ్చి మృతదేహాన్ని చూసి సంతకం పెట్టాలని తల్లిదండ్రులను కోరారు. కానీ ప్రీతి తల్లిదండ్రులు, బంధువులు దీనికి నిరాకరించారు. ప్రీతి మృతికి అసలు కారణమేంటో తేల్చాలని, ఏ ఇంజెక్షన్ తీసుకుందో చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆర్ఐసీయూ వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. అప్పటిదాకా మృతదేహాన్ని తరలించనివ్వబోమన్నారు. ప్రీతిని వేధించిన సైఫ్, మరో ఏడుగురిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. కేఎంసీ అనస్తీషియా విభాగం హెడ్‌ను సస్పెండ్ చేసి, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారికి వైద్య విద్యార్థులు, గిరిజన సంఘాల నేతలు, కార్యకర్తలు, ఏబీవీపీ, ఇతర విద్యార్థి సంఘాలు, బీజేపీ నేతలు మద్దతుగా నిలవడంతో ఆదివారం రాత్రి నిమ్స్ ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం
మిగతా 3వ పేజీలో ▶

అతన్ని సీనియర్లేమీ అనట్లేదు...
ఫిర్యాదు చేస్తే నాకేమీ నేర్పించకుండా దూరం పెడతారు

సీనియర్ వేధింపులపై తల్లితో ఫోన్లో ప్రీతి చివరి మాటలు
వివరాలు 5లో▶

న్యూస్‌రీల్

ఆయుష్మాన్ భవ


ఉత్తమ వైద్య విధానాలు, ఆరోగ్యంపై జాగ్రత్తలతో మనుషుల సగటు ఆయుర్దాయం పెరుగుతోంది. ఇరవై ఏళ్ల క్రితం భారతదేశంలో సగటు ఆయుర్దాయం 63.9 ఏళ్లుకాగా... ఇటీవలి జాతీయ కుటుంబ సర్వే-5 లెక్కల మేరకు 69.7 ఏళ్లకు పెరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలైతే సగటు ఆయుః ప్రమాణంలో జాతీయ సగటును మించిపోయాయి.
- వివరాలు 2లో▶

స్క్రాప్‌గా మార్చి.. కొత్త ఆటోలు తెచ్చి..!


హైదరాబాద్‌లో కాలంచెల్లిన ఆటోరిక్షాలను స్క్రాప్‌గా మార్చి ఆ పర్మిట్లపై కొత్త ఆటోలను తీసుకొనే విధానంపై ప్రస్తుతం కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తేసేందుకు రవాణాశాఖ సిద్ధమైంది. పాత పర్మిట్లపై కొత్త ఆటోలు పొందే విషయంలో భారీ అక్రమాలు జరిగాయంటూ గతంలో ఆరోపణలు రావడంతో ఆ విధానాన్ని నిలిపివేస్తూ గతేడాది డిసెంబర్‌లో సర్క్యులర్ జారీ చేసింది. ఇప్పుడు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలతో మళ్లీ పాత పద్ధతిని అమల్లోకి తెస్తోంది.
- వివరాలు 14లో▶

ఏసీపీ నేతృత్వంలో నవీన్ హత్యకేసు దర్యాప్తు

హరిహరకృష్ణ

సంచలనం రేకెత్తించిన ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్యకేసులో దర్యాప్తు అధికారిగా వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయన నేతృత్వంలో పోలీసు బృందాలు దర్యాప్తు చేయనున్నాయి. ఈ కేసులో నిందితుడు హరిహరకృష్ణను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.
- వివరాలు 10లో▶


రాజ్‌ఘాట్ నుంచి ఊరేగింపుగా సీబీఐ కార్యాలయానికి వెళ్తున్న సిసోడియా

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో
సిసోడియా అరెస్ట్

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియాను ఆదివారం సీబీఐ అరెస్ట్ చేసింది. సిసోడియా సమాధానాలతో అధికారులు సంతృప్తి చెందలేదని, విచారణలో ఆయన సహకరించడం లేదని సీబీఐ తెలిపింది. కీలకమైన అంశాలపై సిసోడియా సరైన వివరణ ఇవ్వకుండా తప్పించుకున్నందునే అరెస్ట్ చేశామని సీబీఐ అధికారులు వెల్లడించారు. కాగా, తనపై మోపిన తప్పుడు ఆరోపణలపై జైలుకు వెళ్లేందుకైనా భయపడేది లేదని సిసోడియా పేర్కొన్నారు.
వివరాలు 6లో▶

బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ...
ఓ మద్యం కుంభకోణం
ఇరు పార్టీల పోరాటానికి కేంద్ర బిందువు 6లో

ఆశల సౌధం నుంచి.. ఆత్మహత్యల వైపు...

క్షణికావేశంలో తనువు చాలిస్తున్న విద్యార్థులు


తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్న పిల్లలు

- దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆత్మహత్యలు..
- తెలంగాణలో 2021లో 4.51 శాతంగా నమోదు
- కేజీ నుంచి పీజీ దాకా కౌన్సెలింగ్ చేస్తేనే నియంత్రణ

→ నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడకు చెందిన దాసరి హర్ష (21) శనివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అన్ని పరీక్షల్లో మంచి మార్కులు సాధించినప్పటికీ తనువు చాలించాడు.

→ హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని దివ్య (21) శనివారం ఉరేసుకొని చనిపోయింది. కుటుంబసభ్యులతో కలిసి సంజయ్‌గాంధీనగర్‌లో ఉండే దివ్య ఇంటి వెనుకాలే ఉరేసుకొని చనిపోవడం అందరినీ కలిచివేసింది.

→ వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ వైద్య విద్యార్థిని ధారావత్ ప్రీతి సీనియర్ వేధిస్తున్నాడంటూ ఈనెల 22న ఎంజీఎంలో ఆత్మహత్యాయత్నం చేసింది. మృత్యువుతో పోరాడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో ఆదివారం రాత్రి కన్నుమూసింది. 5లో



ఐదేళ్లలో 119 మంది మెడికోల ఆత్మహత్య 5లో మెడికల్ కాలేజీల్లో కౌన్సెలింగ్ కేంద్రాలు

దేశాభివృద్ధిని ప్రపంచం గుర్తిస్తోంది

జీ-20పై సదస్సులో విదేశాంగ మంత్రి జైశంకర్
- కోవిడ్-19, ఉగ్రదాడులపై దేశ స్పందనను ప్రపంచం చూసింది.. అభివృద్ధి చెందిన దేశాలు మన మేధోశక్తి కోసం ఎదురుచూస్తున్నాయి
- అధికారంలో ఉన్న పార్టీతోనే ఇదంతా సాధ్యమైంది


ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్

సాక్షి, హైదరాబాద్: 'ప్రపంచం దృష్టిలో భారత్ ప్రతిష్ట పెరిగింది. దేశాభివృద్ధిని చూసి నమ్మశక్యంగా లేదని ప్రపంచ దేశాధినేతలు ప్రధాని మోదీతో అంటున్నారు. భారీగా వ్యాక్సిన్ల ఉత్పత్తి, సరఫరాను ఎలా విజయవంతం చేశారని ప్రపంచ దేశాలు అడుగుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ (బీజేపీ)తోనే ఇది సాధ్యమైంది..' అని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. 'జీ-20కి భారతదేశ సారథ్యం' అంశంపై నేషనలిస్ట్ థింకర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

ప్రపంచం కోసం దేశాన్ని సంసిద్ధం చేసేలా..
'కోవిడ్-19 సవాళ్లు, ముంబై, బాలాకోట్‌పై ఉగ్రదాడులపై భారత దేశం ఎలా ప్రతిస్పందించిందో ప్రపంచం చూసింది. భారత్ లాంటి కొన్ని దేశాలు మాత్రమే కోవిడ్-19 వంటి విపత్తుల్లో ఇతర దేశాల గురించి ఆలోచించాయని నేడు ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధంతో చమురు, ఎరువులు, ఆహార పదార్థాల ధరలు ప్రపంచ వ్యాప్తంగా భారీగా
మిగతా 2వ పేజీలో ▶

కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి కన్నుమూత


దివంగత సినీ డైరెక్టర్ 'కళాతపస్వి' కె.విశ్వనాథ్ సతీమణి కాశీనాథుని జయలక్ష్మి(88) ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడే ఆమె కన్నుమూశారు. 11లో

ఎస్‌జీడీ ఫార్మా, కార్నింగ్‌తో తెలంగాణ ఒప్పందం
- రూ. 500 కోట్ల పెట్టుబడి పెట్టనున్న ఇరు సంస్థలు
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఫార్మా ప్యాకేజింగ్ యూనిట్
- 150 మందికి పర్మినెంట్ ఉద్యోగాలు

సాక్షి, హైదరాబాద్: ఫార్మాస్యూటికల్ ప్యాకేజింగ్ రంగంలో అంతర్జాతీయంగా పేరొందిన ఎస్‌జీడీ ఫార్మాతోపాటు మరో దిగ్గజ సంస్థ కార్నింగ్ ఇన్‌కార్పొరేటెడ్‌తో భవిష్యత్తు భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రపంచస్థాయి సాంకేతికత, తయారీ నైపుణ్యం తెలంగాణకు అందుతుందని పేర్కొంది. అలాగే కార్నింగ్ అందించే అత్యున్నత నాణ్యతతో కూడిన ఫార్మాస్యూటికల్ ట్యూబ్ టెక్నాలజీ, ఎస్‌జీడీ ఫార్మా గ్లాస్ వైల్ తయారీ నైపుణ్యాల కలబోతకు ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందని వివరించింది. తద్వారా
మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి

కంగ్రాట్స్! మీ మనసులోని మాటను మీరు చెప్పకుండా ఆయనతో చెప్పించారు!


రాజకుమార్ నాయక్

'పేరిణి' రాజ్‌కుమార్ కృషి భేష్
- 'మన్ కీ బాత్'లో తెలంగాణ నృత్య కళాకారుడిని కొనియాడిన ప్రధాని..
- ఏపీకి చెందిన విజయదుర్గకూ ప్రశంసలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ తన మాసాంతపు రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో తెలంగాణ బిడ్డ, పేరిణి నృత్య కళాకారుడు రాజకుమార్ నాయక్‌ను ప్రశంసించారు. ఆదివారం 98వ 'మన్ కీ బాత్'లో దేశ ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, క్రీడలు తదితర అంశాల గొప్పదనం, పరిరక్షణకు కళాకారులు చేస్తున్న సేవలను ప్రశంసించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని దేశభక్తి గీతాలు, ముగ్గులు, లాలిపాటలపై దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీల విజేతలను మోదీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన పేరిణి నృత్యం గొప్పతనం, అందుకు రాజ్‌కుమార్ చేస్తున్న కృషిని కొనియాడారు. కాకతీయుల కాలంలో మహాదేవుడు శివుడికి అంకితం చేసిన పేరిణి నాట్యం ఎంతో పేరొందిందని, ఆ రాజవంశ మూలాలు ఇప్పటికీ తెలంగాణతో ముడిపడి ఉన్నాయని ప్రధాని తెలిపారు. రాజకుమార్ నాయక్ ఒడిస్సీ
మిగతా 2వ పేజీలో ▶

ముందుగానే జనంలోకి!

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రధాన రాజకీయ పక్షాలు



తొమ్మిది నెలల సమయముండగానే క్షేత్రస్థాయిలో హడావుడి

సభలు, సమావేశాలు, పాదయాత్రలతో ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు..

హ్యాట్రిక్‌పై అధికార బీఆర్ఎస్ గురి..

రాష్ట్రవ్యాప్తంగా కేటీఆర్ పర్యటనలు.. నేతలంతా నియోజకవర్గాల్లోనే..

అన్నిచోట్లా హాథ్‌సే హాథ్‌జోడో యాత్రలతో కాంగ్రెస్ హల్‌చల్..

ఇప్పటికే 8 వేలకు పైగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లతో బీజేపీ జోరు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా తొమ్మిది నెలల సమయముంది. అనూహ్య నిర్ణయాలు తీసుకుంటే తప్ప..ప్రస్తుత వాతావరణాన్ని బట్టి చూస్తే ముందస్తు ఎన్నికలకు అవకాశం లేదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. కానీ రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పక్షాలన్నీ అప్పుడే ఎన్నికలు లక్ష్యంగా కార్యాచరణ ప్రారంభించాయి. క్షేత్రస్థాయిలో సభలు, సమావేశాలు, వివిధ రకాల కార్యక్రమాలతో హల్‌చల్ చేస్తున్నాయి. ఓటర్లను తమ పార్టీల వైపు ఆకర్షితుల్ని చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. తమ జెండా, ఎజెండాను జనంలోకి తీసుకెళ్తున్నాయి. అధికార బీఆర్ఎస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నాయకులు, ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ నేతలు ఎన్నికల యుద్ధానికి సమాయత్తమవుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తర్వాత అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు నియోజకవర్గాలకే ఎక్కువ సమయం కేటాయిస్తుండగా, హాథ్‌సే హాథ్‌జోడో యాత్రలతో కాంగ్రెస్ పార్టీ, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల పేరుతో బీజేపీ నేతల హడావుడి ఊపందుకుంది.

సంక్షేమమే బీఆర్ఎస్ ప్రధానాస్త్రం
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే ఈసారి ఎన్నికల్లో కూడా ప్రధానాస్త్రాలుగా వినియోగించుకునే పనిలో అధికార బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బిజీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాలకే పరిమితం అయిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. సభలు, సమావేశాల్లో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు ఆదేశాలందాయి. మరోవైపు పార్టీ పరంగా సమన్వయ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ బూత్ నుంచి జిల్లా స్థాయిలో పార్టీ కేడర్‌ను ఉత్తేజితులను చేసుకునే పనిలో నేతలు నిమగ్నమయ్యారు. గత ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలు ఏ మేరకు
మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

డిమాండ్లు నెరవేరిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

• కేటీఆర్‌కు రఘునందన్‌రావు సవాల్



దుబ్బాక టౌన్: డిమాండ్లు నెరవేరిస్తే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయనని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంత్రి కేటీఆర్‌కు సవాల్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దళితబంధు అమలు చేయాలని, సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.7.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ ఈ రెండు డిమాండ్లు అమలుచేస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటానన్నారు. తన సవాలుకు కేటీఆర్ సిద్ధమా అని ప్రశ్నించారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా కక్ష సాధించడం సరికాదని రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందినట్లేనా అని ప్రశ్నించారు.

28కల్లా 11 వేల మీటింగ్‌లు పూర్తి చేయాలి: బండి




సాక్షి, హైదరాబాద్ : ఈ నెల 28 కల్లా 11 వేల స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ లక్ష్యం పూర్తి చేయాలని పార్టీనాయకులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదేశించారు. ఈ భేటీలు ఏయే జిల్లాల్లో వేగంగా జరగడం లేదో ఆ జిల్లాలకు రాష్ట్ర బృందాలు పంపి వీధి సభలు నిర్వహించాలని సూచించారు. ఈ భేటీల్లో భాగంగా పలుచోట్ల బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులు, శ్రేణులు దాడులకు పాల్పడిన ఘటనలపై ఆరా తీశారు. ఆదివారం 'ప్రజా గోస – బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ తీరుతెన్నులపై జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జిలతో సంజయ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ..స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లకు వస్తున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నేతల్లో భయం మొదలైందన్నారు. అందుకే చాలాచోట్ల బీఆర్ఎస్ నేతలు అడ్డుకుంటున్నారన్నారు. వారి బెదిరింపుల కు, దాడులకు భయపడాల్సిన పనిలేదని, ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తూ భరోసా ఇవ్వాలని సూచించారు. అనంతరం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఇన్‌చార్జి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..'స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్‌లో స్థానిక సమస్యలే ఎక్కువగా చర్చకు వస్తున్నాయన్నారు. నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్‌ని పోలీసులు అడ్డుకున్నారన్నారు. ఈ సమీక్షలో జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికిపాటి మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, అధికార ప్రతినిధి జె.సంగప్ప పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై పరువు నష్టం దావా వేస్తా



నకిరేకల్: రూ.3,500 కోట్లు సంపాదించినట్లు తనతో పాటు నల్లగొండ, తుంగతుర్తి ఎమ్మెల్యేలపై నిరాధార ఆరోపణలు చేసిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై పరువు నష్టం దావా వేస్తున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వెల్లడించారు. తాను అక్రమంగా సంపాదించినట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాలు విసిరారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్ తన స్వలాభం కోసం దళితులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా ఎదుగుతున్న దళిత సమాజంలో ప్రవీణ్ కుమార్ అలజడులు సృష్టిస్తున్నారని లింగయ్య ఆరోపించారు. మహనీయుడు అంబేడ్కర్ రాసిన రిజర్వేషన్ల ఆధారంగా పోలీస్ ఆఫీసర్‌గా ఉద్యోగం అనుభవించి ప్రభుత్వ సొమ్మును దోచుకున్న చరిత్ర ప్రవీణ్‌కుమార్‌ది అన్నారు. తాను సీబీఐ, ఏసీబీ అధికారులతో ఎలాంటి విచారణకైనా, బహిరంగ చర్చకైనా సిద్ధమని లింగయ్య స్పష్టంచేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఉమారాణి కృష్ణమూర్తి, జెడ్పీటీసీ ధనలక్ష్మీ నగేశ్, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ కీలకపాత్ర



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్‌లో జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ అత్యంత కీలకంగా వ్యవహరిస్తుందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలవైపు యావత్తు దేశం చూస్తోందని, దీనికి సరిహద్దు రాష్ట్రాల ప్రజలు ఆకర్షితులై వారి ప్రాంతాలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. సూర్యాపేట జిల్లా సీనియర్ కాంగ్రెస్ నేత, ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ కమిటీ పోరాట సమితి అధ్యక్షుడు ఖాలేద్ అహ్మద్ ఆదివారం జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత కర్ణాటకలోని సరిహద్దు గ్రామాల ప్రజలు కూడా తమ ప్రాంతాలను తెలంగాణలో కలపాలని కోరుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్, జెడ్పీ వైస్‌చైర్మన్ వెంకట నారాయణగౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పెరుగుతున్న ప్రజల జీవితకాలం

ఆయుష్మాన్ భవ



• మగాళ్లతో పోలిస్తే స్త్రీల ఆయుష్షు మరింత ఎక్కువ
• నగటు ఆయుర్దాయంలో ఢిల్లీ రాష్ట్రం టాప్
• మహిళలనే పరిగణనలోకి తీసుకుంటే ఫస్ట్ ప్లేస్‌లో కేరళ
• జాతీయ సగటును మించిన తెలుగు రాష్ట్రాలు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి


ఆయుష్మాన్ భవ.. శతమానం భవతి.. దీవెన ఏదైనా ఎక్కువకాలం హాయిగా బతికేయండి అన్న కోరికే. దీవెనలు ఏమోగానీ.. ఉత్తమ వైద్య విధానాలు, ఆరోగ్యంపై జాగ్రత్తలతో మనుషుల సగటు ఆయుర్దాయం మాత్రం పెరుగుతోంది. 'ఆరోగ్యం అంటే.. శారీరకంగా, మానసికంగా, సామాజికంగా పూర్తి హాయిగా జీవించే స్థితి. ఈ మూడు అంశాలే మనిషి ఆయుష్షును నిర్ధారిస్తాయి' అన్నది ప్రపంచ ఆరోగ్యసంస్థ సూత్రీకరణ. దీనికితోడు కరోనా మహమ్మారి కారణంగా జనంలో ఆరోగ్యం పట్ల పెరిగిన జాగ్రత్తలూ ప్రభావం చూపుతున్నాయి. ఇంటింటా ఆక్సిజన్, థర్మా మీటర్లు, ఆన్‌లైన్‌లోనూ డాక్టర్ సలహాలు, ఇంటి ముందుకే వచ్చే ఔషధాలు, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, వ్యాయామంపై ఆసక్తి.. వంటివి జీవనశైలిని మార్చేశాయి. ఇది ఆయుర్దాయం మరింతగా పెరిగేందుకు దోహదపడుతోంది. సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం భారతదేశంలో సగటు ఆయుర్దాయం 63.9 ఏళ్లుకాగా... ఇటీవలి జాతీయ కుటుంబ సర్వే–5 లెక్కల మేరకు 69.7 ఏళ్లకు పెరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలైతే సగటు ఆయుః ప్రమాణంలో జాతీయ సగటును మించిపోయాయి. 2003–04లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 64.6 ఏళ్ల సగటు ఆయుర్దాయం ఉండగా.. తాజా లెక్కల్లో ఆంధ్రప్రదేశ్‌లో 70.3 ఏళ్లు, తెలంగాణలో 69.8 ఏళ్లుగా నిర్ధారించారు. అయితే దక్షిణాది రాష్ట్రాలతో (కేరళ మినహా) పోలిస్తే ఉత్తరాది రాష్ట్రాల్లో సగటు ఆయుర్దాయం ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

అందరిలో ఢిల్లీ.. మహిళల్లో కేరళ..

తీవ్రమైన చలి ఓవైపు.. అధిక ఎండలు ఇంకోవైపు.. 3 నెలల పాటు ఊపిరి ఆడని కాలుష్యం ఇంకోవైపు కమ్మేస్తున్నా 75.9 ఏళ్ల సగటు ఆయుర్దాయంతో దేశంలో ఢిల్లీ టాప్ ప్లేస్‌లో నిలిచింది. కేవలం మహిళల ఆయుర్దాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే కేరళ 78 ఏళ్ల ఆయుష్షుతో టాప్ ప్లేస్‌లో ఉంది. ఇక దక్షిణ భారతంతో పోలిస్తే.. ఉత్తరాన చల్లని వాతావరణం, ఆహార అలవాట్లు, శారీరక శ్రమ వంటి వాటితో ఆయుర్దాయం కాస్త ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెప్తున్నారు. దీనితోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో దేశ సగటును మించి మధుమేహం, అధిక రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు ఆయుష్షుపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషిస్తున్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాలతో..

దేశంలో కేన్సర్, గుండె, నాడీ సంబంధ వ్యాధులతో అకాల మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. 'హెల్తీ ఫిట్ నేషన్' దిశగా ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తుండటంతో ప్రజలకు మెరుగైన వైద్యం చేరువవుతోంది. వ్యాధి నిర్ధారణ, మెరుగైన చికిత్సలకు మరోవైపు మహిళలు, పసిపిల్లల్లో పోషకాహార లోపం నియంత్రణ, వృద్ధుల కోసం నిర్వహిస్తున్న జెరియాట్రిక్ కేర్‌లు సత్ఫలితాలు ఇస్తున్నాయి. దీంతో వచ్చే ఆరేళ్లలో ఉత్తరాది రాష్ట్రాలను మించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఆయుర్దాయం పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. తెలంగాణలో ప్రస్తుతం 80ఏళ్ల నుంచి 107 ఏళ్ల మధ్య వయసున్న వారు 4,87,950 మంది ఉన్నట్టు 2023 ఓటర్ల జాబితా గణాంకాలు చెప్తున్నాయి.







జగమంత కుటుంబం నాది..

నాగర్ కర్నూల్ జిల్లా సిర్సవాడకు చెందిన గంటా వెంకట రమణమ్మ వయసు 107 సంవత్సరాలు. తెలంగాణలో అందరికంటే పెద్ద వయసు వ్యక్తి ఈమెనే. దశాబ్దాలుగా మూడు పూటలా సంకటి, అంబలి తీసుకుంటూ పొలం పనులతో శారీరక శ్రమ చేసిన ఆమె.. ఇప్పటికీ మందులు, ఇంజక్షన్ల అవసరమే రాలేదని చెప్తున్నారు. ఆమెకు ఏడుగురు కొడుకులు, ఒక బిడ్డ. వారి సంతానం కూడా కలిపితే మొత్తం 186 మంది. ఇటీవలే రమణమ్మ జన్మదినం సందర్భంగా అంతా కలిసి వేడుక కూడా చేశారు.

"వాతావరణ పరిస్థితులు, ఆహార అలవాట్లతో పాటు శారీరక శ్రమతో ఎక్కువకాలం జీవించే అవకాశం ఉంటుంది. దక్షిణాది వారితో పోలిస్తే ఉత్తర భారతీయులు శారీరక శ్రమ అధికంగా చేస్తారు. దానికితోడు అక్కడి వాతావరణ పరిస్థితులు, ఆహార అలవాట్ల వల్ల కూడా.. ఉత్తర భారతదేశ రాష్ట్రాల్లో సగటు ఆయుష్షు కాస్త ఎక్కువగా ఉంటుంది."

– డాక్టర్ సి.మోహన్‌రావు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్



5జీ బామ్మ

కామారెడ్డి జిల్లా చిట్యాలకు చెందిన మల్లుం బాలవ్వ వయసు 102 ఏళ్లు. ఆమెకు ముగ్గురు బిడ్డలు, ఇద్దరు కొడుకులు. వారి పిల్లలు, మనవళ్లతో కలిపి మొత్తం 94 మంది. ఇప్పుడు ఆమె ఐదో తరాన్ని (5జీ) చూస్తున్నారు. ఇటీవలే బాలవ్వ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వెండి గిన్నెలో పాలు పోసి బంగారు పాత్రతో ఐదో తరం మునిమనవళ్లకు పాలు పట్టించింది ఆమె. భూమాతతో బంధం పోనివ్వనంటూ కాళ్లకు చెప్పుల్లేకుండానే పనులన్నీ చక్కబెట్టుకోవటం బాలవ్వ ప్రత్యేకత.

సిసోడియా అరెస్టు అప్రజాస్వామికం:కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అరెస్టును బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఖండించారు. మనీష్ సిసోడియా అరెస్టు అప్రజాస్వామికమని, బీజేపీ ప్రతిపక్ష పార్టీలపై వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గపూరితమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన పరిధిలోని ఏజెన్సీలను ప్రతిపక్షాలపై ఉసిగొలిపి దొంగచాటు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాబలం లేక అధికారంలోకి రాలేని రాష్ట్రాల్లో అక్కడి పార్టీలను బలహీనపరిచే కుట్రలో భాగమే సిసోడియా అరెస్ట్ అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో సుప్రీంకోర్టుతో చీవాట్లు తిన్నాక ఎదురైన పరాజయాన్ని తట్టుకోలేక సిసోడియాను ఇప్పుడు అరెస్ట్ చేశారని ఆరోపించారు. అసమర్థ విధానాలను, అవినీతిని ప్రశ్నిస్తున్న బలమైన పార్టీల నాయకులను ఎదుర్కోలేక బీజేపీ పిరికి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బీజేపీ తన పార్టీలోని అవినీతి నాయకులను సత్య హరిశ్చంద్రుని సహోదరులుగా చూపించి, ప్రతిపక్ష నేతలను అవినీతిపరులుగా చిత్రీకరించేందుకు కుటిల ప్రయత్నాలను చేస్తోందని ఎద్దేవా చేశారు. నీతిలేని దుర్మార్గపు రాజకీయాలను దేశం గమనిస్తోందని, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలను ప్రజలు కచ్చితంగా తిప్పి కొడతారని పేర్కొన్నారు. భవిష్యత్తులో బీజేపీ నాయకులకు ఇదే గతి పడుతుందని కేటీఆర్ హెచ్చరించారు.

దేశాభివృద్ధిని ప్రపంచం గుర్తిస్తోంది

▶ మొదటి పేజీ తరువాయి

పెరిగినా, దేశ ప్రజలపై భారం పడకుండా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇతర దేశాలకు ఇది సాధ్యం కాలేదు. 40 వేల మంది భారతీయ చిప్ డిజైనర్లు, ఇంజనీర్లు లేకుంటే అమెరికన్ చిప్ ఇండస్ట్రీకి మనుగడ ఉండదు. భూకంపంతో అతలాకుతలమైన టర్కీలో 24 గంటల్లోగా ఆస్పత్రిని ఏర్పాటు చేశాం. విపత్తుల్లో స్పందించే తొలి దేశంగా, పెద్ద మనస్సు ఉన్న ఉదార దేశంగా భారతదేశాన్ని ప్రపంచం చూస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు భారతీయ మేధో శక్తి కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచం కోసం దేశాన్ని సంసిద్ధం చేయడం భారత్ ముందున్న లక్ష్యం. జీ–20 సదస్సు తర్వాత దేశ విశ్వసనీయత పెరుగుతుంది. ఈ ఏడాది ప్రపంచ వృద్ధి రేటులో భారతదేశం 15 శాతం వాటా కలిగి ఉండనుందని ఐఎంఎఫ్ అధ్యక్షురాలు నాతో అన్నారు..' అని జైశంకర్ తెలిపారు.

హైదరాబాద్‌లో 6 సమావేశాలు

'జీ–20 సదస్సును దేశం అపూర్వ రీతిలో నిర్వహిస్తోంది. ప్రపంచ గమనాన్ని నిర్దేశించే సర్వోన్నత వేదిక ఇది. దేశంలోని 56 నగరాల్లో 250 సమావేశాలు నిర్వహిస్తున్నాం. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాచుర్యం కల్పించడం, ప్రపంచంలో అత్యంత పురాతన సంస్కృతి అయిన భారతీయ సంస్కృతికి విశ్వ సంస్కృతిగా గుర్తింపు కల్పించడం ప్రధాని మోదీ మరో ఉద్దేశం. 85 శాతం ప్రపంచ దేశాలు, 65 శాతం ప్రపంచ జనాభా, 75 శాతం ప్రపంచ వాణిజ్యానికి ప్రాతినిధ్యం కలిగిన జీ–20 సదస్సు భారతదేశానికి గొప్ప అవకాశం. ఈ సదస్సులో భాగంగా హైదరాబాద్‌లో 6 సమావేశాలు జరుగుతాయి. ప్రపంచం ముందున్న పెను సవాళ్లకు సమష్టి వ్యూహాలు అందించడం జీ–20 ముఖ్య ఉద్దేశం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కోవిడ్–19 ప్రభావం, ఉక్రెయిన్–రష్యా యుద్ధం, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం అనే నాలుగు ప్రధాన సమస్యలపై జీ–20లో చర్చిస్తాం..' అని చెప్పారు.



కొన్ని నగరాలను అలంకరించడం లేదు

జీ–20 అతిథులందరూ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి దేశం గురించి వారి దేశాల్లో ప్రచారం చేయాలనేది ప్రధాని మోదీ ఆలోచన అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. సదస్సు జరిగే అన్ని నగరాలను అద్భుతంగా అలంకరిస్తుండగా, కొన్ని నగరాలను అలంకరించడం లేదని హైదరాబాద్ పేరు ప్రస్తావించకుండా ఆయన విమర్శించారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు సదస్సులో మాట్లాడారు.

'పేరిణి' రాజ్‌కుమార్ కృషి భేష్

▶ మొదటి పేజీ తరువాయి

నాట్యంలోనూ గుర్తింపు పొందారన్నారు.

దేశభక్తి గీతాల పోటీ విజేతగా విజయదుర్గ..

దేశభక్తి గీతాల పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టి.విజయదుర్గను విజేతగా ప్రధాని మోదీ ప్రకటించారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి స్ఫూర్తితో విజయదుర్గ దేశభక్తి గీతాన్ని రచించారని పేర్కొన్నారు. ''రేనాడ ప్రాంత వీరా! ఓ వీర నరసింహా! భారత స్వాతంత్ర్య పోరాటానికి అంకురానివి! అంకుశానివి! ఆంగ్లేయుల అన్యాయమైన నిరంకుశ దమనకాండను చూసి మీ రక్తం మండింది మంటలు లేచాయి! రేనాడు ప్రాంత సూర్యుడా! ఓ వీర నరసింహా!''అనే దేశభక్తి గీతాన్ని ఈ సందర్భంగా వినిపించారు. అలాగే వి.దుర్గాదేవి అనే మహిళ కరకట్టం అనే పురాతన నృత్య విభాగంలో అవార్డు పొందారన్నారు.

ఆనందంగా ఉంది..

సూర్యాపేట/హన్మకొండ కల్చరల్: సూర్యాపేట జిల్లా బీబీగూడెం తండాకు చెందిన రాజ్‌కుమార్ నాయక్.. ప్రధాని మోదీ తన పేరును ప్రస్తావించడంపై సంతోషం వ్యక్తం చేశాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీ గూడెం గ్రామానికి చెందిన ధరావత్ రాజ్‌కుమార్ నాయక్ పేరిణి శివ తాండవం నృత్యంలో ప్రసిద్ధి పొందారు. ఈయన తల్లిదండ్రులు ధరావత్ సక్రి, నర్సింహ వ్యవసాయ కూలీలు. రాజ్‌కుమార్ నృత్యంపై ఉన్న మక్కువతో 15 ఏళ్ల వయస్సులోనే సూర్యాపేటకు చెందిన అబ్దుల్ పాషా వద్ద నృత్యం నేర్చుకొని తన ప్రతిభను చాటుతూ అనేక రకాల ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నటరాజ రామకృష్ణ వద్ద తెలంగాణలోనే ప్రత్యేకమైన పేరిణి శివతాండవ నృత్యాన్ని నేర్చుకున్నారు. అనేక ప్రదర్శనలు ఇస్తూ తన ముద్ర వేశారు. సూర్యాపేటలో పీఆర్‌కే (పేరిణి రాజ్‌కుమార్) డ్యాన్స్ ఇనిస్టిట్యూట్‌ను నెలకొల్పి ఐదేళ్ల నుంచి యువతకు పేరిణి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. పేరిణినృత్యంలో చూపిన ప్రతిభకు గాను ఇటీవల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

బీఆర్ఎస్ మహారాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షునిగా మాణిక్ కదం

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర కిసాన్ సమితి మహారాష్ట్ర అధ్యక్షునిగా మాణిక్ కదం నియమితులయ్యారు. పర్బనీకి చెందిన ఈయనను నియమిస్తూ బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కు చైనా విరాళాలెలా వచ్చాయి?

• రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కు చైనా నుంచి విరాళాలు వస్తున్నాయని కేంద్ర యువజన, క్రీడలు, సమాచార శాఖమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ ఆరోపించారు. ఈ చందాలు ఎవరెవరు ఇచ్చారు? ఎందుకిచ్చారో రాహుల్‌గాంధీ వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు చైనా భారత్‌లో దురాక్రమణకు పాల్పడుతున్నప్పుడు రాహుల్‌గాంధీ చైనా అధికారులతో కలిసి విందులో పాల్గొన్నారని, ఆ విందు కేంద్రంగా ఎలాంటి ప్రణాళికలు రచించారో ప్రజలకు చెప్పాలన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో కలిసి అనురాగ్‌సింగ్ మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ మన దేశ సైనికులను హేళన చేస్తూ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. దళితబంధు, దళితులకు మూడెకరాల భూమి, పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు, జర్నలిస్టులకు ఇళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. కర్ణాటక రాష్ట్రానికి ఎన్నో స్టార్టప్ కంపెనీలు, పెట్టుబడులు వస్తున్నాయని, తెలంగాణకు మాత్రం రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతోందన్నారు. తెలంగాణలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్సలెన్సీ కేంద్రాలు తెరుస్తామని చెప్పారు.

ఓబీసీ జాబితాలోకి లింగాయత్‌లు

• మరికొన్ని కులాలనూ చేర్చుతాం
• జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ ఆహిర్ హామీ



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే లింగాయత్‌సహా మరికొన్ని బీసీ కులాలకు జాతీయ ఓబీసీ జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకుంటామని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం ఆహిర్ హామీ ఇచ్చారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో హన్సరాజ్‌ను వీరశైవ లింగాయత్ సామాజిక వర్గం నేతలు కలిశారు. జాతీయ ఓబీసీ జాబితాలో చేరేందుకు తాము పూర్తిగా అర్హులమని వారు వివరించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో తమతోపాటు వివిధ బీసీ సామాజికవర్గాలు ఓబీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసి జాతీయ ఓబీసీ జాబితాలో తమను కలపకపోవడంవల్ల విద్య, ఉద్యోగాలపరంగా నష్టపోతున్నామని వినతి పత్రం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన హన్సరాజ్ లింగాయత్‌తోసహా ఆయా కులాలను జాతీయ ఓబీసీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారు. హన్సరాజ్‌ను కలిసిన వారిలో రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, వీరశైవ లింగాయత్ పెద్దలు అశోక్ ముస్తాపురే, సంకటాల సోమేశ్వర్, మల్లికార్జున్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

బీజేపీతోనే పేదలకు న్యాయం: బండి

పేదల పార్టీ బీజేపీ అయితే బీఆర్ఎస్ పెద్దల పార్టీ అని బండి సంజయ్ విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ పాలనపట్ల విసిగిపోయారని, వారంతా బీజేపీవైపు చూస్తున్నారని పేర్కొన్నారు. హన్సరాజ్ గంగారాంకు సంజయ్ శాలువా కప్పి సన్మానించారు.

తెలంగాణ అభివృద్ధి మా ఘనతే: చంద్రబాబు

• మార్చి 29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి
• ఇంటింటికీ తెలుగుదేశం ప్రారంభోత్సవం సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి, హైదరాబాద్: 'హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు దీటుగా మూడో నగరంగా సైబరాబాద్ నిర్మించాం, హైటెక్ సిటీ అభివృద్ధి చేశాం. నాలెడ్జ్ హబ్‌గా రాష్ట్రాన్ని మార్చాం. ఇప్పటి తెలంగాణ అభివృద్ధి అంతా నేను వేసిన పునాదులపై నడుస్తోంది'అని తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన ఆదివారం 'ఇంటింటికీ తెలుగుదేశం'కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..అప్పట్లో బయోటెక్నాలజీని తాను ప్రారంభించినప్పుడు అదంటే ఏంటో ఎవరికీ అర్థం కాలేదని, ఈ రోజు కరోనా వ్యాక్సిన్ తయారీకి అదే వేదికైందని తెలిపారు. 2030నాటికి తెలంగాణ రూ 20లక్షల కోట్ల టర్నోవర్‌కు చేరుతోందంటే అందుకు కూడా తానే కారణమవుతానన్నారు. ఐటీ ఎగుమతులు ఏటా రూ. 2లక్షల కోట్లు ఉన్నాయంటే అదంతా టీడీపీ పాలన ఘనతేనని, ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ, నల్సార్ వర్సిటీ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, అన్నీ తాను తెచ్చినవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రజలకు సాధికారతను, రాజకీయ అధికారాన్ని ఇచ్చిందే టీడీపీనే అని తెలిపారు.

టీడీపీ వల్లే హైదరాబాద్‌లో భూములకు విలువ

హైదరాబాద్ నగర శివారు జిల్లాల్లో భూముల విలువ రూ. కోట్లలో పలుకుతుందంటే అదంతా తన ఘనతేనని చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగుదేశం కల్పించిన మౌలికవసతుల వల్లే ఇక్కడి భూములు కామధేనువులయ్యాయని వ్యాఖ్యానించారు. మార్చి 29న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని, పరేడ్ గ్రౌండ్లో కాసాని జ్ఞానేశ్వర్ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రావుల చంద్రశేఖర్ రెడ్డి , కాట్రగడ్డ ప్రసూన, మాజీ ఎంపీ కంభంపాటి రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నన్ను ఓడించేందుకు రూ.1,000 కోట్లు

• సీఎం కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



జోగుళాంబ శక్తిపీఠం (అలంపూర్):రాబోయే ఎన్నికల్లో బహుజన రాజ్యం అధికారంలోకి వస్తుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా ఆలంపూర్‌లో జరిగిన బహుజన రాజ్యాధికార యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎస్పీకి ప్రజలందరూ బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. తనను ఓడించేందుకు కేసీఆర్ రూ.1,000 కోట్లు దగ్గర పెట్టుకున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.15 లక్షల కోట్ల కాంట్రాక్టర్లు ఆంధ్ర పాలకులకు, అక్కడి గుత్తేదారులకు కట్టబెట్టారన్నారు. సిద్దిపేట నియోజకవర్గానికి రూ.700 కోట్లు, గజ్వేల్‌కు రూ.600 కోట్లు కేటాయించి.. ఆలంపూర్‌కు మాత్రం రూ.20 కోట్లు ఇచ్చి ఈ ప్రాంతాన్ని అవమానించారని విమర్శించారు. 2016లో తుమ్మిళ్ల ప్రాజెక్టును రూ.780 కోట్లతో మొదలుపెట్టి ఇప్పటికీ కనీసం రూ.300 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు.

ముందుగానే జనంలోకి!

▶ మొదటి పేజీ తరువాయి

నెరవేరాయి? ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులేంటి? ప్రజల మూడ్ ఎలా ఉంది? అన్నదానిపై సమాచారం తీసుకుంటూ వచ్చే ఎన్నికల్లో ప్రజలకు ఇవ్వాల్సిన హామీల చిట్టాలను సిద్ధం చేస్తున్నారు. యువతను ఆకర్షించాలనే వ్యూహంతో రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాల్లో 'కేసీఆర్ కప్'పేరుతో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలెవరూ హైదరాబాద్‌కు రావాల్సిన పని లేదని, నియోజకవర్గాల్లోనే ఉండి ప్రజలతో మమేకం కావాలని పార్టీ అధినాయకత్వం ఆదేశించింది. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రానున్న రెండు నెలల కాలంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించాలనే యోచనలో కేటీఆర్ ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తం మీద వచ్చే ఎనఎన్నికల్లో కూడా విజయం సాధించడం ద్వారా హ్యాట్రిక్ కొట్టాలని బీఆర్ఎస్ పట్టుదలతో ఉంది.

'హాథ్‌సే హాథ్ జోడో' పైనే ఆశలు

ఎన్నికలు లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లే పనిలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా ఉత్సాహంగా ముందుకెళుతోంది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రకు కొనసాగింపుగా ఏఐసీసీ పిలుపు మేరకు ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభించిన హాథ్ సే హాథ్‌జోడో యాత్రలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పటికే జోరుగా యాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీలపై విరుచుకుపడుతున్న రేవంత్.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. తాను యాత్ర నిర్వహించిన చోట్ల దాని ప్రభావం ఖచ్చితంగా ఉండేలా స్థానిక ఎమ్మెల్యేలు, అధికారంలో ఉన్న పార్టీల నేతలపై చార్జిషీట్లు వేస్తున్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలపై రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే ఐదు చార్జిషీట్లు విడుదల చేశారు. మరిన్ని చార్జిషీట్లు రూపొందించేందుకు ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో కసరత్తు జరుగుతోంది. మరోవైపు టీపీసీసీ కీలక నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు కూడా ఈ యాత్రలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఎన్నికల వరకు ఎడతెరిపి లేకుండా..

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ కోసం పోరాడుతోంది. ఎన్నికల కార్యాచరణలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు దీటుగా ముందుకెళుతోంది. ఇప్పటికే ప్రజాసంగ్రామ యాత్రల పేరుతో ఐదు విడతల పాదయాత్రలు పూర్తి చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మరో విడత యాత్రకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లకు కమలదళం శ్రీకారం చుట్టింది. 'ప్రజాగోస–బీజేపీ భరోసా'పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలెదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఎత్తి చూపుతోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి వల్ల కలిగే లబ్ధిని ప్రజలకు వివరిస్తోంది. ఈ నెల 10–28 వరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శక్తి కేంద్రాల (మూడు లేదా నాలుగు పోలింగ్ బూత్‌లు కలిపి) స్థాయిలో 11 వేల స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ నేతలు ఇప్పటికే 8 వేల వరకు సమావేశాలు పూర్తి చేశారు. మిగతా సమావేశాలు కూడా పూర్తి చేయడంతో పాటు వచ్చే నెలలో మరో కార్యక్రమ నిర్వహణపై దృష్టి పెట్టారు. బూత్ స్వశక్తీకరణ్ అభియాన్ పేరుతో మార్చి 12 నుంచి 20 వరకు కార్యక్రమం నిర్వహించేందుకు కసరత్తు ఊపందుకుంది. తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్ లాంటి నేతలు, కేంద్ర మంత్రులతో పాటు వీలున్నప్పుడల్లా అమిత్‌షా లాంటి దిగ్గజ నేతల పర్యటనలతో ఎన్నికల వరకు ఎడతెరిపి లేకుండా ప్రజల్లోనే ఉండాలనే వ్యూహంతో బీజేపీ కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ మూడు పార్టీలే కాకుండా ఎంఐఎం, వామపక్షాలు, వైఎస్సార్‌టీపీలు కూడా ప్రజలకు చేరువయ్యేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.

క్లుప్తంగా...

'ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్'గా భారత్

కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



సాక్షి, హైదరాబాద్: వినియోగదారులకు నాణ్యతతో కూడిన ఫార్మా ఉత్పత్తులను అందిస్తామనే భరోసా ఇచ్చి 'ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్'గా భారతదేశం కీర్తికెక్కిందని కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియా వెల్లడించారు. 'ఔషధాలు: నాణ్యతా నిబంధనల అమలు'పై కేంద్ర సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్, కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబాతో కలిసి రెండ్రోజుల చింతన్ శిబిర్‌ను మాండవీయ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఫార్మా, ఆరోగ్య రంగాలలోని వాటాదారులు, లబ్ధిదారులందరికీ పటిష్టమైన నియంత్రణ వ్యవస్థలను నిర్మించడానికి, అందుకు సంబంధించిన విధానాల కోసం మార్గాలను చర్చించడానికి చింతన్ శిబిర్ ఒక వేదికన్నారు.

ఎస్‌జీడీ ఫార్మా, కార్నింగ్‌తో తెలంగాణ ఒప్పందం

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్‌జీడీ ఫార్మాస్యూటికల్ సామర్థ్యం ప్రైమరీ ప్యాకేజింగ్ భారత్‌తోపాటు అంతర్జాతీయ వినియోగదారులకు తెలంగాణ నుంచి సరఫరా అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రైమరీ ప్యాకేజింగ్ రంగంలో కార్నింగ్, తెలంగాణ ప్రభుత్వంతో తాము కుదుర్చుకొనే భాగస్వామ్యం ద్వారా ప్రైమరీ ప్యాకేజింగ్ సప్లై చైన్‌లో తెలంగాణ పురోగమిస్తుందని ఎస్‌జీడీ ఫార్మా ఎండీ అక్షయ్ సింగ్ వెల్లడించారు. ఈ భాగస్వామ్యం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు రూ.500 కోట్ల పెట్టుబడి, 150 మందికి శాశ్వత ఉద్యోగాలు, మరో 300 మందికి కాంట్రాక్టు ప్రాతిపదికన 2024 ఆరంభం నాటికి లభిస్తాయి. ఎస్‌జీడీతో తమ భాగస్వామ్యం ద్వారా కీలకమైన ఔషధాల సరఫరా వేగవంతం అవుతుందని కార్నింగ్ ఇండియా ఎండీ సుధీర్ పిళ్లై అన్నారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల జాబితాలో ఉన్న కార్నింగ్... ఎస్‌జీడీ ఫార్మా భాగస్వామ్యంలో తెలంగాణలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన యూనిట్ ఏర్పడుతుందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. తెలంగాణలో ఫార్మాస్యూటికల్ ప్యాకేజింగ్ గ్లాస్ తయారీ ద్వారా లైఫ్ సైన్సెస్ రంగం వృద్ధి శరవేగంగా జరుగుతుందని చెప్పారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగం విలువ 250 అమెరికన్ డాలర్లకు చేరాలని... తమ భవిష్యత్తు లక్ష్యానికి ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

గిర్నితండాలో గిరిజనుల ధర్నా.. కేఎంసీలో విద్యార్థుల ఆందోళన

ప్రీతి ఘటనను నిరసిస్తూ వెల్లువెత్తిన నిరసనలు



కొవ్వొత్తుల ప్రదర్శనలో విద్యార్థి సంఘాల నాయకులు

కొడకండ్ల/ఎంజీఎం/వరంగల్/కాశిబుగ్గ: ప్రీతి ఘటనలో కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీల నిర్లక్ష్యం ఉన్నందున వారిని సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలంటూ ఆదివారం రాత్రి గిర్నితండాలో స్థానికులు, మైదంచెరువుతండా గిరిజనులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. జనగామ–సూర్యాపేట రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు చేరుకొని ఆందోళనను విరమింపజేశారు. అలాగే, ప్రీతి ఆత్మహత్యకు కారకుడైన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. ప్రీతి మృతికి సంతాపం తెలుపుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా.. పోలీసులు విద్యార్థులను అడ్డుకుని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, ప్రీతి మృతికి కారకులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ట్రైబల్ డెమొక్రటిక్ ఫ్రంట్ స్టేట్ కన్వీనర్ పోరిక ఉదయ్‌సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం ఉమ్మడి జిల్లా బంద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు.

ప్రీతిది ముమ్మాటికీ హత్యే: తండ్రి నరేందర్

లక్డీకాపూల్: ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆమె తండ్రి ధరావత్ నరేందర్ డిమాండ్ చేశారు. నిమ్స్‌లో ఆదివారం అర్ధరాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ''ప్రీతి ఎందుకు చనిపోయింది? ఎలా చనిపోయింది? నాకు కారణం చెప్పకుండా మృతదేహాన్ని తీసుకుపొమ్మంటే ఎలా? నాపై ఒత్తిడి తెస్తే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటా. అసలు ఎంజీఎంలో ఆ రోజు రాత్రి ఏం జరిగింది? చికిత్స ఏం చేశారు? కేస్ హిస్టరీ షీట్ నాకు ఇవ్వాలి. ప్రీతి సూసైడ్ చేసుకుంది అంటున్నారు. అది సూసైడ్ కాదు.. ముమ్మాటికీ హత్యే. దీనిపై కమిటీ వేసి నిష్పక్షపాతంగా విచారణ చేయాలి. అది కూడా ప్రభుత్వ అధికారులతో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి. ప్రీతి ఘటనలో వాస్తవాలు బయటికి రావాలి. కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు పదవిలో ఉండగా విచారణ సరిగా జరగదు. వారిని వెంటనే సస్పెండ్ చేసి.. ఆ తర్వాతే విచారణ చేయాలి'' అని నరేందర్ డిమాండ్ చేశారు.

నమామి.. గోదావరి!

నదీ తీరాన పురాతన, సాంస్కృతిక విశేషాలను తేల్చే విస్తృత అధ్యయనం

- 'నమామి గంగ'తరహాలో విస్తృతంగా చేపట్టేందుకు ఇంటాక్ ప్రణాళిక
- నది పొడవునా తీరానికి ఐదు కిలోమీటర్ల బఫర్ ప్రాంతంలో స్టడీ
- మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నిర్వహణకు ఏర్పాట్లు



సోన్ వంతెన



▼ బాదన్‌కుర్తి గ్రామం ఉన్న గోదావరి చీలిక ప్రాంతం

బావరి.. బుద్ధుడిని బతికుండగా కలిసి, ఆయన బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు బయలుదేరిన భక్తుడు. ఆయన నివసించిన ప్రాంతం ప్రస్తుత నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో గోదావరి రెండుగా చీలిన ప్రాంతంలో ఉన్న బాదన్‌కుర్తి గ్రామం అని అంచనా. ఆయన మరికొందరితో కలిసి ఇక్కడి నుంచే బౌద్ధంపై ప్రచారం ప్రారంభించారని చెప్తుంటారు.

గోదావరి నదిపై ఆదిలాబాద్-నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలను అనుసంధానిస్తూ 1932లో నిర్మించిన రాతి వంతెన. నాడు ఆసియాలో ఈ తరహా తొలి వంతెన ఇదేనని చెప్తారు. 775 మీటర్ల పొడవైన ఈ వంతెన ప్రత్యేకతలకు మెచ్చి వెండితో దాని నమూనాను చేయించుకుని నిజాం తన నివాసంలో పెట్టుకున్నారు. పురానీ హవేలీలో అది ఇప్పటికీ ఉంది. ఈ వంతెన ఉన్న గ్రామం పేరు సోన్. అదో అగ్రహారం.. దాని వెనక చారిత్రక నేపథ్యమూ ఉంది.

వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చే విదేశీ పక్షులు గోదావరి నదిని ఆలంబనగా చేసుకుంటున్నాయి. గుడ్లు పెట్టి, పిల్లలను పొదిగేందుకు గోదావరి తీర ప్రాంతాలను ఎంచుకున్నాయి.

.. ఇలా గోదావరి నదీ తీరాన్ని తరిచి చూస్తే ఎన్నో ప్రత్యేకతలు కనిపిస్తాయి. స్థానికులకు తప్ప బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని ఆసక్తికర, ఆశ్చర్యకర విశేషాలూ మరెన్నో ఉన్నాయి. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాల్లో 1,465 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తూ దక్షిణ గంగగా పేరొందిన గోదావరి నదీ తీరంపై అధ్యయనం చేసేందుకు భారీ ప్రణాళిక సిద్ధమవుతోంది.

- సాక్షి, హైదరాబాద్

నమామి గంగ స్ఫూర్తితో..

ప్రపంచంలోని పెద్ద నదుల్లో ఒకటి, భారతీయులకు పవిత్రమైనదీ అయిన గంగా నదిపై 'ది ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్)'నాలుగేళ్లపాటు విస్తృత అధ్యయనాన్ని నిర్వహించింది. గంగా నది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నమామి గంగ'ప్రాజెక్టులో భాగంగా.. కాలుష్య కోరల నుంచి నదిని రక్షించడం, నదీ తీరంలో విలసిల్లుతున్న ప్రత్యేకతలను ప్రపంచం దృష్టికి తేవడం కోసం ఈ అధ్యయనానికి ఆదేశించింది. ఇంటాక్ నిపుణులు బృందాలుగా విడిపోయి నదికి రెండు వైపులా ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రత్యేకతలపై అధ్యయనం చేసి డాక్యుమెంటరీలు రూపొందించారు. అధ్యయనం ఆధారంగా నాలుగు పుస్తకాలను కూడా ప్రచురించారు. నది ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక, సహజ వారసత్వాలపై శోధించి ఎన్నో వివరాలు వెలుగులోకి తెచ్చారు. గంగా నది మలుపులు తిరిగే ప్రాంతంలో ఏర్పడిన పాయలు ఏకంగా 20 కిలోమీటర్ల వెడల్పున ప్రవహిస్తూ ప్రత్యేక వెట్‌ల్యాండ్‌గా మారి.. జీవ వైవిధ్యాన్ని ఎలా పెంచుతున్నాయో ప్రత్యేక డాక్యుమెంటరీగా రూపొందించారు. గంగా తీరం అంటేనే ఆధ్యాత్మిక పరిమళం. మహా భారత, రామాయణాలతో ముడిపెట్టి స్థానికులు ప్రచారం చేసుకునే కొన్ని ప్రాంతాల్లో పురాతన నిర్మాణ జాడలను గుర్తించారు. ఇప్పుడు వాటిపై పరిశోధనలకు అవకాశం ఏర్పడింది. ఇక బుద్ధుడి కాలం నాటి ప్రత్యేకతలతోపాటు ఆదిమానవుల నాటి నిర్మాణాలనూ గుర్తించారు.

గోదావరిపైనా అధ్యయనం కోసం..

దేశంలో గంగా నది తర్వాత పెద్ద నదిగా ఉన్న గోదావరిపై కూడా ఇలాంటి అధ్యయనం చేస్తే బాగుంటుందని ఇంటాక్ సంస్థ భావించింది. దీనిపై ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించగా.. అనుమతిస్తూ, అవసరమైన సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. తర్వాత ఇంటాక్ ప్రతినిధులు ఇటీవల తెలంగాణ అధికారులను కలిసి చర్చించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా నివేదించనున్నారు.

త్వరలోనే అధ్యయనం



తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ మా ప్రతిపాదనకు పూర్తి సానుకూలత వ్యక్తం చేశారు. మేం గోదావరి తీరంలో రెండు కిలోమీటర్ల బఫర్ ప్రాంతాన్ని పరిశీలిస్తామని కోరితే.. గంగా నది అధ్యయనం తరహాలో ఐదు కిలోమీటర్ల బఫర్ ప్రాంతంలో నిర్వహించాలని ఆయనే సూచించారు. త్వరలో ప్రణాళిక సిద్ధం చేసుకుని అధ్యయనం ప్రారంభిస్తాం

–అనురాధారెడ్డి, ఇంటాక్ తెలంగాణ ప్రతినిధి

గంగానది తరహాలో చేస్తాం



కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు మేం గంగా నది పరీవాహక ప్రాంతాల్లో నాలుగేళ్ల పాటు చేసిన విస్తృత అధ్యయనంతో ఎన్నో రహస్యాలను వెలుగులోకి తెచ్చాం. గంగా నది అంటే ఎన్ని వింతలో అని అబ్బురపడే వివరాలు వెలుగులోకి వచ్చాయి. అదే తరహాలో గోదావరి నది పరీవాహక ప్రాంతంలో కూడా సర్వే చేసేందుకు మేం ఆసక్తిగా ఉన్నాం. త్వరలో ప్రారంభిస్తాం.

– సుమేశ్ దుదాని, సైంటిస్ట్ ఆఫీసర్, ఇంటాక్

వైద్య పరికరాల పరిశ్రమలకు చేయూత

- 'బయో ఆసియా సదస్సు' రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి కేటీఆర్
- తెలంగాణలో పెట్టుబడులకు అవకాశాలపై ప్రతినిధులకు వివరణ



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య పరికరాల తయారీ పరిశ్రమ అభివృద్ధి కోసం సరైన విధానాన్ని తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తామని.. ఈ రంగానికి తగిన చేయూతనిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖల మంత్రి కె.తారకరామారావు హామీ ఇచ్చారు. 'బయో ఆసియా 2023' సదస్సులో భాగంగా ఆదివారం హెచ్ఐసీసీలో దేశంలోని 20 ప్రముఖ వైద్య పరికరాల తయారీ కంపెనీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మంత్రి కేటీఆర్ అందులో పాల్గొని మాట్లాడారు. దేశంలో వైద్య పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులకు గల అవకాశాలు, పారిశ్రామిక సానుకూలతలను వైద్య పరికరాల తయారీ కంపెనీల ప్రతినిధులకు వివరించారు. కాగా దేశంలో వైద్య పరికరాల తయారీ రంగానికి అవసరమైన ప్రోత్సాహం, ఈ రంగం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించారు. ఇందులో మెడ్‌ట్రానిక్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మైఖేల్ బ్లాక్ వెల్, రాజీవ్‌నాథ్ (ఎండీ, హిందుస్థాన్ సినర్జీస్), ఆదిత్య బెనర్జీ (ఎండీ, బీబ్రౌన్ మెడికల్ ఇండియా), సుమీత్‌భట్ (సీఈవో, ట్రివిట్రాన్ హెల్త్‌కేర్), శిశిర్ అగర్వాల్ (ఎండీ, టెరుమో ఇండియా), భార్గవ్ కోటాడియా (షాజహాన్ మెడికల్ టెక్నాలజీస్), సచిన్ గార్గ్ (డైరెక్టర్, ఇన్నోవేషన్ ఇమేజింగ్ టెక్నాలజీస్), జతిన్ మహాజన్ (ఎండీ, జె.మిత్రా) సహా ఇరవై ప్రముఖ వైద్య పరికరాల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యూనిఫాం ఉద్యోగ పరీక్షలకు అండర్‌టేకింగ్ గడువు 28 వరకు

సాక్షి, హైదరాబాద్ : యూనిఫాం ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షల నుంచి మినహాయింపు కోసం గర్భిణులు, బాలింతలు రాతపూర్వక అండర్ టేకింగ్ పత్రాన్ని సమర్పించే గడువు మంగళవారంతో ముగియనుంది. మహిళా అభ్యర్థుల్లో గర్భిణులు, బాలింతలు దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకాకుండా.. తుది రాత పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. అండర్ టేకింగ్ ఇచ్చిన వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. అండర్ టేకింగ్ ఇచ్చేందుకు గతంలో జనవరి 31 వరకు గడువు ఇచ్చారు. దాన్ని మరోమారు పొడిగిస్తూ ఈనెల 28 వరకు అవకాశం కల్పించారు. అండర్ టేకింగ్ ఇవ్వనివారు డీజీపీ కార్యాలయంలో ఇన్‌వర్డ్ సెక్షన్‌లో రాతపూర్వకంగా అందించాలని అధికారులు సూచించారు.



ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు





మీడియాతో మాట్లాడుతున్న ప్రీతి తండ్రి నరేందర్, సోదరుడు

మెడికో ప్రీతి కన్నుమూత

▶ మొదటి పేజీ తరువాయి

పూజ, ఉష, ప్రీతి, కుమారుడు వంశీ ఉన్నారు. కొన్నేళ్ల క్రితమే వారు హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు వలస వచ్చారు. గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ప్రీతి.. 2022 నవంబర్ 18న వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో అనస్తీషియా పీజీ కోర్సులో చేరింది. థియరిటికల్ క్లాస్‌లో భాగంగా ఎంజీఎం ఆస్పత్రిలో సీనియర్ విద్యార్థులతో కలిసి ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వర్తించాలి. ఈ క్రమంలోనే సీనియర్ విద్యార్థి సైఫ్ ఆమెపై వేధింపులకు దిగాడు. దీనిపై ప్రీతి తండ్రి నరేందర్ మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఈ విషయాన్ని కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాసు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అనస్తీషియా విభాగాధిపతి నాగార్జునరెడ్డి సమక్షంలో గత మంగళవారం (21వ తేదీన) ప్రీతికి, సైఫ్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు.

డ్యూటీలో ఉండగానే అపస్మారక స్థితికి..

మంగళవారం ఎంజీఎం ఆస్పత్రిలో నైట్ డ్యూటీలో ఉన్న ప్రీతి.. రాత్రి 12 గంటల వరకు రెండు శస్త్రచికిత్సల్లో పాల్గొంది. బుధవారం తెల్లవారుజామున తలనొప్పి, ఛాతీలో నొప్పిగా ఉందంటూ జోఫర్, ట్రెమడాల్ ఇంజెక్షన్ కావాలని స్టాఫ్ నర్సును అడిగింది. అయితే ఉదయం ఏడు గంటల సమయంలో వైద్యుల గదిలో ప్రీతి అపస్మారక స్థితిలో పడిపోయి ఉండటాన్ని తోటి వైద్యులు గమనించారు. గుండెపోటుకు గురైందని గుర్తించి, సీపీఆర్‌తో గుండె పనిచేసేలా చేసి.. చికిత్స ప్రారంభించారు. అయినా ఆమె ఆరోగ్య పరిస్థితి చాలా సీరియస్‌గా ఉండటంతో.. ఉన్నతాధికారులు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రీతిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే తొలుత ట్రెమడాల్ ఇంజెక్షన్ ఓవర్‌డోస్ తీసుకుని ప్రీతి ఆత్మహత్యాయత్నం చేసినట్టు భావించారు. అయితే ప్రీతి అపస్మారక స్థితిలో కనిపించిన గదిలో సక్సినైల్‌కోలైన్, మెడజోలం, పెంటనీల్ ఇంజెక్షన్ వాయిల్స్ దొరికాయి. దీంతోపాటు ప్రీతి గూగుల్‌లో సక్సినైల్‌కోలిన్ ఇంజెక్షన్ గురించి సెర్చ్ చేసినట్టు గుర్తించారు. ఈ క్రమంలో ఏ మందు తీసుకుందన్నది తేల్చేందుకు ఆమె బ్లడ్ శాంపిల్స్‌ను ట్యాక్సికాలజీ పరీక్షలకు పంపారు.

ఐదు రోజుల పాటు వెంటిలేటర్‌పైనే..

వరంగల్ నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించే సమయంలో దాదాపు మూడు సార్లు ప్రీతి గుండె ఆగిపోయింది. వెంటనే సీపీఆర్ చేస్తూ, గుండె తిరిగి కొట్టుకునేలా చేశారు. నిమ్స్‌కు చేరుకున్న తర్వాత ఆమెకు పూర్తిగా వెంటిలేటర్, ఎక్మోపైనే చికిత్స అందించారు. శ్వాస తీసుకోవడంలో తీవ్రంగా ఇబ్బందిపడుతున్న పరిస్థితుల్లో ఐదుగురు ప్రత్యేక వైద్యుల బృందం ఆమెను నిరంతరం పర్యవేక్షించింది. హానికర ఇంజెక్షన్ తీసుకోవడం వల్ల శరీరంలో చాలా అవయవాలు దెబ్బతిన్నాయని (మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్), మెదడుపైనా ప్రభావం పడిందని గుర్తించారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేసేందుకు ఐదు రోజులపాటు అన్ని విధాలా ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది.

రిమాండ్‌లో ఉన్న నిందితుడు

ప్రీతిని వేధించినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మెడికల్ పీజీ సీనియర్ విద్యార్థి సైఫ్‌పై వరంగల్ మట్టెవాడ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అతడిని ఈ నెల 24న అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి అతడికి 14 రోజులు రిమాండ్ విధించడంతో ప్రస్తుతం ఖమ్మం జైలులో విచారణ ఖైదీగా ఉన్నాడు. మరోవైపు సైఫ్‌ను ఎంజీఎం ఆస్పత్రి విధుల నుంచి సస్పెండ్ చేశారు. నేరం రుజువైతే మెడికల్ కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తామని ప్రకటించారు. ఇక ప్రీతి ఘటనపై ఏర్పాటు చేసిన వైద్యుల బృందం ఇప్పటికే విచారణ నివేదికను డీఎంఈకి పంపింది.

అవయవాలన్నీ దెబ్బతినడంతోనే..: ప్రీతిని కాపాడేందుకు ప్రత్యేక వైద్య బృందం అన్నివిధాలుగా ప్రయత్నించిందని, అయినా ఫలితం లేకపోయిందని నిమ్స్ వైద్యులు ప్రకటించారు. ప్రీతి డ్యూటీలో ఉండగా తన వద్ద ఉన్న సక్సినైల్ కోలైన్ ఇంజెక్షన్ తీసుకోవడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయిందని, ఆస్పత్రికి తీసుకొచ్చిన తర్వాత వెంటిలేటర్‌పై, ఎక్మో యంత్రంపై అత్యవసర వైద్యసేవలు అందించామని తెలిపారు. మొత్తంగా ఆమె నాలుగు సార్లు గుండెపోటు (కార్డియాక్ అరెస్ట్)కు గురైందని, అందులో నిమ్స్‌కు రాక ముందే రెండుసార్లు వచ్చిందని వివరించారు. ప్రీతి తీసుకున్న మత్తు ఇంజెక్షన్ కారణంగా గుండె రక్తం పంప్ చేసే సామర్థ్యం (ఎజెక్షన్ ఫ్రాక్షన్ ఆఫ్ హార్ట్) 28శాతానికి పడిపోయిందని.. గ్లోబల్ హిపోకైనేషియా, పాంక్రియాటైటిస్, అస్సైటిస్, ఊపిరితిత్తుల సమస్య ఏర్పడినట్టు నిర్ధారణ అయినట్టు తెలిపారు. ప్రీతి అప్పటికే థైరాయిడ్, కీళ్లవాతానికి సంబంధించి మందులు వాడుతున్నట్టు గుర్తించామన్నారు.

నిమ్స్ వైద్యుడి వ్యాఖ్యలపై నిరసన

నిమ్స్ ఐసీయూ వద్దలో ప్రీతి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగడంపై వైద్యులు అసహనం వ్యక్తం చేశారు. ఐసీయూలోకి వచ్చి మృతదేహాన్ని చూసి, సంతకం చేయాలని వైద్యులు కోరగా.. ప్రీతి మృతికి కారణమేంటో చెప్పేదాకా, తగిన న్యాయం జరిగేదాకా రాబోమని తల్లిదండ్రులు స్పష్టం చేశారు. ఈ సమయంలో ఓ వైద్యుడు కల్పించుకుంటూ 'అయితే.. డెడ్ బాడీని ఇలాగే ప్యాక్ చేసి పంపించేయాలా?' అని వ్యాఖ్యానించడంతో కలకలం రేగింది. దీనిపై ప్రీతి తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర నిరసన తెలిపారు.

ప్రీతి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

- ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటాం: ఎర్రబెల్లి
- దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తాం
- ప్రీతి మృతిపై సీఎం కేసీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రీతి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్టు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. ప్రీతి మృతి బాధాకరమని, ప్రభుత్వపరంగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఈ ఘటనపై సీఎం కేసీఆర్ తీవ్ర ఆవేదన, విచారం వ్యక్తం చేశారని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారని వివరించారు. దోషులు ఎంతటి వారైనా సరే చట్టప్రకారంగా కఠినంగా శిక్షిస్తామని ఎర్రబెల్లి తెలిపారు.

ప్రీతి ఘటన బాధాకరం: మంత్రులు

ప్రీతి మృతి అత్యంత బాధాకరమని, ఆమెను కాపాడేందుకు నిమ్స్ వైద్య బృందం శక్తివంచన లేకుండా ప్రయత్నించిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కాగా.. ప్రీతి మృతి బాధాకరమని, ఆమె కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నామని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని జూడాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కౌశిక్ కుమార్ పేర్కొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే దారుణం : బండి సంజయ్

ప్రీతిది ముమ్మాటికీ హత్యేనని, ఫిర్యాదు చేయగానే ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ దారుణం జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రీతి మరణం బాధాకరమన్నారు. ''ఈ దారుణ ఘటనపై సీఎం ఇప్పటిదాకా ఎందుకు స్పందించలేదు? మీరిచ్చే రూ.10 లక్షల సాయం ఆ తల్లిదండ్రుల గుండెకోతను చల్లార్చుతాయా? గిరిజన విద్యార్థిని కాబట్టి ఏమైనా ఫరవాలేదనే సీఎం స్పందించలేదా? కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్, ఎంఐఎం మద్దతుంటే క్రిమినల్స్ ఏం చేసినా చెల్లుతుందని ప్రీతి ఘటన నిరూపిస్తోంది''అని విమర్శించారు.

విచారణకు రేవంత్ డిమాండ్

ప్రీతి మరణంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయనడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. ప్రీతి మరణానికి గల కారణాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

నిమ్స్ వద్ద ఆందోళన.. ఉద్రిక్తత

▶ మొదటి పేజీ తరువాయి

నెలకొంది. ప్రీతి కుటుంబానికి రూ.5 కోట్లు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని గిరిజన సంఘాల నేతలు, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని కోరారు. పోలీసులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఎవరూ ఆందోళన విరమించలేదు.

మృతదేహాన్ని బయటికి తెచ్చి.. మళ్లీ లోపలికి..

నిమ్స్‌లో ఓ వైపు ఆందోళన జరుగుతుండగానే... మరోవైపు వైద్యులు, పోలీసులు ఆమె మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆందోళనకారులు అక్కడికి వచ్చిన అంబులెన్స్ ముందు బైఠాయించి, దానిని వెనక్కి పంపారు. దీనితో అధికారులు మరో అంబులెన్స్‌ను తీసుకురాగా.. మృతదేహాన్ని ఆర్ఐసీయూ నుంచి బయటికి తీసుకురాకుండా ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఆర్ఐసీయూ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ సమయంలో పోలీసులకు, వారికి మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేసి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. కాగా.. నిమ్స్‌లో రోగులకు వైద్య సేవలు అందించడంలో అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆందోళన విరమించాలని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప విజ్ఞప్తి చేశారు. చివరికి మంత్రి హరీశ్‌రావు చర్చలు జరిపి.. రూ. 30 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు హామీ ఇవ్వడంతో ప్రీతి మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు.

ప్రేమికుడితో దిగిన ఫొటోలు వైరల్

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



రక్షిత

భూపాలపల్లి అర్బన్/రామన్నపేట/నర్సంపేట రూరల్: ప్రేమికుడితో దిగిన ఫొటోలను అతను మరో యువకుడికి పంపడం, ఇద్దరూ కలిసి బ్లాక్‌మెయిల్ చేయడం, ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మనస్తాపానికి గురైన యువతి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన రక్షిత వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ముగ్దుంపురం శివారులో ఉన్న ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (ఈసీఈ) మూడో సంవత్సరం చదువుతోంది. అయితే తన కుమార్తె కన్పించడం లేదంటూ రక్షిత తండ్రి శంకరాచారి ఈ నెల 22న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా 24న రక్షిత ఆచూకీ లభించింది. విచారణ సందర్భంగా..తన ప్రేమికుడితో దిగిన ఫొటోలను అతను వేరొకరికి పంపిన విషయం, ఇతర వివరాలు ఆమె వెల్లడించింది. దీంతో పోలీసులు ఇద్దరినీ పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి పంపేశారు. ఈ ఇద్దరు యువకులూ భూపాలపల్లికి చెందిన వారేనని మట్టెవాడ పోలీసులు తెలిపారు. కాగా సరదాగా తీసుకున్న ఫొటోలు కాస్తా సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మనస్తాపానికి గురైన రక్షిత ఆదివారం వరంగల్‌లోని తమ బంధువుల ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.

ర్యాగింగ్ ఆరోపణలపై కాలేజీ యాజమాన్యం ఖండన

'పబ్బోజు రక్షిత అనే విద్యార్థిని మా కళాశాలలోనే ఈసీఈ విభాగంలో అడ్మిషన్ పొందింది. రెండేళ్లు కళాశాలలోనే చదివింది. కానీ బ్యాక్‌లాగ్‌లు ఎక్కువగా ఉండడంతో మూడో సంవత్సరంలో డిటెండ్ అయింది. దీంతో ఆరు నెలలుగా కళాశాలకు రావడం లేదు. కళాశాలకు రాని విద్యార్థినిని ఎవరు ర్యాగింగ్ చేస్తారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం వైరల్ అవుతోంది..' అని కాలేజీ యాజమాన్యం పేర్కొంది.

నేడు వైద్య కళాశాలల బంద్

సాక్షి, హైదరాబాద్: సీనియర్ వేధింపులతో వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య.. రాష్ట్రంలో ర్యాగింగ్ విష సంస్కృతికి నిరసనగా సోమవారం వైద్య కళాశాలల బంద్‌కు ఏబీవీపీ తెలంగాణ శాఖ పిలుపునిచ్చింది. ఈ విషయాన్ని ఏబీవీపీ వర్కింగ్ కమిటీ సభ్యుడు ప్రవీణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీతి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నంపై.. వైద్య విద్య కళాశాలల్లో ర్యాగింగ్ సాధారణమని ప్రకటించిన అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. కాగా, డాక్టర్ ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని ఆల్ తెలంగాణ ట్రైబల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ ఒక ప్రకటనలో కోరారు.

దోషులపై కఠిన చర్యలు చేపట్టాలి: షర్మిల

ప్రీతి మృతి పట్ల వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని, వెంటనే విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



దేన్నయినా గతం నుంచి చూడవద్దు.
భవిష్యత్ కోణంలో చూడాలి.
– ఓషో

సాక్షి
సోమవారం, ఫిబ్రవరి, 27

బౌద్ధసాగరం

దేనికైనా మధ్యేమార్గంలో పోవాలంటారు పెద్దలు. అతివాదాలు ప్రపంచానికి వినాశనకరం. ఈ మధ్యేమార్గం బౌద్ధం నుంచి ప్రజల్లోకి వచ్చిన భావధార. ఇంతకీ మధ్యేమార్గం అంటే ఏమిటి? మధ్యమాప్రతిపద్ అని సంస్కృతంలో, మజ్జిమాపతిపదా అని పాళీలో పిలిచే ఈ మార్గం 'రెండు అంత్యాలను వదిలి, ఆ అంత్యాన్నో ఈ అంత్యాన్నో కౌగిలించుకోకుండా, అంటే మరీ అతికి పోకుండా, మధ్య దారిలో పోవాలని చెబుతుంది.' 'సత్యం, ఆ అంత్యంలోనో, ఈ అంత్యంలోనో కాక మధ్యలో ఉంటుందనే భావనను బౌద్ధ సిద్ధాంతాలకు అన్వయించడం జరిగిం'దని విశదీకరిస్తుంది 'మహా బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు'. దీన్ని కూర్చినవారు అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి.

మధ్యేమార్గం మన జీవితాలకు ఒక సంయమనాన్ని ఇస్తే, మరి ఆ సంయమనం సాధించడానికి కావాల్సిన ఉపకరణం– ధ్యానం. ఆ ధ్యానంలో రకరకాల మార్గాలున్నాయి, రకరకాల తుది ఫలితాలున్నాయి. బుద్ధుడి ద్వారా ప్రపంచానికి అందిన ఒక ధ్యాన ప్రక్రియ– విపశ్యన. 'ఇది ఎరుక, అప్రమత్తత, జాగరూకత, పరిశీలనల మీద ఆధారపడినది.' ఇది ఉనికిలో ఉన్న మిగిలిన ధ్యానాలకు భిన్నం. సమాధి స్థితిలో మనస్సు 'అనేక మార్మిక స్థితులను చేరుతుంది. కానీ ప్రపంచాన్ని యథాతథంగా చూడలేడు. కాని బుద్ధునికి కావలసింది ప్రపంచాన్ని యథాతథంగా చూడగలగడం ...(అందుకే) విపశ్యనను కనిపెట్టాడు. విపశ్యన అంటే, మనస్సును పూర్తిగా విముక్తం చేసి, వస్తువుల యథార్థ స్థితికి తీసుకెళ్లి, తద్వారా నిర్వాణానికి చేర్చే అంతర్‌ప్రజ్ఞ' అని చెబుతుంది ఇదే మహా బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు. ఇది ఒక విశ్లేషణాత్మక విధానం. 'దుఃఖాన్ని, రూపారూప ప్రపంచంలో ఆత్మలేని తనాన్ని ఎరుకపరిచేది ఈ జ్ఞానం'.

2008లో వెలువడిన ఈ మహా బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువులో ఇంకా ఇలాంటి ఎన్నో మాటలకు, రీతులకు అర్థాలు, వివరాలు తెలుస్తాయి. రెండు అట్టల నడుమ బౌద్ధ మహాసాగరాన్ని ఇముడ్చుకున్న గ్రంథం ఇది. పదం పదంలో జ్ఞాన పథం! తెలిసీ అసత్యం పలకడానికి ఎవరైనా సిగ్గుపడాలనీ, అలాగే పర్యాలోచన(రిఫ్లెక్షన్) చేసి కర్మలను పరిశుద్ధం కావించుకోవాలనీ రాహులునికి బుద్ధుడు బోధించింది రాహులోవాద సూత్రం. 'ఏ ధర్మమూ, వస్తువూ అదే విధంగా ఏ రెండు క్షణాల పాటు ఉండదు' అని చెప్పేది క్షణికవాదం. యోగ అంటే, కాడి కిందకు తేవటమే. 'ఎలాగైతే కాడికి పూన్చిన ఎద్దులు నియమబద్ధంగా నడుస్తాయో, అలాగే యోగం మనిషి మనస్సును సంయమిస్తుంది'. ఇక పవిత్రాక్షరం ఓమ్ తాంత్రిక బౌద్ధంలో శూన్యతను సూచిస్తుంది. అయితే ఈ గ్రంథం వట్టి ప్రతి పదార్థాల పదకోశం కాదు. ఇది బౌద్ధ సూత్రాలను, శాస్త్రాలను, సిద్ధాంతాలను, పారిభాషిక పదాలను గణనీయంగా వివరిస్తుంది. కొత్తగా బౌద్ధాన్ని తెలుసుకోగోరేవారికీ, అవగాహన చేసుకోగోరేవారికీ ఇది ఒక కరదీపిక. 'ఇటువంటి బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు తెలుగులో– బుద్ధుని కాలంలోనే బౌద్ధం ఆంధ్రదేశంలో ప్రవేశించినా, క్రీ.పూ. 300ల నుంచి క్రీ.శ. 700ల వరకు, వేయి సంవత్సరాల పాటు, ఆంధ్రదేశాన్ని దున్ని వేసినా– ఒక్కటీ వెలువడలేదు' అని ప్రకాశకులు (మిసిమి ప్రచురణలు) ఆశ్చర్యం వ్యక్తం చేస్తూనే, 'తెలుగులో వెలువడిన ప్రథమ మహా బౌద్ధ విజ్ఞాన నిఘంటువు' ఇదని ఘనంగా ప్రకటించారు. అయితే, 'నేను త్రిపిటకాచార్యుడను కాను. అంతకంటె బౌద్ధ వాఙ్మయ మహావృక్షుడను అసలే కాను. ఒక సామాన్య బౌద్ధ విద్యార్థిని. అలాగే ఈ ప్రయత్నం చేశాను... ఆ మహా సముద్రంలోని జ్ఞాన జలాన్ని నా 'బుడ్డి చెంబు' పట్టినంత మేరకే గ్రహించాను' అని వినయంగా చెప్పుకొన్నారు కూర్పరి అన్నపరెడ్డి. నిఘంటువు ముందు 'మహా' అని చేర్చడం కూడా, బౌద్ధ సంప్రదాయాన్ని(ఉదా: మహా నిదాన సుత్త, మహా పదాన సుత్త) పాటించాలనే కోరికతో చేశానని చెప్పినప్పటికీ ఇది 'మహా' అని చేర్చడానికి తగినదే!

బౌద్ధానికి సంబంధించిన అనేక గ్రంథాలను తెలుగులో వెలువరించిన అరుదైన రచయితగా కూడా అన్నపరెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇందులో అనువాదాలు, పరిశోధనలు, స్వతంత్ర రచనలు ఉన్నాయి. మానవీయ బుద్ధ, బుద్ధ దర్శనం, బుద్ధుని దీర్ఘ సంభాషణలు, బుద్ధుని సూత్ర సముచ్చయం, తెలుగులో బౌద్ధం, ఆచార్య నాగార్జునుడు, మహోన్నత బుద్ధుడు, నలభై రెండు ప్రకరణాల సూత్రం, బుద్ధుని ధర్మం– శిష్యులు, పోషకులు లాంటి పుస్తకాలను వెలువరించారు.

1933 ఫిబ్రవరి 22న మహాశివరాత్రి పర్వదినాన గుంటూరు జిల్లా కొల్లిపర మండలం తూములూరులో దిగువ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు అన్నపరెడ్డి. లెక్చరర్‌గా పనిచేశారు. 'చదివింది తత్వశాస్త్రం. బోధించింది సమాజశాస్త్రం. రాసింది మనోవిజ్ఞాన శాస్త్రం. అభిమాన విషయం సాహిత్యం, గ్రంథ రచన'. 1996 నుంచి 2011 వరకు 'మిసిమి' మాసపత్రికకు సంపాదకులుగా పనిచేశారు. చాలామంది సాధారణ తెలుగు పాఠకులకు సిగ్మండ్ ఫ్రాయిడ్ ఆయన ద్వారానే పరిచయం. మేధావుల మెతకలు, అస్తిత్వవాదం ఆయన ఇతర రచనలు. 'చింతనాగ్ని కొడిగట్టిన వేళ' ఆయన ఆత్మకథ. బౌద్ధమతం అవలంబించిన తర్వాత తన పేరును బుద్ధఘోషుడు అని పెట్టుకున్నారు. ఆ పేరుతో రచనలు చేశారు. కానీ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డిగానే ఎక్కువమందికి పరిచితుడు. 2021 మార్చ్ 9న ఆయన మరణించారు. ఇది ఆయన జయంతి, వర్ధంతుల ఉమ్మడి సందర్భం. కొంతమంది తాము బతికి ఉన్నంతకాలం సెలయేళ్లలా ప్రవహిస్తారు. వారి దగ్గరికి ఎప్పుడు సమీపించినా మెదడుకు ఇంత జ్ఞానతడి చేసుకుని రావొచ్చు. అలాంటి ఒక తెలుగు సెలయేరు అన్నపరెడ్డి!

అంతరాత్మను తట్టి లేపే కథనం

కామెంట్



కరణ్ థాపర్

ఈ కథనం 75 సంవత్సరాల తర్వాత కూడా మన అంతరాత్మను తట్టిలేపుతుంది. 1947 మండువేసవి కాలంలో ఇది జరిగింది. దేశవిభజన తీసుకొచ్చిన ఉన్మాద హత్యల కారణంగా భావోద్వేగాలు తీవ్రస్థాయిలో ఉన్నరోజులవి. అలాంటి సమయంలో ఇంట్లో పనిచేస్తున్న ఒక మనిషిని, కేవలం తన మతం కారణంగా మృత్యువు ముంగిట నిల్చున్నప్పుడు ఎంతో సమయస్ఫూర్తితో ఒక మహిళ కాపాడిన కథనం ఇది. ఆ సంఘటనను దాటేసిన చాలా రోజులకు అది నవ్వులాట కథనంగా మారిపోవచ్చుగాక! కానీ ఆ క్షణంలో ముచ్చెమటలు పట్టించిన రోజు ఎవరి జీవితంలోనూ రాకూడదు.

మా 'మమ్మీ' (అమ్మ; బిమ్లా థాపర్) ఈరోజు బతికి ఉంటే ఆమెకు 106 సంవత్సరాలు ఉండేవి. తన 98 సంవత్సరాల వయసులో 2015లో చనిపోయింది. ఆమె జయంతి అని ఆమె గురించి నేను రాయడం లేదు. చాలా విభిన్నమైన కారణం రీత్యా నేను ఈ కథనం రాస్తున్నాను. ఆమె జీవితంలో తప్పకుండా గుర్తుంచుకోవలసిన కథ ఉంది. అది కాలం ఎంతగా మారిపోయిందో చెప్పే శక్తిమంతమైన చిత్రణ. 75 సంవత్సరాల తర్వాత కూడా అది మన అంతరాత్మను తట్టిలేపుతుందని నేను భావిస్తున్నాను.

1947 మండువేసవి కాలంలో ఇది జరిగింది. ఆ సమయంలో ఆర్మీ బ్రిగేడియర్ అయిన మా నాన్న (జనరల్ ప్రాణ్‌నాథ్ థాపర్) మిలిటరీ ఆపరేషన్స్, ఇంటెలిజెన్స్ విభాగం డైరెక్టర్‌గా బాధ్యతల్లో ఉండేవారు. ఆ రోజుల్లో ఆ స్థాయి ఉద్యోగం విలాసవంతమైన బంగ్లాను తీసుకొచ్చేది. అయితే ఆ ఇల్లు సొగసు ఏమిటంటే– దేశవిభజన తీసుకొచ్చిన ఉన్మాద హత్యల కారణంగా పేరుకుపోయిన హంతక భావోద్వేగాలతో పోల్చిచూసినప్పుడు, దానికి పూర్తి విరుద్ధంగా ఎకరాల పొడవునా గుల్‌మహర్ చెట్లతో చుట్టి ఉండే అలంకరించిన పచ్చిక బయళ్లతో కూడి ఉండేది. సిక్కు 'జత్థాలు' అని పిలువబడే వాళ్లు... ముస్లింలపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఢిల్లీ వీధుల్లో వీరంగమాడేవారు. అవి నిజంగానే మంచిరోజులు కావు.

అప్పట్లో నా తల్లితండ్రుల వద్ద ఒక ముస్లిం బేరర్ ఉండేవాడు. అనేక సంవత్సరాలుగా అతను వారితో ఉంటూ వచ్చాడు. అతడి పేరు ఫజల్ కరీమ్. ఆనాటి పరిస్థితులను చూసి ఫజల్ కరీమ్ భీతిల్లిపోవడం అర్థం చేసుకోదగినదే. మా కాంపౌండులో ఒక చివరన ఉండే క్వార్టర్లలో కంటే మా ఇంటిలోనే అతడు ఉండేలా అమ్మ ఏర్పాటు చేసింది. అతడి మతం గురించిన వివరాలను దాచి ఉంచాలని ప్రతి ఒక్కరినీ అమ్మ హెచ్చరించింది. ఫజల్ ఒక ముస్లిం అని ఎవరికీ చెప్పేవారం కాదు.

ఒకరోజు మధ్యాహ్నం తర్వాత, అంటే భోంచేసి అందరూ విశ్రాంతి తీసుకునే వేళ, ఎవరో మా ఇంటి తలుపు తట్టారు. అమ్మ స్వయంగా వెళ్లి తలుపు తీసింది. చేతుల్లో ఆయుధాలు, కళ్లలో ఆగ్రహం



ప్రదర్శిస్తున్న కొంతమంది మగవాళ్లు ఇంటి వరండాలో నిలబడి ఉండటం చూసింది. ''బీబీజీ! ఈ ఇంట్లో ఒక ముస్లింను మీరు దాచి ఉంచుతున్నట్లు మేము నమ్ముతున్నాము. అతడిని మాకు అప్పగించండి'' అని వారు డిమాండ్ చేశారు. తామేం మాట్లాడుతున్నదీ వారికి బాగా తెలుసు అన్నట్టుగా వారి మాటల ధ్వని ఉంది. ఆ మనిషిని ఎలాగైనా పట్టు కోవాలన్న పట్టుదల వారిలో కనబడింది.

ఇలాంటిదేదో జరుగుతుందని ఫజల్ కరీమ్ ఎప్పుడూ భయపడేవాడు. ఇప్పుడు ఆ క్షణం రానేవచ్చింది. అప్పుడు అమ్మకు 30 సంవత్సరాల వయస్సు మాత్రమే. ఇలాంటి పరిస్థితి ఆమె ఊహించినది కాదు. కానీ ఆమె సహజాత గుణం ఆ సమస్యకు పరిష్కారం కనుగొంది. ''అవును. మా దగ్గర ఒక ముస్లిం బేరర్ ఉండేవాడు. కానీ అతడు వెళ్లిపోయి చాలా కాలమైంది'' అని అమ్మ అబద్ధమాడింది. అయితే తన మాటలను వాళ్లు నమ్మరని గ్రహించిన అమ్మ ఇలా చెప్పింది: ''కావాలంటే మీరే వెనుక ఉన్న క్వార్టర్లలో వెళ్లి చూసుకోండి. మీకు తోడుగా మా మనిషిని ఒకరిని పంపుతాను.''

ఇంటి ముందు తలుపు వెనకాల దాక్కుని ఉన్న ఫజల్ కరీమ్ ఈ సంభాషణ వింటూ భయంతో వణికిపోయాడు. తాను ఎవరికీ కనిపించకుండా ఉన్నప్పటికీ, ఆ క్షణంలో అతడి మనసులో ఎలాంటి భావాలు కలుగుతున్నాయో మనం ఊహించుకోవచ్చు.

ఉన్నట్లుండి అమ్మ కరీం కేసి చూస్తూ, అతడిని ''చున్నీ లాల్'' అని పిలిచింది. అప్పటికప్పుడే అతడి పేరును అమ్మ అలా మార్చేసింది. ''ఫజల్ కరీమ్ తన ఇంటికి వెళ్లిపోయాడంటే వీళ్లు నమ్మడం లేదు. నువ్వు వాళ్లను క్వార్టర్ల వద్దకు తీసుకెళితే, వాళ్లే స్వయంగా చూస్తారు కదా!''

వారితో వెళుతూ ఫజల్ తప్పకుండా వణికిపోయి ఉంటాడు. ఆ సమయంలో అతడు ఏం మాట్లాడి ఉంటాడు, లేదా అతడు ఎలా స్పందించి ఉంటాడు అని నాకు ఎవరూ చెప్పలేదు. కానీ చున్నీ లాల్ వాళ్లతో వెళ్లాడు. అతడితో కలిసి క్వార్టర్ వద్దకు వెళుతున్న ఆ క్రూరమైన, ఆగ్రహోదగ్రులైన మనుషులు తమ ముందు జరుగుతున్న ఈ నాటకం గురించి కనీసం ఊహించి ఉండరు. ఒకరి తర్వాత ఒకరుగా వారు క్వార్టర్లను తనిఖీ చేశారు. తర్వాత వారు మళ్లీ మా ఇంటివద్దకు వచ్చి అమ్మకు సలామ్ చెప్పి వెళ్లిపోయారు. అది చున్నీ లాల్‌కు మృత్యువు దాదాపుగా దగ్గరిదాకా వచ్చిన క్షణం. కానీ అతడు సురక్షితంగా తప్పించుకున్నాడు.

ఈ కథలో మలుపు ఏమిటంటే, అప్పటినుంచీ అతడి పేరు చున్నీ లాల్‌గా మారిపోయింది. 1960ల ప్రారంభం వరకు అతడు మా అమ్మానాన్నల వద్దే ఉండిపోయాడు. అయితే నాన్న అఫ్గానిస్తాన్ రాయబారిగా నియమితులు కావడంతో అతడు తన గ్రామానికి వెళ్లిపోయాడు. అయితే నా సోదరీమణులకు, నాకు ఎప్పుడూ అతడు చున్నీ లాల్‌గానే తెలుసు. నిజానికి, అతడు కూడా తనను అలాగే చెప్పుకొనేవాడు. తర్వాత ఫక్కున నవ్వేసి, తన పేరు ఎలా మారిపోయిందనే కథను చెప్పేవాడు. తనలో భయాలు తొలగిపోయాక, అది అతడికి ప్రీతిపాత్రమైన కథగా మారిపోయింది.

ఈ కథ నుంచి నేను నీతిని వెలికి తీయాలనుకోవడం లేదు. నేనలా చేసి ఉంటే అది అహంకారం, గర్వం కలయికలా ఉండేది. దానికి బదులుగా ఎల్.పి.హార్ట్‌లీ రాసిన నవల 'ద గో–బిట్వీన్'లోని ప్రారంభ వాక్యాలను గుర్తు తెచ్చుకుని ఈ కథనాన్ని ముగించనివ్వండి. 'గతం అనేది ఒక పరాయి దేశం. వాళ్లు అక్కడ పనులను భిన్నంగా చేస్తారు.' మనలో కొందరం ఇంకా గతంలోనే జీవించడానికి ప్రాధాన్యం ఇవ్వడానికి ఇదే కారణమా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వాస్తవం



ఆయుధ సంపత్తి కోసం ఒకే దేశం మీద మరీ ఎక్కువగా ఆధారపడిన దేశం, కచ్చితంగా ఐక్యరాజ్యసమితిలో దానికి వ్యతిరేకంగా ఓటు వేయలేదు.
– ప్రసేన్‌జిత్ దత్తా, కాలమిస్ట్

గొప్ప శాస్త్రం



నేననుకోవడం వంట అనేది ఎంత సంక్లిష్ట అంశం అనేది జనాలు తగినంతగా గుర్తించినట్టు అనిపించదు. వందల రకాలు టెక్నిక్కులు, వేలాది పదార్థాలు, రకరకాల ఫ్లేవర్లు, అబ్బో... అత్యంత సంక్లిష్ట శాస్త్రాల్లో ఒకటి.
– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

పరిష్కారాలు లేవు



బిల్ గేట్స్, టోనీ బ్లెయిర్, క్లాస్ ష్వాబ్– వీళ్లెవరూ ఎన్నికైనవాళ్లు కాదు. అయినప్పటికీ స్థిరంగా తమ అనేక ఎజెండాలను ప్రజా విధానాల్లోకి చొప్పిస్తున్నారు. విశాల ప్రయోజనాల కోసం వాళ్లు పరిష్కారాలను సూచిస్తున్నారనుకునేవాళ్లు అర్థం చేసుకోవాల్సింది– వాళ్లే ఆ సమస్యలో భాగం!
– జేమ్స్ మెల్‌విల్, కామెంటేటర్

అర్థవంతమైన శ్రమ



కష్టాలు, సమస్యలు, నమ్మకద్రోహాలు ఉన్నప్పటికీ చేయాల్సిన మంచిపని చేయండి. ఒకరోజు, భగవంతుడు మీకోసం వాటన్నింటినీ ఎలా అనుసంధానిస్తాడంటే– అదంతా అర్థవంతం అయిపోతుంది. అప్పటిదాకా సహనం వహించండి.
– ముఫ్తి మెంక్, మతగురువు

దురాశ నడుపుతోంది



ఖాలిస్తాన్ పేరుతో ఇండియాకు వ్యతిరేకంగా వేర్పేటువాదాన్నీ హింసనూ ప్రోత్సహిస్తున్నవారికి పాకిస్తాన్ నిజమైన ఉద్దేశాలు తెలియదు లేదా అర్థం చేసుకోవడం లేదు. వాళ్లను వాడుకుంటున్నారని ఖాలిస్తానీలకు తెలుసు. కానీ పేరు, కీర్తి, ధనం కోసం దురాశ వారిని నడిపిస్తోంది.
– అమర్ జీత్ సింగ్, మాజీ దౌత్యాధికారి

లోతైన సమస్య



పంజాబ్‌లోని ఘటనల వెనుక పూర్తిగా విదేశీ హస్తం ఉందని నమ్మే భ్రాంతిమయ బీజేపీ మద్దతుదారులు కొన్ని రోజులు పంజాబ్‌లో ఉండి చూడాలి. 2019లో నేను ఒక నెల రోజులు పంజాబ్‌లో ఉన్నాను – ఏహ్యత కలిగిందనేది చిన్నమాట. మీరు ఊహించే దానికన్నా చీడ చాలా లోతుగా ఉంది. అది ఎప్పుడూ ఉంది.
– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు


రాయడాన్ని గౌరవించండి



ప్రియమైన హిందీ సినిమా నిర్మాతల్లారా! రచయితలకు ఇవ్వాల్సింది చెల్లించండి. ఒరిజినల్ కథల కోసం చూడండి. రీమేకులు ఆపండి. స్క్రిప్టులు చదవడం అలవాటు చేసుకొని, 'నెరేషన్' సంస్కృతిని మానండి. నటులకు ఇవ్వాల్సినదానికన్నా ఎక్కువ ఇచ్చేసి మిగతా సాంకేతిక నిపుణులకు ఏమీలేకుండా చేసుకోవద్దు. రాయడం అనేది ప్రత్యేకమైన పని. రాయడం గురించి మీకు అంతా తెలుసనుకుంటే మీరే రాసుకోండి, రచయితలను తీసుకోకండి!
– దారాబ్ ఫారూఖీ, స్క్రీన్ రైటర్

సారాంశం
సరికొండ చలపతి

చైనా బ్యాచ్.. కన్యాశుల్కం



ఇది సీరియస్ విషయమో... సరదా అంశమో చివరిలో మాట్లాడుకుందాం.

ముందుగా సరదాగా మొదలుపెడదాం.

నిజానికి చైనా బ్యాచ్‌లర్స్ గురించి మాట్లాడుకోవాలి.. ఇండియాలోని బ్యాచ్‌లర్ తన యాంగిల్‌లో చెబుతున్న 'భోజరాజు కథ' ముందుగా విందాం. ఇందులో కాస్త కడుపుమంట కనిపిస్తుంది.

భోజరాజీయం కథ ఇదీ..

ఓ పేద బ్రాహ్మణుడు. చదువు సంధ్యాలేదు. ఇల్లూవాకిలీ లేవు.

ఏమీ లేని వారికి పిల్లనెవరిస్తారు. అందుకే సత్రాల్లో కాలక్షేపం చేస్తూ, ఊరూరూ తిరుగుతూ కాశీ చేరాడు. అక్కడే కాలక్షేపం చేస్తున్నాడు. ఇప్పుడు మోదీ పీఎం అయ్యాక బాగా డెవలప్ చేసినట్టున్నారు కానీ, అప్పుడంత సీన్ లేనట్లుంది. భోజనానికి ఢోకాలేకుండా కొంతకాలం నడుస్తోంది. విభూది పూసుకుని శివావతారంలో దేశ సంచారం చేసే బృందమొకటి కనిపించింది. వారితోపాటు కలిసి తిరుగుతూ, వారు ప్రయాగ యాత్రకు వెళుతుంటే వారితో పాటు ప్రయాగకు చేరాడు.

ఏమీ పాలుపోక, చేసేదేమీ లేక అక్కడ పుష్కరిణి నది వద్ద కూచున్నాడు. ఇంతలో అక్కడికి నలుగురు అమ్మాయిలు వచ్చారు. చాలా అందగత్తెలు. నలుగురు మాట్లాడుకుంటూ నదిలోకి దూకారు. ఇదంతా మనవాడు గమనిస్తున్నాడు.

ఒకమ్మాయి.. నాకు నవ మన్మథాకారుడు, చక్రవర్తి భర్తగా కావాలి..అని చెప్పుకుంటూ దూకింది

మరోకామె.. నాకు కండల వీరుడు కావాలి.. అన్నది.

ఇంకొకామె.. నాకు కవీశ్వరుడు భర్తగా రావాలి అని కోరుకున్నది.

చివరి అమ్మాయి.. వచ్చే జన్మలో నాకు సంగీత లలిత కళా వల్లభుడు భర్తగా కావాలి అనుకుంటూ దూకేసింది. 'ఈ జన్మలో ఇలాంటివి సాధ్యం కాదు..వచ్చే జన్మలోనైనా సాధ్యపడేలా చెయ్యి దేవుడా..' అంటూ ప్రార్థిస్తూ, ఇలా అయితే వచ్చే జన్మలో తప్పక సిద్ధిస్తుంది అనుకుంటూ ఆనందంగా దూకేశారు.

ఇదంతా వింటున్న మన హీరో బుర్ర పాదరసంలా పని చేసింది.

వచ్చే జన్మలో ఆ నలుగురు నాకు భార్యలు కావాలి అంటూ తానూ దూకేశాడు. ఆ తర్వాత జన్మలో మనవాడు భోజరాజుగా జన్మించాడు. వారందరూ అన్ని లక్షణాలు, ఐశ్వర్యం, రాజ్యం ఉన్న భోజరాజుకు భార్యలయ్యారు ఇదీ కథ.

కడుపు మంట ఇదీ..

'...ఇప్పుడు యూత్ అంతా భోజరాజులయితే కానీ పెళ్లి అయ్యేట్లు లేదు. కనీసం ఆ కాలంలో ఒక్కొక్క వరుడిలో ఒక్కో క్వాలిటీ అడిగారు. కానీ, ఈ తరం అమ్మాయిలు అన్ని లక్షణాలూ ఒక్కడిలోనే ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. అందగాళ్లు, ఎన్‌ఆర్‌ఐ సంబంధాలు, హై ఎడ్యుకేషన్లు, లక్షల్లో ప్యాకేజీలు, కార్లు, ట్రిపుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్లు.. ఒక్కటేమిటి అన్నీ..'

'..ఇప్పుడు నాకు 33 సంవత్సరాలు వచ్చాయి.. ఎన్నో సంబంధాలు పోయాయి.. నెత్తి మీద అరెకరం మిగిలింది.. క్యాంపస్ సెలెక్షన్లు, సంపన్న సంబంధాలు పోను మా లాంటి థర్టీ ప్లస్ గాళ్లం 'లెఫ్ట్ ఓవర్'లాగా మిగిలిపోయాం,. ఏ మ్యాట్రిమోనీకి పోయినా.. ఎంత ఏజీ, ఎంత ప్యాకేజీ, వెనుక ఎంత బ్యాగేజీ అని అడుగుతున్నారు. ఇక ఈ జీవితానికి ఇంతే..' – సోషల్ మీడియాలో ఓ బ్యాచ్‌లర్ సోదరుడి బాధ.

....

మరి చైనా కథేంటీ అంటారా... ఇండియాలోని పెళ్లికాని ప్రసాదులకే ఇన్ని బాధలుంటే మనకు మించిన జనాభా ఉన్న... చైనాలో బ్యాచ్‌లర్స్ బాధ ఇంత కన్నా ఎక్కువ.

అక్కడో వరుడు అచ్చంగా కోటి రూపాయలకు పైగా వధువుకు 'కన్యాశుల్కం' సమర్పించుకున్నాడు. కన్యాశుల్కం అంటే తెల్సుగా.. మన దగ్గర వరకట్నానికి రివర్స్. అక్కడ కన్యాశుల్కం బాగా పెరుగుతోంది. మార్కెట్‌లో లక్షలు పలుకుతోందట!

....

కరోనా వైరస్‌లాగా చైనా నుంచి కన్యాశుల్కం మనదేశానికి పాకుతుందేమోనని మన యూత్, పెళ్లి కాని ప్రసాద్‌ల బ్యాచ్.. చైనా బ్యాచ్‌ను చూసి బెంబేలెత్తుతున్నారని సోషల్ మీడియా భోగట్టా.

చైనా బ్యాచ్... 'కన్యాశుల్కం'

చైనాలో చాలా కాలంగా కన్యాశుల్కం ఆచారం ఉంది.. కానీ అది నామ్‌కేవాస్తే లాగా ఉండేది. కమ్యూనిస్టు పాలనలో కూడా అది విజృంభిస్తూనే ఉంది. ఈ కన్యాశుల్కం 60–70వ దశకంలో మంచాలు, పరుపులు లాంటి చిన్న చిన్న గిఫ్టుల నుంచి, 80వ దశకంలో టీవీలు, ఫ్రిజ్‌ల దాకా చేరింది, 1990లలో అక్కడ ఆర్థిక సంస్కరణల అమలు మొదలయ్యాక, కన్స్యూమరిజం పెరగడం, ఆర్థిక అంతరాలు పెరగడంతోపాటు లైంగిక వివక్ష పెరగడంతో కన్యాశుల్కం రాకెట్ వేగం అందుకుంది. కార్లు, రియల్ ఎస్టేట్ దాకా పోయింది.. ఇప్పుడు పురుషులు వధువుకు, వధువు కుటుంబానికి కానుకల రూపంలో లక్షల రూపాయలు ఇవ్వాల్సి వస్తోందట. కార్లు లాంటి వాహన రూపంలో, ఆస్తుల రూపంలో సమర్పించుకుంటున్నారు. దీన్నే 'బ్రైడ్ ప్రైస్' అంటున్నారు. ఈ సంప్రదాయం ఎక్కువగా చైనా గ్రామీణ ప్రాంతంలో కనిపించేది. ఇప్పుడు సిటీలకు కూడా బాగా పాకుతోంది. ఇటీవల ఓ వధువు కుటుంబం కోటి రూపాయలకు పైగా డిమాండ్ చేయడం, అది మీడియాలో బాగా చర్చ కావడంతో అందరి దృష్టి చైనా బ్యాచ్‌లర్ల కష్టాలపై పడింది. చివరికి చైనా కమ్యూనిస్టు పార్టీ కూడా దీనిపై దృష్టి పెట్టడం దీని సీరియస్‌నెస్‌కు అద్దం పడుతోంది.

చైనా 'వన్' వే..

చైనా ఏది చేసినా కరోనా స్థాయిలోనే చేస్తుంది. జనాభా పెరిగిపోతోందన్న ఆందోళనతో దశాబ్దాల పాటు ఒకే బిడ్డను కనాలన్న 'వన్ చైల్డ్' పద్ధతిని చాలా సీరియస్‌గా ఇంప్లిమెంట్ చేసింది. ఇండియాలో లాగానే... మగబిడ్డ కావాలనే సెంటిమెంట్ చైనా సమాజంలో కూడా ఉంది. దానితో వారు కనే ఒక్క బిడ్డను మగబిడ్డను కనడానికే ఆసక్తి చూపారు. ఇది తీవ్ర లింగ వివక్షకు దారితీసి లింగ నిష్పత్తిని దారుణంగా దెబ్బతీసింది. మగబిడ్డ కావాలనే ఆకాంక్ష వల్ల అమ్మాయిల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2017లో చేసిన ఒక సర్వేలో 100 మంది పెళ్లికాని పురుషులకు 66 మంది పెళ్లి కాని స్త్రీలే ఉన్నట్లు తేలింది.

చైనాలో 1986 నుంచి ప్రతి మ్యారేజ్‌ను రిజిస్టర్ చేయాలన్న రూల్ తెచ్చారు. ఈ లెక్కల ప్రకారం 2021లో 76 లక్షల పెళ్లిళ్లు రిజిస్టర్ అయ్యాయి. పెళ్లిళ్లు చేసుకునే వారి సంఖ్య బాగా తగ్గింది. రిజిస్ట్రేషన్ తప్పనిసరి అనే నిబంధన వచ్చాక అతి తక్కువ పెళ్లిళ్లు అయిన ఏడాది ఇదే. యువత లేట్‌గా పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. మ్యారేజ్ ఏజ్ పెరిగింది. ఒంటరిగా ఉండిపోతున్న అబ్బాయిల సంఖ్య పెరుగుతోంది. తద్వారా కన్యాశుల్కం పెరుగుతోంది. అక్కడ అన్నీ ఆర్థిక హంగులున్న భోజరాజులకు మాత్రమే పెళ్లిళ్లు అయ్యే పరిస్థితి వచ్చింది. ఇలాంటి పరిస్థితి ఇక్కడా వస్తుందేమోనని చైనా బ్యాచ్‌ను చూసి మన ఇండియా బ్యాచ్ బ్యాచ్‌లర్ల భయం..

ఎంకరేజ్ 'వ్యాక్సిన్'....

పైన చెప్పిన కారణాలు, వన్‌చైల్డ్ సిస్టమ్‌తో జనాభా తగ్గిపోవడంతో వన్‌చైల్డ్ పద్ధతికి చైనా స్వస్తి పలికింది. అయినా 2022లో చైనా జనాభా తగ్గింది. ప్రపంచానికి భిన్న పోకడ ఇది. ఇది తమ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందేమోనన్న కంగారు పడుతున్న చైనా సర్కారు ఇప్పుడు ఎక్కువ మందిని కనాలని ఎంకరేజ్ చేస్తోంది. మ్యారేజ్ చేసుకున్న కొత్త దంపతులకు ఇప్పటిదాకా మూడు రోజులు పెయిడ్ లీవ్‌లు ఉండేవి. ఇప్పుడు వాటిని 30 రోజులకు పెంచారు.

....

ప్రపంచంలోనే రెండు అత్యంత ఎక్కువ జనాభా ఉన్న దేశాల్లో యువకులకు పెళ్లిళ్లు కావడం కష్టం అవుతోంది. పెళ్లి.. ఆర్థిక, సామాజిక సమస్యగా మారింది. పెళ్లి 'మార్కెట్' కావడంతో ..మార్కెట్‌లో నిలబడలేని ఎంతోమంది పెళ్లి కాకుండానే ఉండిపోతున్నారు. ప్యాకేజీల కోసం, విదేశాల్లో ఉద్యోగాల కోసం వెంపర్లాడుతున్నారు. చైనాలో పెరుగుతున్న కన్యాశుల్కం ఓ రకంగా అమ్మాయిలను మార్కెట్లో పెట్టడమే... అంగడి సరుకుగా మార్చడమే!


ఈ పరిస్థితి.. ఆడపిల్ల అమ్మ కడుపులో ఉండగానే సమాజం మూకుమ్మడిగా కత్తులు దూసినందుకు తగిలిన ఉసురు కాదా..?

.. ఇదీ సీరియస్ అంశం!

శౌచం

ఎవరికైనా ఎప్పుడైనా తప్పనిసరిగా ఉండవలసినది శౌచం. అంటే శుచిగా ఉండటం. ఎటువంటి మాలిన్యాలూ లేకుండా ఉండటం. శౌచం బాహ్యం, ఆంతరం కూడా. బాహ్య శౌచం పరిసరాలకీ, వ్యక్తికీ సంబంధించి ఉంటుంది. పరిసరాలు శుచిగా లేకపోతే ఏ పనైనా శ్రద్ధగా చేయటం కష్టం. చదువు, పరీక్షలు, పూజ వంటి అనేక సమయాల్లో... ఒంటి మీద ఈగలు, దోమలు వాలుతూ ఉంటే; దుర్వాసనలు గుప్పుమంటుంటే, చెవులు బద్దలయ్యే శబ్దాలు చీకాకు పెడుతుంటే దృష్టిని కేంద్రీకరించటం సాధ్యమా?

పరిసరాలు బాగుంటే చాలదు. మనిషి కూడా శుచిగా ఉండాలి. స్నానం చేస్తే బద్ధకం పోయి మెదడు చురుకుగా పని చేస్తుంది. ఉతికిన శుభ్రమైన వస్త్రాలతో ఉండాలి ఎప్పుడూ. నలిగిన, మాసిన బట్టలు చీకాకుని కలిగిస్తాయని



పరిశోధకులు చెప్పిన మాట. అంతర శౌచం కూడా రెండు విధాలు – మనస్సుకూ, ఆత్మకూ సంబంధించి. పరిసరాలూ, దేహం శుచిగా ఉన్నా... మన సంతా గందరగోళంగా ఉంటే ప్రశాంతంగా పని చేయలేము. ముఖ్యంగా రాయటం, పూజ, ధ్యానం వంటివి చేయటం కుదరదు. కనుక ముందు శుభ్రం చేయవలసింది మనస్సుని. చెడు ఆలోచనలు రాకుండా జాగ్రత్త పడాలి. అవి మనసును కలుషితం చేసి, పనిని చెడగొడతాయి. చేసేది ధ్యానమో, పూజో అయితే అవే సిద్ధిస్తాయి.

ఆత్మకి ఎటువంటి మాలిన్యం అంటదని భగవద్గీతాది ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. కాని, అది ఎన్నో దురాలోచనలు, దుష్టచర్యల ఫలితంగా దుమ్ముతో కప్పబడిన అద్దంలాగా అవుతుంది. పైన కప్పిన దుమ్ము పోరని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. ఎదుటివారికి మేలుకలగాలని కోరుకోవడం, సర్వజీవులకు సహాయం చేస్తూ ఉండటం, నచ్చిన దైవనామాన్ని మనసులో అనుకుంటూ ఉండటం వంటివి ఆత్మ శౌచానికి దోహదం చేస్తాయి.

– డాక్టర్ ఎస్. అనంతలక్ష్మి

గ్రహం అనుగ్రహం
శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.అష్టమి తె.5.33 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి నవమి, నక్షత్రం: కృత్తిక ఉ.9.21 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: రా.1.54 నుండి 3.33 వరకు, దుర్ముహూర్తం: ప.12.34 నుండి 1.23 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, అమృతఘడియలు: ఉ.6.34 నుండి 8.11 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.24, సూర్యాస్తమయం: 6.01.

మగబిడ్డపై ఎక్కువ ప్రేమ చూపడం.. ఆడపిల్లపై వివక్ష చూపడమనేది మానవ సమాజంలో మాత్రమే కనిపించే అవలక్షణం అనుకుంటాం. కానీ.. మగ పిల్లవానిపై మమకారంతో జీవితంలో మరో బిడ్డకు జన్మనివ్వని జాతులు సైతం ఈ సృష్టిలో ఉన్నాయి. ఆ జాబితాలో ఓర్కా తిమింగలాలు ముందు వరుసలో ఉన్నాయట. ఈ కారణంగా ఆ జాతి తిమింగలాల ఉనికికే ప్రమాదం ముంచుకొస్తోందనే విభ్రాంతికర వాస్తవం వెలుగులోకి వచ్చింది.



ఆడ పిల్లలంటే.. వాటికీ వివక్షే

అత్యంత వేగంగా అంతరిస్తున్న ఓర్కా తిమింగలాలు

- మగబిడ్డ పుడితే దాదాపు 25 ఏళ్లు సాకుతాయి
- ఆడ బిడ్డను మాత్రం పుట్టిన కొన్ని నెలలకే వదిలేస్తాయి
- మగబిడ్డను సాకేందుకు మరో బిడ్డకు జన్మనివ్వకపోవడం వీటి ప్రత్యేకత
- ఫలితంగా వృద్ధి చెందని కిల్లర్ తిమింగలాల జాతి
- ప్రస్తుతం కేవలం 73 మాత్రమే మిగిలి ఉన్నాయట

సాక్షి, అమరావతి: పుత్ర ప్రేమతో వంశాన్నే నాశనం చేసుకున్న ధృతరాష్ట్రుడి గురించి మహాభారతంలో చదివే ఉంటారు. కానీ.. మగ బిడ్డలపై తల్లి ప్రేమ ఏకంగా ఓ జాతి మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చేసింది. ఆ జాతే ఓర్కా తిమింగలాలు. వీటినే కిల్లర్ తిమింగలాలు అని కూడా పిలుస్తారు. పసిఫిక్ మహాసముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో కనిపించే అరుదైన తిమింగలాలు ఇవి. అత్యంత తెలివైనవిగా గుర్తింపు పొందిన డాల్ఫిన్ జాతికి చెందిన ఓర్కా తిమింగలాల ప్రవర్తన అత్యంత సంక్లిష్టంగా ఉంటుంది. ఫలితంగా వాటి ఉనికే పెను ప్రమాదంలో పడింది. మానవులు వాటిని వేటాడుతుండటమో.. శత్రు జీవుల నుంచి తలెత్తుతున్న ముప్పు వంటివి దీనికి కారణం కాదు. కేవలం మగ బిడ్డల పట్ల తల్లి తిమింగలాలకు మితిమీరిన మమకారమే కారణమన్నది ఆశ్చర్యకరమైన వాస్తవం.

గుంపునకు నాయకత్వం వహిస్తాడనే ఆశతో..

సగటున 70 ఏళ్లు జీవించే ఓర్కా తిమింగలాలు గుంపులుగా సంచరిస్తాయి. పాడ్స్ అని పిలిచే ఆ గుంపునకు ఓ బలమైన మగ తిమింగలం నేతృత్వం వహిస్తుంది. ప్రతి తల్లి తిమింగలం తాను కన్న మగబిడ్డే ఆ గుంపునకు నాయకత్వం వహించాలని కోరుకుంటాయి. అందుకోసం తాము జన్మనిచ్చే మగ తిమింగలాల పట్ల విపరీతమైన మమకారాన్ని కనబరుస్తాయి. ఎంతగా అంటే ఆడబిడ్డను పెద్దగా పట్టించుకోవు. ఆడ తిమింగలం ఓ కాన్పులో ఒక బిడ్డకే జన్మనిస్తాయి. ఆడబిడ్డ పుడితే తల్లి తిమింగలం కేవలం 15 నెలల వరకే సాకుతుంది. ఆ తరువాత ఆడబిడ్డను వదిలేస్తుంది. మగబిడ్డ జన్మిస్తే మాత్రం తల్లి తిమింగలం చేసే హడావుడి అంతాఇంతా కాదు. మగ బిడ్డను ఎంతో సుకుమారంగా చూసుకుంటాయి. బిడ్డకు 20 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయసు వరకు సాకుతాయి. అంతవరకు మగబిడ్డకు తల్లి తిమింగలమే ఆహారాన్ని తెచ్చి పెడుతుంది. తాను వేటాడి తెచ్చిన ఆహారంలో సగానికిపైగా మగబిడ్డకే తినిపిస్తుంది. తాను కన్న మగ తిమింగలమే ఆ గుంపునకు నాయకత్వం వహించాలని తల్లి తిమింగలం ఎంత చేయాలో అంతా చేస్తుంది.

మగ బిడ్డను బలంగా తయారు చేసేందుకు తల్లి తిమింగలాలు మరో పెద్ద నిర్ణయం తీసుకుంటాయి. ఓ సారి మగబిడ్డ పుడితే ఆ తల్లి తిమింగలం జీవితాంతం పిల్లల్ని కనదు. ఎందుకంటే ఆడ తిమింగలం గర్భధారణ సమయం 18 నెలలు. అంతకాలం తాను గర్భంతో ఉంటే అప్పటికే పుట్టిన మగబిడ్డను సక్రమంగా పెంచలేనని.. తగినంత ఆహారం అందించలేనని తల్లి తిమింగలం భావిస్తుంది. అందుకే మగబిడ్డ పుడితే తల్లి తిమింగలం మగ తిమింగలంతో జత

మగ బిడ్డ పుడితే..
మరో బిడ్డకు జన్మనివ్వవు

కట్టవు. ఈ నిర్ణయమే ఓర్కా తిమింగలాల జాతికి పెనుముప్పుగాపరిణమిస్తోంది. ప్రధానంగా 1990 నుంచి క్రమంగా అంతరిస్తున్న వీటి ఉనికి 2005 తరువాత అత్యంత ప్రమాదంలో పడింది. ప్రస్తుతం ప్రపంచంలో ఓర్కా తిమింగలాలు కేవలం 73 మాత్రమే ఉన్నాయని లండన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెసర్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. వాటిలో కేవలం మూడు మాత్రమే గర్భంతో ఉండటం గమనార్హం. అంటే ఓర్కా తిమింగలాల్లో పునరుత్పత్తి గణనీయంగా తగ్గిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే కొన్నేళ్లలో ఓర్కా తిమింగలాలు కనుమరుగైపోతాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐక్యరాజ్య సమితి ఓర్కా తిమింగలాలను అత్యంత వేగంగా అంతరించి పోయే ప్రమాదం ఉన్న జీవుల జాబితాలో చేర్చి వాటి పరిరక్షణకు పరిశోధనలను ప్రోత్సహిస్తోంది.

జీవవైవిధ్యంలో ప్రధానమైనవి



ఓర్కా తిమింగలాలు అత్యంత అరుదైనవి. జీవ వైవిధ్యంలో అత్యంత ప్రధానమైనవి కూడా. మగబిడ్డను అత్యంత మమకారంతో సాకడం కోసం తల్లి తిమింగలం మరో బిడ్డకు జన్మనివ్వకపోవడమన్నది వీటిలోనే మనం గమనిస్తాం. దాంతో వాటి సంఖ్య ప్రమాదకర స్థాయికి తగ్గిపోతోంది. వాటిని పరిరక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు.

– ప్రొఫెసర్ భరతలక్ష్మి, జువాలజీ విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

ఓర్కా తిమింగలాల ప్రత్యేకతలు ఇవీ..

- ఓర్కా తిమింగలాల పైభాగం ముదురు నలుపు రంగులోనూ.. కిందిభాగం స్వచ్ఛమైన తెలుపు రంగులో ఉండటంతోపాటు కళ్ల మీద దళసరిగా తెల్లని మచ్చ ఉంటుంది.
- ఇవి అత్యంత తెలివైన జీవులు. నోటితో ఈల వేస్తాయి. ఈలలు, సంజ్ఞలు, శబ్దాలు చేస్తూ పరస్పరం సంభాషించుకుంటాయి.
- మానవుల మాటలు, హావభావాలను సరిగా అర్థం చేసుకుంటాయి. మానవులతో అత్యంత స్నేహంగా ఉంటాయి.
- కిల్లర్ తిమింగలాల ఆవాసాలు... పసిఫిక్ మహా సముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతం
- అమెరికాలోని అలస్కా, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, ఫ్లోరిడా రాష్ట్రాలు, ఒమన్ దేశంలో ఓర్కా తిమింగలాలను వీక్షించేందుకు ప్రత్యేక టూర్స్ నిర్వహిస్తున్నారు.
- మన దేశంలోని లక్షద్వీప్, అండమాన్ దీవులతోపాటు తమిళనాడు, పాండిచ్చేరి, మహారాష్ట్ర తీర ప్రాంతంలో అప్పడప్పుడు ఈ తిమింగలాలు కనిపిస్తుంటాయి.



అతన్ని సీనియర్లేమీ అనట్లేదు..

- ఫిర్యాదు చేస్తే నాకేమీ నేర్పించకుండా దూరం పెడతారు
- సీనియర్ వేధింపులపై తల్లితో ఫోన్లో పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి చివరి మాటలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంభాషణ

ఎంజీఎం: పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి తన తల్లితో చివరిసారిగా మాట్లాడిన ఫోన్ సంభాషణ తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా ఆమె సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులకు గురిచేస్తున్న వైనాన్ని వివరించింది. అతన్ని సీనియర్లు ఏమీ అనడంలేదని.. ఒకవేళ అతనిపై ఫిర్యాదు చేస్తే సీనియర్లు తనకు ఏమీ నేర్పించకుండా దూరంపెడతారని తల్లికి చెప్పుకొని బాధపడింది.

వారిద్దరి మధ్య ఫోన్ సంభాషణ ఇలా..

ప్రీతి: హలో అమ్మా..
తల్లి: అయిపోయిందా డ్యూటీ.
ప్రీతి: లేదమ్మా నైట్ డ్యూటీ. 2, 3 గంటల తర్వాత ఎవరైనా వస్తారు.. వస్తే గాంధీకి వెళ్లాలి. అక్కడ కూడా నైట్ డ్యూటీ.
తల్లి: బండి తీసుకుపోలేదా?
ప్రీతి: తీసుకెళ్లినా..
తల్లి: డాడీ వచ్చిండంట కదా..
ప్రీతి: ఆ వచ్చిండు.. ఆస్పత్రి దగ్గర దించిండు. మళ్లీ హెచ్‌ఓడీ దగ్గరకు వెళ్లి మాట్లాడినా.. చూసుకుంటా అన్నాడు.
తల్లి: నువ్వు ఒక్కదానివే వెళ్లినవా.. డాడీ కూడా వచ్చాడా.
ప్రీతి: నేనే వెళ్లినా.. డాడీ పనిలో ఉండే.. నేను వెళ్లినా.. ఏమైనా ఉంటే నేను చూసుకుంటా.. ప్రిన్సిపాల్ సర్ దగ్గరికి ఎందుకు వెళ్లినావు అని హెచ్‌ఓడీ అడిగాడు. ఆయనను పిలిచి ఏం మాట్లాడిండో తెలియదు. వాని గురించి డాడీకి ఫోన్ చేయాలి.. నన్ను ఏం చేస్తారు? అంటున్నాడు. ఆయన పేరు కంప్లైంట్ చేసినా సీనియర్లు నాకు ఏమీ నేర్పించకుండా దూరం పెడతారు.
తల్లి: సెకండియర్ అంతా ఒక్కటేనా.. అందరూ అలాగే ఉంటారా..?
ప్రీతి: అందరూ ఆయనలాగా ఉండరు..
తల్లి: వాళ్లు అతన్ని ఏమీ అనడం లేదా.. అలా ఎందుకు చేస్తున్నావని..?
ప్రీతి: అలా ఎవరూ అనడం లేదు.
తల్లి: వీడు అంత ఇదా.. హెచ్‌ఓడీ మాట కూడా వినడా..?
ప్రీతి: ఏం తెలియదు..
తల్లి: నువ్వేపోయి చెప్పినావా..?
ప్రీతి: లేదు.. ప్రిన్సిపాల్‌కు డాడీ ఎవరితో చెప్పించిండో తెలియదు.. హెచ్‌ఓడీ పిలిపించి అడిగిండు. ప్రిన్సిపాల్ దగ్గరికి ఎందుకు వెళ్లినావు అన్నాడు. నేను పడుతున్న ఇబ్బంది గురించి హెచ్‌ఓడీకి చెప్పినా.
తల్లి: ఏం భయపడకు.. మనం వరంగల్‌లోనే ఉన్నాం. ఎక్కడో దేశంలో లేం.. రెండు, మూడు రోజుల్లో కాలేజీకి వస్తాం.

రేపు యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం

పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనలో సైఫ్‌పై వస్తున్న ఆరోపణలతోపాటు పోలీసులు నమోదు చేసిన కేసులపై మంగళవారం కేఎంసీలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. సైఫ్ ఘటనలో జరిగిన వివరాలను చర్చించి ఢిల్లీ యాంటీ ర్యాగింగ్ కమిటీతోపాటు కాళోజీ ఆరోగ్య వర్సిటీకి సైతం నివేదిక సమర్పించనున్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయం మేరకు సైఫ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

క్లుప్తంగా...

ప్రమాదవశాత్తు రెండు ఆర్టీసీ బస్సులు దగ్ధం



మంటల్లో దగ్ధం అవుతున్న బస్సులు

చివ్వెంల (సూర్యాపేట): సాంకేతిక లోపంతో రెండు ఆర్టీసీ బస్సులు దగ్ధం అయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని గుంపుల గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ విజయవాడ డిపోకు చెందిన వెన్నెల బస్సు 30 మంది ప్రయాణికులతో శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరింది. చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని సాయికృష్ణ హోటల్ వద్దకు రాగానే బస్సు లైట్లు ఫెయిల్ కావడంతో ప్రయాణికులను వేరే బస్సుల్లో వారిని విజయవాడకు తరలించారు. విజయవాడకు చెందిన మరో అమరావతి బస్సును వెన్నెల బస్సు వద్దకు తీసుకువచ్చారు. మరమ్మతుకు గురైన బస్సు బ్యాటరీకి చార్జింగ్ ఎక్కించే క్రమంలో బ్యాటరీ వైర్లలో నుంచి మంటలు చెలరేగాయి. ఆర్టీసీ డ్రైవర్లు అగ్ని మాపక వాహనానికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకునేలోపు అమరావతి బస్సు పూర్తిగా కాలిపోగా, వెన్నెల బస్సు పాక్షికంగా కాలిపోయింది.

కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

బోనకల్: వీధికుక్క దాడిలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన మందా పుల్లయ్య, రేణుక దంపతుల ఐదేళ్ల కుమార్తె జశ్విత శనివారం సాయంత్రం వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క దాడి చేసింది. చిన్నారిని ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కంటి పైపొర దెబ్బతిన్నదని వైద్యులు చెప్పడంతో ఆదివారం హైదరాబాద్ తరలించారు.

తలకొరివి పెట్టిన భార్య



భర్త అంత్యక్రియలు నిర్వహిస్తున్న శ్యామల

కామారెడ్డి టౌన్: అనారోగ్యంతో కన్నుమూసిన భర్తకు అతని భార్య తలకొరివి పెట్టింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన నాగల్ల రమేశ్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 20న గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శస్త్రచికిత్స కోసం రూ.8 లక్షలు అవసరమని వైద్యులు చెప్పారు. పేద కుటుంబానికి చెందిన రమేశ్ దుస్థితిపై 'సాక్షి' ప్రచురించిన కథనానికి పలువురు స్పందించి ఆర్థిక సాయం అందించారు. కానీ అప్పటికే శస్త్రచికిత్స ఆలస్యం కావడంతో రమేశ్ శనివారం మరణించాడు. సంతానం ఇద్దరూ కూతుళ్లే కావడంతో భార్య శ్యామలే ఆదివారం దేవునిపల్లిలో భర్త చితికి నిప్పు పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది.

మెడికల్ కాలేజీల్లో కౌన్సెలింగ్ కేంద్రాలు

ఒత్తిడి, ఆత్మహత్య ఆలోచనల నివారణే లక్ష్యం

- వైద్య విద్యార్థుల ఆత్మహత్యాయత్నం నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం
- విద్యార్థులకు యోగా తప్పనిసరి చేయాలని ఇప్పటికే కేంద్రం ఆదేశం
- విద్యార్థులకు ఇచ్చిన పనిగంటలు, వీక్లీ ఆఫ్ వివరాలను అందించాలని ఎన్ఎంసీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కాకతీయ మెడికల్ కాలేజీ ఎండీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం... నిజామాబాద్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థి ఆత్మహత్య.. ఖమ్మం జిల్లాకు చెందిన మెడికల్ విద్యార్థి విజయవాడలో ఆత్మహత్య ఘటనలు ఈ ఐదారు రోజుల్లో యావత్ సమాజాన్ని కుదిపేశాయి. మెడికల్ కాలేజీల్లో అసలేం జరుగుతోందని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ కూడా దీన్ని తీవ్రంగా పరిగణించింది. వేధింపులు, పరీక్షల ఒత్తిడి, ఇతరత్రా కారణాలతో వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు, యత్నాలకు పాల్పడుతున్నారని గుర్తించారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో తక్షణమే కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీచేసింది. మానసిక ఒత్తిడి వంటి సమస్యలతో బాధపడే విద్యార్థులకు కౌన్సెలింగ్ చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే వాటిని పరిష్కరించాలని స్పష్టం చేసింది. ఫిర్యాదులను తమకు పంపించాలని, అందుకు తీసుకున్న చర్యలేంటో తెలియజేయాలని పేర్కొంది. ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు, పీజీ మెడికల్ విద్యార్థులతో ఎన్ని గంటలు పనిచేయిస్తున్నారు? అదనపు గంటలు పనిచేయిస్తున్నారా? వీక్లీ ఆఫ్‌లు ఇస్తున్నారా? వంటి అంశాలపై సమగ్ర సమాచారం పంపాలని ఆదేశించింది. చాలా మెడికల్ కాలేజీలు, బోధనా సుపత్రుల్లోనూ పీజీ మెడికల్ విద్యార్థులపై సీనియర్ డాక్టర్లు పనిభారం వేస్తూ వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు సీనియర్ డాక్టర్లు పీజీలతో పనిచేయించుకుంటూ తమ సొంత ప్రైవేట్ ప్రాక్టీస్‌పై దృష్టి పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటువంటి వారి వివరాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

24 గంటల హెల్ప్‌లైన్..

అన్ని వైద్య కళాశాలల్లో తప్పనిసరిగా 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని, డీన్ లేదా ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఒక అంతర్గత ఉన్నతస్థాయి కమిటీని నియమించాలని, కాలేజీల్లో ఆత్మహత్యల నివారణ కోసం సైకియాట్రీ సీనియర్ ప్రొఫెసర్‌ను సభ్యుడిగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆపదలో ఉన్నవారు లేదా ఆత్మహత్య చేసుకొనే ధోరణి ఉన్నవారు సొసైటీ ఫర్ మెంటల్ హెల్త్ - 011-4076 9002 నంబర్‌కు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు ఫోన్ చేయవచ్చని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సూచించింది. గత ఐదేళ్లలో ఆత్మహత్యలకు పాల్పడిన వైద్య విద్యార్థుల వివరాలను, మధ్యలోనే చదువు మానేసిన విద్యార్థుల వివరాలను పంపించాలని ఎన్ఎంసీ కోరింది. ప్రతి మెడికల్ కాలేజీలోనూ విద్యార్థులకు యోగా, ధ్యానం తప్పనిసరి చేయాలని సూచించింది. ఆత్మహత్యల ధోరణిపై ఆందోళన వ్యక్తం చేసిన ఎన్ఎంసీ.. ఇలాంటి ఘటనలకు ర్యాగింగ్‌తో సంబంధం లేనప్పటికీ చాలా సందర్భాల్లో ర్యాగింగ్ వల్ల ఆత్మహత్యలు జరుగుతున్నాయని భావిస్తోంది. వాటిపై సమీక్షించాల్సిన అవసరముందంటున్నారు. 'ప్రతి ఒక్కరి జీవితం విలువైనది. విద్యార్థులు సురక్షితంగా చదువుకొనేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తాం. అందుకోసం ఎన్ఎంసీ సరైన నిర్ణయాలు తీసుకుంటుంది. విద్యార్థుల్లో ఒత్తిడి, వేధింపులతో ఆత్మహత్యల వంటి ఘటనలను నిరోధించడానికి కౌన్సెలింగ్, ఇతర సహాయక వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయాలి' అని ఎన్ఎంసీ కోరింది. ఆ ప్రకారం రాష్ట్రంలో చర్యలు చేపడుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి.

పెళ్లి రిసెప్షన్‌లో డ్యాన్స్ చేస్తూ.. గుండె ఆగి..

- ఉన్నట్టుండి కుప్పకూలి మృతి చెందిన యువకుడు



డ్యాన్స్ చేస్తున్న యువకుడు ముత్యం

కుభీర్: మహారాష్ట్ర నుంచి వచ్చిన ఓ యువకుడు పెళ్లి రిసెప్షన్‌లో డ్యాన్స్ చేస్తున్నాడు.. బంధువులంతా చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ ఉత్సాహపరుస్తున్నారు. కానీ ఆ యువకుడు డ్యాన్స్ చేస్తూనే ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. గుండెపోటుతో కన్నుమూశాడు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పార్డి(కె) గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది.

సరదాగా డ్యాన్స్ చేస్తూ..

పార్డి(కె) గ్రామానికి చెందిన నాయుడు రాజుకు భైంసా మండలం కామోల్ గ్రామానికి చెందిన యువతితో శుక్రవారం వివాహం జరిగింది. శనివారం సాయంత్రం పెళ్లికొడుకు నాయుడు రాజు ఇంటి వద్ద రిసెప్షన్ ఏర్పాటు చేశారు. నాయుడురాజు బంధువు, మహారాష్ట్రకు చెందిన తమ్మళ్ల ముత్యం (18) కూడా దీనికి హాజరయ్యాడు. రిసెప్షన్ కార్యక్రమం పూర్తికాగా.. బంధువులు సినిమా పాటలు పెట్టుకుని డ్యాన్స్ చేస్తున్నారు. ముత్యం కూడా డ్యాన్స్ చేయడం ప్రారంభించాడు. కాసేపటికి డ్యాన్స్ చేస్తూనే కుప్పకూలిపోయాడు. అతడు తిరిగి లేవకపోవడంతో బంధువులు వెంటనే భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ముత్యం గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఆదివారం మహారాష్ట్రలోని స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆశలసౌధం నుంచి ఆత్మహత్యల వైపు..

క్షణికావేశంలో తనువు చాలిస్తున్న విద్యార్థులు	తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్న పిల్లలు	దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆత్మహత్యలు..	తెలంగాణలో 2021లో 4.51 శాతంగా నమోదు

కేజీ నుంచి పీజీ దాకా కౌన్సెలింగ్ చేస్తేనే నియంత్రణ

సాక్షి ప్రతినిధి, వరంగల్: తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను అందుకోలేకపోతున్నామన్న ఒత్తిడి.. సీనియర్ల వేధింపులు.. ఆరోగ్య సమస్యలు.. కారణాలేవైతేనేం.. క్షణికావేశంలో విద్యార్థులు అనేక మంది ఆశల సౌధం నుంచి ఆత్మహత్యల ఒడిలోకి జారుతున్నారు. బంగారు భవిష్యత్‌ను బలి చేసుకుంటున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం 1995 నుంచి 2021 డిసెంబర్ 31 వరకు దేశవ్యాప్తంగా 1,88,229 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. మొత్తం ఆత్మహత్యల్లో గత 12 ఏళ్లలోనే 55.28% (1,04,053 మంది) విద్యార్థులు అసువులు బాశారు. 2019లో మొత్తం జరిగిన 10,355 ఆత్మహత్యల్లో మహారాష్ట్రలో 1,487, మధ్యప్రదేశ్ (927), తమిళనాడు (914), కర్ణాటక (673), ఉత్తరప్రదేశ్ (603)లో కలిపి 44% మరణాలు నమోదయ్యాయి. ఈ లెక్కన మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఆత్మహత్యలు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో 2018లో 401 మంది, 2019లో 426, 2020లో 430, 2021లో 459 మంది ఐదో తరగతి నుంచి పీజీ విద్యార్థుల వరకు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ వివరాలను 2022 డిసెంబర్‌లో విడుదల చేసిన నివేదికలో ఎన్సీఆర్‌బీ పేర్కొంది. ఎన్సీఆర్‌బీ నివేదిక 2021 ప్రకారం దేశ వ్యాప్తంగా ప్రతి లక్ష మందిలో 12 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

ఐదేళ్లలో 119 మంది మెడికోల ఆత్మహత్య

- జాతీయ వైద్య కమిషన్ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశంలో 512 మెడికల్ కాలేజీల్లో 119 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడినట్లు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) వెల్లడించింది. ఈ మేరకు తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. ఆత్మహత్య చేసుకున్నవారిలో ఎంబీబీఎస్ తదితర వైద్య గ్రాడ్యుయేట్లు 64 మంది ఉండగా, 55 మంది ఎండీ, ఎంఎస్ చదువుతున్న విద్యార్థులున్నారని పేర్కొంది. వేధింపులు, ఒత్తిడి తదితర కారణాల వల్ల 1,166 మంది మధ్యలోనే వైద్యవిద్యను వదిలేసి వెళ్లిపోయారని వివరించింది. అందులో ఎంబీబీఎస్ విద్యార్థులు 160 మంది, పీజీలో ఎంఎస్ జనరల్ సర్జరీ విద్యార్థులు 114 మంది, ఎంఎస్ ఆర్థోపెడిక్స్ 50 మంది, గైనిక్ 103 మంది, ఎంఎస్ ఈఎన్‌టీ 100 మంది, పీజీ ఎండీ జనరల్ మెడిసిన్56 మంది, ఎండీ పీడియాట్రిక్స్ 54 మంది, ఇతర బ్రాంచీలకు చెందినవారు 529 మంది ఉన్నారని తెలిపింది. 18–30 ఏళ్ల మధ్యలో వైద్యవృత్తిలో తలెత్తే ఒడిదొడుకులను తట్టుకోలేక కొందరు యువవైద్యులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కేంద్ర ప్రభుత్వం ఆ నివేదికలో వెల్లడించింది. వైద్య విద్యార్థుల్లో ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ) పాసయ్యేవారు 20 శాతం వరకే ఉంటున్నారు. ఎఫ్ఎంజీఈ పాసైతేనే మన దేశంలో మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత ఉంటుంది. పీజీలో ఆర్థికభారం, వృత్తి బాధ్యతలు, పెళ్లికాకపోవడం వంటివి ఆత్మహత్యలకు కారణాలుగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఆత్మహత్యల్లో 60 శాతం ఒత్తిడికి సంబంధించినవే ఉంటున్నాయని వివరించింది.


ప్రతికూల పరిస్థితులను తట్టుకొనేలా చూడాలి



ఆత్మహత్యల నివారణపై ఓ ఉద్యమం జరగాలి. ఎంతటి ప్రతికూల పరిస్థితులనైనా తట్టుకొనేలా నైతిక బలాన్ని, శక్తిని ఇవ్వడానికి ప్రయత్నించాలి. ప్రధానంగా విద్యార్థులు ఒత్తిళ్లకు దూరంగా చదువుకొనేలా చూడాలి. ప్రాథమిక విద్యలో పిల్లలు సెల్‌ఫోన్లకు అతుక్కోకుండా తల్లిదండ్రులే జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల్లో మార్పులను గమనించాలి. ఏదైనా బాధలో ఉంటే సానుకూలంగా ఓదార్చాలి. అనారోగ్య సమస్యలు ఉంటే కౌన్సెలింగ్, చికిత్సలు లేకుండా నిరుత్సాహపరచకూడదు.

– డాక్టర్ బి.కేశవులు, మానసిక వైద్య నిపుణుడు

ఆత్మహత్య నిర్ణయం వద్దు..



ఏదైనా క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన, నిర్ణయం తీసుకుంటే మానుకోవాలి. రెండు రోజుల తర్వాత కూడా అదే ఆలోచన ఉంటే దాని నుంచి బయటపడే మార్గం అన్వేషించాలి. ప్రతి సమస్యకూ పరిష్కార మార్గం ఉంటుంది. మనం చేయకపోతే ఇతరులు చేస్తారు. అంతే తప్ప నా జీవితం ఇంతే.. నాకు ఎప్పుడూ ఇంతే అనే భావాలను మనసులోకి రానివ్వొద్దు. ఎవరైనా ఒకే విషయాన్ని పదేపదే ఆలోచిస్తే వారిని ఆ విషయం నుంచి బయటకు తీసుకురావడానికి కౌన్సెలింగ్ అవసరం.

– ఏవీ రంగనాథ్, పోలీస్ కమిషనర్, వరంగల్

గురువుకే వేలు చూపించి బెదిరింపులకు దిగాడు

- ఎంజీఎంలో మరో పీజీ విద్యార్థి దురుసు ప్రవర్తన
- అసోసియేట్ ప్రొఫెసర్‌కు వేలు చూపుతూ బెదిరింపులు
- ఎంజీఎం సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసిన అసోసియేట్ ప్రొఫెసర్

ఎంజీఎం: వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరత, ఆస్పత్రి విధులకు సక్రమంగా హాజరుకాని వైద్యుల వ్యవహారశైలి వంటి కారణాలతో వైద్య విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తోంది. సీనియర్ విద్యార్థి సైఫ్‌వేధింపులు తట్టుకోలేక జూనియర్ వైద్య విద్యార్థి ప్రీతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మరువకముందే.. ఇదే కాలేజీకి చెందిన మరో వైద్య విద్యార్థి దురుసు ప్రవర్తన చర్చనీయాంశమైంది. ఈసారి పీజీ వైద్య విద్యార్థి ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలోనే శనివారం ఓ అసోసియేట్ ప్రొఫెసర్‌తో దురుసుగా ప్రవర్తించి ఆయనపై ఏకంగా బెదిరింపులకు దిగాడు. అసోసియేట్ ప్రొఫెసర్‌కు వేలు చూపిస్తూ 'నేను పీజీ సీనియర్ విద్యార్థిని..నువ్వు నన్నేం చేస్తావు..అంటూ తీవ్ర పదజాలంతో దూషించాడు.'దీంతో ఒక్కసారిగా కంగుతిన్న సదరు వైద్యుడు వెంటనే ఆ విద్యార్థికి గట్టిగానే సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం ఈ ఘటనపై సూపరింటెండెంట్‌కు సైతం ఫిర్యాదు చేశారని విద్యార్థులు చర్చించుకుంటున్నారు.

వానర మూక వీరంగం

- ఇద్దరు మహిళలకు గాయాలు




గాయపడిన అనసూర్య

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట), హుజూర్‌నగర్‌రూరల్: వేర్వేరు ప్రాంతాల్లో వానర మూకల దాడిలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. పాతసూర్యాపేట గ్రామానికి చెందిన నిమ్మల అనసూర్య ఆదివారం సాయంత్రం ఇంట్లో పని చేసు కుంటుండగా కోతుల గుంపు ఒక్కసారిగా చొరబడింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అనసూర్యపై దాడి చేసి గాయపరిచాయి. వెంటనే ఆమెను స్థాని కులు వెంటనే చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా.. తిరిగి స్వగ్రామానికి తీసు కొచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు నెలల క్రితం ఇదే గ్రామంలో మెట్టు లింగమ్మ అనే వృద్ధురాలిపై కోతులు దాడి చేయగా ఆమె మృతి చెందింది.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు: కోతుల దాడిలో వృద్ధురాలు గాయపడింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. లింగగిరి గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల రంగమ్మ తన ఇంటి సమీపంలోని కోతులను వెళ్లగొట్టడానికి ప్రయత్నించంది. కానీ అవి ఒక్కసారిగా దాడి చేయడంతో ఆమె కాలు విరిగింది. వృద్ధురాలిని హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా...

నాగాలాండ్, మేఘాలయల్లో
నేడే పోలింగ్



మేఘాలయలో తీగల వంతెనల మీదుగా పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

షిల్లాంగ్/కొహిమా: నాగాలాండ్, మేఘాలయల్లో సోమవారం పోలింగ్ జరగనుంది. రెండు రాష్ట్రాల్లో 552 మంది బరిలో ఉన్నారు. 34 లక్షలకు పైగా ఓటర్లు వారి భవితవ్యాన్ని నిర్దేశించనున్నారు. మేఘాలయాలో ఇప్పటిదాకా ఏ పార్టీకి పూర్తి మెజార్టీ దక్కలేదు. నాగాలాండ్‌లో ఏ పార్టీ అన్నిచోట్లా పోటీకి దిగలేకపోయింది!

కశ్మీర్ పండిట్లపై మళ్లీ దాడి

శ్రీనగర్: కశ్మీర్ లోయలో పండిట్లు లక్ష్యంగా మళ్లీ దాడులు మొదలయ్యాయి. పుల్వామా జిల్లా అచన్‌లో ఏటీఎం గార్డుగా పని చేస్తున్న సంజయ్ శర్మ అనే 40 ఏళ్ల కశ్మీరీ పండిట్‌ను ఉగ్రవాదులు ఆదివారం కాల్చి చంపారు. మార్కెట్‌కు వెళుతుండగా మాటు వేసి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఛాతీపై గుళ్ల వర్షం కురిపించారు. గతేడాది కశ్మీర్లో పౌరులపై 30 ఉగ్ర దాడులు జరగ్గా ముగ్గురు కశ్మీర్ పండిట్లు సహా 18 మంది మరణించారు.

స్కూటీని గుద్ది, 2 కి.మీ. లాక్కెళ్లి...
తాతా మనవళ్లను బలి తీసుకున్న ట్రక్కు

మహోబా(యూపీ): తాత, మనవడు వెళ్తున్న స్కూటీని ఓ ట్రక్కు ఢీకొట్టి, వారిని రెండు కిలోమీటర్ల దూరం వరకు లాక్కెళ్లింది. ఈ ఘటనలో తాత, మనవడు ప్రాణాలు కోల్పోయారు. యూపీలోని మహోబా జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. ఉదిత్ నారాయణ్ చౌరాసియా(66) అనే విశ్రాంత ఉపాధ్యాయుడు, ఆయన ఆరేళ్ల మనవడు మార్కెట్ నుంచి ఇంటికి వెళ్తుండగా స్థానిక బిజనగర్ మలుపులో ప్రమాదం జరిగిందని సీఐ రామ్ పర్వేశ్ రాయ్ చెప్పారు. తాత, మనవడు సహా ట్రక్కు కింద ఇరుక్కుపోయిన స్కూటీని ట్రక్కు రెండు కిలోమీటర్ల దూరం లాక్కెళ్లింది. స్థానికులు ట్రక్కును అడ్డగించి ఆపేశారు. ఛిద్రమైన తాత, మనవడి మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టంకు పంపారు.

బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ...
ఓ మద్యం కుంభకోణం
ఇరు పార్టీల పోరాటానికి కేంద్ర బిందువు

ఢిల్లీ మద్యం కుంభకోణం. దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారిన వ్యవహారమిది. ఆమ్ ఆద్మీ పార్టీకి, కేంద్రంలోని అధికార బీజేపీకి మధ్య రగడ మరింత పెరగడానికి కారణమైన కేసు. దీనికి సంబంధించిన అరెస్టుల పరంపరలో భాగంగా తాజాగా ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా పేరూ చేరింది. అంతేగాక ఈడీ తన రెండో చార్జిషీట్‌లో ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేరును కూడా ప్రస్తావించింది! ఇంతకీ ఈ మద్యం కుంభకోణం కథా కమామిషు ఏమిటి...?

- సాక్షి, నేషనల్ డెస్క్



ఢిల్లీలో మద్యం దుకాణాలను ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేది. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం 2020లో నూతన మద్యం విధానాన్ని రూపొందించింది. 2021 నవంబర్‌లో దాన్ని అమల్లోకి తెచ్చింది. నూతన విధానంలో పలు మార్పులు చేశారు. మద్యం అమ్మకాలను ప్రభుత్వ పరిధి నుంచి తప్పించి, ప్రైవేట్ రిటైల్ వ్యాపారులకు కట్టబెట్టారు. ఢిల్లీని 32 జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లో 27 దుకాణాలున్నాయి. ఒక్కో మున్సిపల్ వార్డులో 2–3 చొప్పున దుకాణాలు ఏర్పాటు చేశారు. కొత్త పాలసీ ప్రకారం మద్యాన్ని వినియోగదారులకు 'హోం డెలివరీ' చేయొచ్చు. తెల్లవారుజామున 3 గంటల వరకూ దుకాణాలు తెరిచి ఉంచొచ్చు. వినియోగదారులకు అపరిమితంగా డిస్కౌంట్లు ఇవ్వొచ్చు. అలాగే గరిష్ట అమ్మకం ధర కూడా ఉండదు. డిమాండ్‌ను బట్టి ఏ ధరకైనా అమ్ముకోవచ్చు.

ఇలా బయటపడింది...

2022 ఏప్రిల్‌లో ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వచ్చిన నరేశ్ కుమార్ కొత్త మద్యం విధానం ఫైళ్లను క్షుణ్నంగా అధ్యయనం చేశారు. ''విధానం రూపకల్పన, అమల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు అనుచిత లబ్ధి చేకూర్చారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది'' అని తేల్చారు. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక రూపొందించారు. విషయాన్ని అప్పట్లో ఎక్సైజ్‌తో పాటు 19 శాఖలను నిర్వహిస్తున్న ఢిల్లీ ఉపముఖ్యమంత్రి, మనీశ్ సిసోడియా దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్ నివేదికపై అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించారు. మద్యం విధానంపై సీబీఐ విచారణకు 2022 జూలైలో ఆదేశాలు జారీ చేశారు. తర్వాత కొన్ని రోజులకే కొత్త విధానాన్ని రద్దు చేస్తున్నామని, పాత మద్యం విధానాన్నే అమలు చేస్తామని కేజ్రీవాల్ సర్కారు ప్రకటించింది. సీబీఐ దర్యాప్తు మాత్రం కొనసాగింది. సిసోడియాతో పాటు ఢిల్లీ ఎక్సైజ్ అధికారులు, ప్రైవేట్ మద్యం వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. 2022 ఆగస్టు 19న ఎఫ్ఐఆర్ నమోదైంది. సిసోడియా సహా మొత్తం 15 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో సీబీఐ చేర్చింది. తర్వాత కేసు దర్యాప్తును ఈడీ చేపట్టింది.

సీఎస్ నివేదికలో ఏముందంటే...

కొత్త మద్యం విధానం పేరిట మద్యం వ్యాపారంలో గుత్తాధిపత్యానికి తెరతీశారు. కొత్త విధానంలోని నిబంధనలనూ ఉల్లంఘించి కొన్ని కంపెనీలకు మద్యం లైసెన్సులు కట్టబెట్టారు. ఎల్జీ అనుమతి లేకుండానే విధానంలో సిసోడియా మార్పులు చేశారు. కరోనా వ్యాప్తి సాకుతో ప్రైవేట్ వ్యాపారులు చెల్లించాల్సిన రూ.144.36 కోట్ల లైసెన్స్ ఫీజును ఆయన మాఫీ చేశారు. పైగా ఒక్కో బీర్ కేసుపై చెల్లించాల్సిన రూ.50 ఇంపోర్ట్ పాస్ ఫీజునూ తొలగించారు. పైగా ప్రైవేట్ వ్యక్తులకు మేలు చేయడమే లక్ష్యంగా విదేశీ మద్యం ధరలను ఇష్టారాజ్యంగా సవరించారు.

ఎఫ్ఐఆర్‌లో ఏముందంటే...

మద్యం వ్యాపారుల నుంచి లంచాలు తీసుకొని అక్రమంగా ఎల్–1 లైసెన్సులు జారీ చేశారు. సిసోడియా సన్నిహితుడైన దినేశ్ అరోరాకు చెందిన రాధా ఇండస్ట్రీస్ బ్యాంకు ఖాతాకు ఇండో స్పిరిట్స్ సంస్థ ఎండీ సమీర్ మహేంద్రు కోటి రూపాయలు బదిలీ చేశారు. ఎల్–1 లైసెన్సులు పొందినవారు రిటైల్ వ్యాపారులకు క్రెడిట్ నోట్లు జారీ చేశారు. వీటిద్వారా ప్రజాప్రతినిధులకు ముడుపులు చేరవేయడమే వారి ఉద్దేశం. ఈ అక్రమాలు, లంచాల బాగోతం బయటపడకుండా లైసెన్స్‌దారులు తమ ఖాతా పుస్తకాల్లో తప్పుడు వివరాలు నమోదు చేశారు. మద్యం వ్యాపారుల నుంచి లంచాలు వసూలు చేసి ప్రజాప్రతినిధులకు చేరవేయడంలో సిసోడియా సన్నిహితులు అమిత్ అరోరా, దినేశ్ అరోరా, అర్జున్ పాండే కీలకంగా వ్యవహరించారు. సమీర్ మహేంద్రు నుంచి అర్జున్ పాండే 2 నుంచి 4 కోట్ల దాకా వసూలు చేశారు. ఎల్–1 లైసెన్స్ పొందిన మహాదేవ్ లిక్కర్స్ ప్రతినిధి సన్నీ మార్వాకు ఢిల్లీ ప్రభుత్వాధికారులతో సన్నిహిత సంబంధాలున్నాయి. వారికి తరచుగా లంచాలు ఇస్తుంటాడని సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. కొత్త మద్యం విధానం వల్ల ఢిల్లీ ఖజానాకు రూ.8,000 కోట్ల మేర నష్టం వాటిల్లిందని బీజేపీ ఎంపీ మనోజ్ ఆరోపించారు. కుంభకోణం విలువ రూ.10,000 కోట్లకు పైగానే ఉంటుందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా ఆరోపించడం తెలిసిందే.

సిసోడియా అరెస్ట్
8 గంటల విచారణ అనంతరం అదుపులోకి..

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి ఆప్ నేత మనీశ్ సిసోడియాను ఆదివారం సాయంత్రం సీబీఐ అరెస్ట్ చేసింది. అంతకుముందు ఆయన్ను 8 గంటలపాటు ప్రశ్నించింది. సీబీఐ నోటీసుల మేరకు సిసోడియా ఉదయం 11.12 గంటలకు సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. విచారణలో భాగంగా సీబీఐ అధికారుల బృందం మద్యం విధా నంలో వివిధ కోణాలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దినేశ్ అరోరా తదితరులతో సంబంధాలు, వేర్వేరు ఫోన్ల నుంచి పంపించిన మెసేజీలపై ఆయన్ను గుచ్చిగుచ్చి ప్రశ్నించింది. 'సిసోడియా సమాధానాలతో సీబీఐ అధికారులు సంతృప్తి చెందలేదు. విచారణలో ఆయన సహకరించడం లేదు. కీలకమైన అంశాలపై సరైన వివరణ ఇవ్వకుండా తప్పించుకున్నారు. అందుకే అరెస్ట్ చేశారు'అని సీబీఐ అధికారులు చెప్పారు. ఆయన్ను మరింత లోతుగా ప్రశ్నించేందుకు కస్టోడియల్ దర్యాప్తు అవసరం ఉందని అధికారులు భావించారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 9 మంది అరెస్టైన విషయం తెలిసిందే.

అరెస్టుకు భయపడేదిలేదు

సీబీఐ కార్యాలయానికి రావడానికి ముందుగా సిసోడియా ఆదివారం ఉదయం రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అనంతరం భారీ సంఖ్యలో మద్దతుదారులతో కలిసి సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అధికారిక వాహనంలో నుంచే ఆయన మీడియాతో మాట్లాడారు. తనను అరెస్ట్ చేయవచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. 'నాపై మోపిన తప్పుడు ఆరోపణలపై జైలుకు వెళ్లేందుకైనా భయపడేది లేదు. నా భార్య, నా కుటుంబం ఎల్లప్పుడూ నాకు మద్దతుగా నిలుస్తుంది. నేను జైలుకెళ్లినా నా మద్దతుదారులు నా కుటుంబానికి అండగా నిలుస్తారు'అని పేర్కొన్నారు. ''మేం భగత్ సింగ్ అనుచరులం. భగత్ సింగ్ దేశం కోసం ప్రాణాలర్పించారు. ఆయనతో పోలిస్తే తప్పుడు ఆరోపణలపై నేను జైలుకు వెళ్లాల్సి రావడం చాలా చిన్న విషయం'అన్నారు. సిసోడియాను ప్రశ్నించడాన్ని నిరసిస్తూ సీబీఐ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన ఆప్ నేతలు సంజయ్ సింగ్, గోపాల్ రాయ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీబీఐ కార్యాలయం పరిసరాల్లో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. జేఎల్ఎన్ స్టేడియం రోడ్డులో మధ్యాహ్నం నుంచి బారికేడ్లు ఏర్పాటు చేశారు. మీడియా సహా అందరిపైనా ఆంక్షలు విధించారు. ఈ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్‌లో సిసోడియా ఒకటో నిందితుడిగా ఉన్నారు. 2022 అక్టోబర్ 17వ తేదీన సిసోడియాను సీబీఐ తొలిసారి ప్రశ్నించింది. ఆయనపై ఐపీసీ 120–బి(పనిష్మెంట్ ఆఫ్ క్రిమినల్ కాన్స్పిరసీ), 477ఏ(ఫాల్సిఫికేషన్ ఆఫ్ అకౌంట్స్)తోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7(అధికారం దుర్వినియోగంతో అవినీతికి పాల్పడటం) కింద కేసులు పెట్టారు.

దుష్ట రాజకీయాల్లో భాగమిది: కేజ్రీవాల్

డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్ట్ చేయడం దుష్ట రాజకీయాలే కారణమని సీఎం కేజ్రీవాల్ చెప్పారు. మనీశ్ అమాయకుడు. రాజకీయంగా కక్ష సాధించేందుకే ఆయన్ను అరెస్ట్ చేశారు. ప్రజలెంతో ఆగ్రహంతో ఉన్నారు. ప్రజలు అన్ని విషయాలూ గమనిస్తున్నారు. ప్రతిదీ అర్థం చేసుకుంటున్నారు. దీనికి తగిన జవాబు ఇస్తారు. తాజా పరిణామంతో మేం మరింత బలంగా తయారవుతాం'అని ఆయన హిందీ ట్వీట్ చేశారు.

నియంతృత్వానికి పరాకాష్ట: ఆప్

సిసోడియా అరెస్టును నియంతృత్వానికి పరాకాష్టగా ఆప్ అభివర్ణించింది. 'ఉత్తమ విద్యా మంత్రి, మంచి వ్యక్తి అయిన సిసోడియాను అరెస్ట్ చేయడం సరికాదు. దీని వెనుకాల ఉన్న ప్రధాని మోదీని ఆ దేవుడు కూడా క్షమించడు. మీ నియంతృత్వానికి త్వరలో తెర పడక తప్పదు''అంటూ ఎంపీ సంజయ్ సింగ్ మండిపడ్డారు.



విచారణ కోసం సీబీఐ ఆఫీస్‌కు వెళ్తున్న సిసోడియా

త్వరలో మరో 'జోడో'!
ఈసారి తూర్పు నుంచి పశ్చిమానికి

- ఐదు సూత్రాల రాయ్‌పూర్ డిక్లరేషన్
- ముగిసిన 3 రోజుల కాంగ్రెస్ ప్లీనరీ
- అదానీపై రాహుల్‌గాంధీ నిప్పులు



ప్లీనరీలో పార్టీ నేతలనుద్దేశిస్తూ ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

నవా రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): అదానీ వ్యవహారంలో మోదీ సర్కారుపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నిప్పులు చెరిగారు. అధికార బీజేపీ నేతలు నిస్సిగ్గుగా అదానీ గ్రూపుకు ఏకంగా పార్లమెంటులోనే కొమ్ముకాస్తున్నారంటూ ధ్వజమెత్తారు. వ్యాపార మిషతో వచ్చి భారత్‌ను ఆక్రమించిన ఈస్టిండియా కంపెనీతో అదానీ గ్రూపును పోల్చారు! అక్రమ మార్గాల్లో భారీగా సంపద పోగేసి దేశానికి వ్యతిరేకంగా పని చేస్తోందని ఆరోపించారు. దీనిపై మోదీ స్పందనేమిటని పార్లమెంటులో విపక్షాలన్నీ నిలదీస్తే అది తప్ప అన్ని విషయాలపైనా మాట్లాడారంటూ ఎద్దేవా చేశారు. ''దీనిపై నిజం వెలుగు చూసేదాకా అదానీ గ్రూపు వ్యాపార పద్ధతులు తదితరాలపై ప్రశ్నాస్త్రాలు సంధిస్తూనే ఉంటాం. అవసరమైతే పార్లమెంటులో వెయ్యిసార్లైనా దీన్ని ప్రస్తావిస్తాం'' అని స్పష్టం చేశారు. ఆదివారం రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ 85వ ప్లీనరీ మూడో రోజు ముగింపు సమావేశాలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. ''అదానీకి ఒక్కటే చెప్పదలచా. ఆయన కంపెనీ దేశానికి నష్టం చేస్తోంది. దేశ మౌలిక వసతులన్నింటినీ చెరబడుతోంది'' అని తీవ్ర ఆరోపణలు చేశారు. ''పోర్టులు తదితరాలతో పాటు దేశ సంపదను చెరబట్టిన కంపెనీకి వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం మేం చేస్తున్న పోరాటమిది'' అని వ్యాఖ్యానించారు. ''చరిత్ర పునరావృతమవుతోంది. అవసరమైతే మరోసారి మరో కంపెనీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతుంది'' అని ప్రకటించారు.

కశ్మీరీల్లో దేశభక్తిని రగిల్చాం...

భారత్ జోడో యాత్ర ద్వారా జరిగిన 'తపస్సు' తాలూకు స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాహుల్ పిలుపునిచ్చారు. ''అందుకు కావాల్సిన వ్యూహాలు రూపొందించండి. దేశమంతటితో పాటు నేను కూడా వాటిలో భాగస్వామిని అవుతా'' అని సూచించారు. తద్వారా త్వరలో మరో దేశవ్యాప్త యాత్ర ఉంటుందని సంకేతాలిచ్చారు. ''జోడో యాత్రలో ప్రజలు లక్షలాదిగా పాల్గొన్నారు. యాత్ర పొడవునా నేనెంతో నేర్చుకున్నా. కన్యాకుమారిలో మొదలై కశ్మీర్ చేరేసరికి ఎంతగానో మారాను. మిగతా ప్రజలంతా ఆనందంగా ఉంటే కశ్మీరీలు మాత్రమే ఎందుకు బాధల్లో ఉన్నారని ఒక బాలుడు అడిగాడు. నా యాత్ర కశ్మీర్‌లో ప్రవేశించాక పోలీసు సిబ్బంది పత్తా లేకుండా పోయారు. కానీ ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు అంతటా వేలాదిగా కశ్మీరీలు త్రివర్ణం చేబూని నాతో పాటు నడిచారు. తానూ లాల్‌చౌక్‌లో జాతీయ జెండా ఎగరేశానని మోదీ చెప్పుకున్నారు. నాతోపాటు వేలాది మంది కశ్మీరీలు లాల్‌చౌక్‌లో జాతీయ పతాకాన్ని ఎగరేశారు. త్రివర్ణంపై కశ్మీరీల్లో ప్రేమను మోదీ తన వేధింపు చర్యల ద్వారా దూరం చేస్తే మేం దాన్ని వారిలో తిరిగి పాదుగొల్పాం. ఈ తేడాను ఆయన అర్థం చేసుకోలేకపోయారు'' అని కాంగ్రెస్ ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య చెప్పుకొచ్చారు.

సమైక్యంగా శ్రమిద్దాం... ఎన్నికల పరీక్ష నెగ్గుదాం

''కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్తాన్, తెలంగాణల్లో అసెంబ్లీ ఎన్నికలున్నందున ఈ ఏడాదంతా చాలా కీలకం. ఆ ఎన్నికల్లో విజయానికి సమైక్యంగా, క్రమశిక్షణతో కృషి చేయండి'' అని పార్టీ నేతలు, కార్యకర్తలకు రాయ్‌పూర్ ప్లీనరీ పిలుపునిచ్చింది. తద్వారా 2024 లోక్‌సభ ఎన్నికలకు చక్కని వేదిక సిద్ధం చేసుకుందామని పేర్కొంది. ఈ మేరకు ఐదు సూత్రాలతో రాయ్‌పూర్ డిక్లరేషన్‌ను ప్లీనరీ ఆమోదించింది. భావ సారూప్యమున్న పార్టీలతో నిర్మాణాత్మక ఉమ్మడి ప్రణాళికతో కలిసి పని చేసేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని అందులో పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, అది ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ పేర్కొంది. ''బీజేపీ, ఆరెస్సెస్‌లతో, వాటి మోసపూరిత రాజకీయాలతో ఎన్నడూ రాజీ పడని ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ నియంతృత్వానికి, మతవాద, ఆశ్రిత పెట్టుబడిదారీ పోకడలకు వ్యతిరేకంగా దేశ రాజకీయ విలువ పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటాం. నానాటికీ పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, సమాజంలో చీలిక తెచ్చే యత్నాలు, రాజకీయ నియంతృత్వాలపై రాజీలేని పోరాటం చేస్తాం. ఇందుకోసం భావ సారూప్య పార్టీలతో కలిసి పని చేస్తాం'' అని డిక్లరేషన్‌లో పేర్కొంది.

పాసీఘాట్ నుంచి పోరుబందర్ దాకా...!

తూర్పున అరుణాచల్‌ప్రదేశ్‌లోని పాసీఘాట్ నుంచి పశ్చిమాన గుజరాత్‌లోని పోరుబందర్ దాకా మరో దేశవ్యాప్త పాదయాత్ర చేసే యోచన ఉన్నట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. ''భారత్ జోడో యాత్ర సక్సెస్‌తో పార్టీలో ఉత్సాహం తొణికిసలాడుతోంది. మరో యాత్ర కోసం కార్యకర్తలు ఉవ్విళ్లూరుతున్నారు. అది జోడో యాత్రకు భిన్నంగా ఉంటుంది. దారి పొడవునా నదులు, దుర్గమారణ్యాలున్నందున చాలావరకు కాలినడకన, అక్కడక్కడా ఇతరత్రా సాగొచ్చు. జూన్‌కు ముందు గానీ, నవంబర్ ముందు గానీ కొత్త యాత్ర మొదలు కావచ్చు. కొద్ది వారాల్లో నిర్ణయం తీసుకుంటాం'' అని వివరించారు.

నియంతృత్వంపై పోరాడతాం: ఖర్గే

రాయ్‌పూర్: ప్రజాస్వామ్య పరిరక్షణకు, మోదీ సర్కారు నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే చెప్పారు. ఆదివారం రాయ్‌పూర్ శివార్లలో కాంగ్రెస్ ర్యాలీలో ఆయన మాట్లాడారు. ''గౌతమ్ అదానీ సంపద అపారంగా పెరిగిపోవడం వెనక మర్మమేంటో ప్రధాని మోదీ మాకూ చెప్పాలి. ఒక్క వ్యక్తి కోసం దేశాన్ని తాకట్టు పెట్టారు'' అంటూ దుయ్యబట్టారు.

ఇటలీ సముద్ర జలాల్లో పడవ మునక



రోమ్: ఇటలీ సముద్ర జలాల్లో వలసదారులు ప్రయాణిస్తున్న ఒక చెక్క పడవ రెండు ముక్కలై నీళ్లల్లో మునిగిపోయింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో ఎందరో మరణించారు. ఇప్పటివరకు సహాయ సిబ్బంది 58 మృతదేహాలను వెలికి తీశారు. మరో 60 మంది ప్రాణాలు కాపాడారని స్టేట్ టీవీ వెల్లడించింది. ప్రమాదం జరిగినప్పుడు పడవలో 180 మందికి పైగా శరణార్థులున్నట్టుగా తీర ప్రాంత పట్టణమైన క్రోటోన్‌లో ఓడరేవు అధికారులు చెబుతున్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికుల్ని ఎక్కించడం వల్లే అయోనియాన్ సముద్రంలో ప్రయాణిస్తున్న పడవ ధ్వంసమై ఈ ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమికంగా తెలుస్తోంది.

యూఎస్ విమానం Vs చైనా యుద్ధ విమానం

వాషింగ్టన్: దక్షిణ చైనా సముద్రం మీద డ్రాగన్ దుందుడుకు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అమెరికా నిఘా విమానాన్ని చైనా జే–11 యుద్ధ విమానం వెంబడించడం కలకలం సృష్టించింది. గగనతలం నుంచి గగనతలంలో లక్ష్యాలను ఛేదించే క్షిపణులున్న ఈ విమానం పరాసెల్ ద్వీప సమూహం దగ్గర అమెరికా పీ–8 పోసీడాన్ విమానాన్ని 21,500 అడుగుల ఎత్తులో వెంబడించింది. ''చైనా గగన తలానికి 12 నాటికల్ మైళ్ల దాకా వచ్చారు. ఇంకా ముందుకొస్తే తీవ్ర పరిణామాలంంటాయి'' అని హెచ్చరించింది. కాసేపటికే అమెరికా విమానం రెక్కలకు కేవలం కొన్ని వందల అడుగుల దూరం వరకు వెళ్లింది! ఇలా 15 నిమిషాలు వెంబడించాక వెనుదిరిగింది. పరాసెల్ ద్వీపాలపై చైనా హక్కులను అమెరికా అంగీకరించడం లేదు. దీనిపై విభేదాలు నెలకొన్నాయి.

పాక్, చైనాలకు సాయం కట్: నిక్కీ హేలీ

వాషింగ్టన్: తాను అధికారంలోకి వస్తే అమెరికాను ద్వేషించే దేశాలకు ఆర్థిక సాయాన్ని పూర్తిగా నిలిపివేస్తానని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న ఇండియన్ అమెరికన్ నిక్కీ హేలీ చెప్పారు. చైనా, పాకిస్తాన్, ఇరాక్ వంటి దేశాలకు ఒక సెంట్ కూడా ఇవ్వనన్నారు. ''చెడ్డ దేశాలకు అమెరికా ఇక మీదట ఎలాంటి సాయం చేయదు. మన మిత్రదేశాలు, మన శత్రువుల్ని కూడా తమ శత్రువులుగా చూసేవారికే ఏ సాయమైనా అందిస్తాం'' అని న్యూయార్క్ పోస్టు వ్యాసంలో రాసుకొచ్చారు.

పాక్‌లో వేతనాలు, బిల్లుల చెల్లింపులు బంద్

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఆర్థిక కష్టాలతో షహబాజ్ షరీఫ్ సర్కారు అతలాకుతలమవుతోంది. ప్రభుత్వోద్యోగులు, సిబ్బంది వేతనాలు సహా అన్ని బిల్లుల చెల్లింపుల్ని నిలిపేసింది. తదుపరి ఉత్తర్వుల దాకా శాఖలు, డివిజన్లు అనుబంధ విభాగాల బిల్లులను క్లియర్ చేయొద్దని ఆదేశించింది. మరోవైపు అత్యవసరమైన మందులు కూడా దొరక్క రోగులు నరకం చూస్తున్నారు. అత్యవసర ఆపరేషన్లు కూడా ఆగిపోతున్నాయి!

పంజాబ్ జైల్లో ఇద్దరు గ్యాంగ్‌స్టర్లు మృతి

అమృత్‌సర్: పంజాబ్‌లో తరన్‌తరన్ జిల్లా గోవింద్‌వాల్ సాహిబ్ సెంట్రల్ జైలులో ఖైదీల మధ్య జరిగిన గొడవలో ఇద్దరు గ్యాంగ్‌స్టర్లు మృతి చెందారు. వీరికి గాయకుడు సిద్ధు మూసేవాలా హత్యతోపాటు పలు కేసులతో సంబంధముందని అధికారులు తెలిపారు. ఈ కేసు నిందితులు మన్‌దీప్ సింగ్, మన్మోహన్ సింగ్, కేశవ్, మరికొందరు ఇదే జైల్లో ఉన్నారు. రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో మన్‌దీప్, మన్మోహన్ చనిపోగా కేశవ్ తీవ్రంగా గాయపడ్డాడని అధికారులు ఆదివారం చెప్పారు.


ఇ-సంజీవనితో డిజిటల్ విప్లవం: మోదీ



న్యూఢిల్లీ: భారత్‌లో డిజిటల్ విప్లవం తన సత్తా చాటుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇ-సంజీవని యాప్ దీనికి నిదర్శనమని చెప్పారు. ఆన్‌లైన్‌లో మెడికల్ కన్సల్టేషన్ చేసే ఈ యాప్ ద్వారా 10 కోట్ల మందికి పైగా లబ్ధి పొందారని తెలిపారు. ప్రతీ నెల చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమయ్యే మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ సాధారణ ప్రజలు, మధ్యతరగతి వారు, మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారికి ఈ యాప్ ప్రాణ రక్షణగా మారిందని చెప్పారు. ఈ యాప్ ఒక్కటి చూసి భారత్ డిజిటల్ పవర్ ఏంటో చెప్పవచ్చునని అన్నారు. ఒక డాక్టర్, ఒక రోగితో మాట్లాడిన ఆయన, ఇ-సంజీవని యాప్ ఎంత ఉపయోగకరమో వివరించారు. ''ఇది మనం సాధించిన అతి పెద్ద ఘనత. భారత దేశ ప్రజలు టెక్నాలజీని మన జీవితంలో ఎలా భాగం చేసుకున్నారో చెప్పడానికి ఇది సజీవ సాక్ష్యం. కరోనా సమయంలో ఈ యాప్ ప్రజలందరికీ ఒక వరంలా మారడం మనం కళ్లారా చూశాము'' అని ప్రధాని చెప్పారు. ఇక నగదు చెల్లింపుల్లోనూ యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సరికొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. సింగపూర్‌కు చెందిన పేనౌకి కూడా యాక్సెస్ లభించడంతో రెండు దేశాల ప్రజల మధ్య కూడా డిజిటల్ చెల్లింపులు మరింత సులభతరంగా మారాయన్నారు. యూపీలో కొత్తగా నియమితులైన పోలీసులనుద్దేశించి మోదీ మాట్లాడారు. లక్నోలో ఉద్యోగ మేళాలో 9 వేల మందికి ఆయన నియామక పత్రాలిచ్చారు.

నేడు కర్ణాటకకు ప్రధాని

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం పర్యటించనున్నారు. రూ.450 కోట్లతో నిర్మించిన శివమొగ్గ విమానాశ్రయాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఏడాది కర్ణాటకలో ప్రధాని పర్యటించడం ఇది ఐదోసారి!



బుల్లి రోబో టీచరమ్మ

చిన్నారుల మధ్య కనిపిస్తున్న ఈ బొమ్మ నిజానికి ఒక హ్యూమనాయిడ్ రోబో. పేరు శిక్షా. నాలుగో తరగతి విద్యార్థులకు సైతం పాఠాలు చెప్పగల సామర్థ్యం ఈ రోబోకు ఉంది. బెంగళూరులో ఓ పాఠశాలలో తీసింది ఫొటో.

సాక్షి
కరీంనగర్
సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023

నేడు చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



పి. శాంతికుమార్, మున్సిపల్ కమీషనర్, చొప్పదండి

తేదీ : 27.02.2023 | సమయం : ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు

సెల్ : 97019 99648

చొప్పదండి: చొప్పదండి మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యంగా కుక్కలు, కోతుల బెడద, మంచినీటి సరఫరా, పారిశుధ్యం, వీధిదీపాల సమస్య పరిష్కారమార్గాలను మున్సిపల్ కమిషనర్ పి.శాంతికుమార్ దృష్టికి తీసుకువచ్చే అవకాశాన్ని 'సాక్షి' కల్పించింది. మున్సిపల్ కమిషనర్‌తో సోమవారం 'సాక్షి ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. చొప్పదండి పట్టణ ప్రజలు వారి వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చి, పరిష్కారం పొందవచ్చు.

గరిష్టం/కనిష్టం
34.0/18.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

విద్యార్థులు.. ప్రయోగాల వీరులు!

- ప్రయోగాలతో సత్తాచాటుతున్న విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉమ్మడి జిల్లావాసుల ఖ్యాతి
- భావి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు



ఎగ్జిబిట్‌తో విద్యార్థిని సహస్ర, గైడ్‌టీచర్ మహేశ్‌చంద్ర

మనిషి నిత్య విద్యార్థి. మస్తిష్కానికి పనిచెబితే గొప్ప శాస్త్రవేత్తలుగా మారే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు తమ ప్రయోగాలతో జాతీయస్థాయిలో శభాష్ అనిపించుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎంతో ఉపయోగపడే పరికరాలు తయారు చేస్తూ లోకల్ టాలెంట్‌ను ఢిల్లీస్థాయిలో ప్రదర్శిస్తున్నారు. పలు సైన్స్ ప్రదర్శనల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రశంసలు అందుకుంటున్నారు. విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయులు సైతం పుస్తకాలతో కుస్తీపట్టే పద్ధతికి స్వస్తిచెప్పి ప్రయోగాత్మక బోధనలతో ఆకట్టుకుంటున్నారు. జిల్లానుంచి జాతీయస్థాయిలో అవార్డులు, సత్కారాలు పొందుతున్నారు. రేపు జాతీయ సైన్స్‌డే సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి సత్తాచాటుతున్న బాలమేధావులు.. సైన్స్ ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..!! – కరీంనగర్‌డెస్క్

భళా.. తినే బలపం



బలపం తినే అలవాటు ఉన్న వారికి చక్కటి పరిష్కార మార్గాన్ని కనుగొన్నారు గోదావరిఖని జెడ్పీహెచ్ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న బి.హరిప్రియ, అప్సియానా సుల్తానా. బియ్యం పిండి.. బెల్లంతో బలపం తయారుచేశారు. దీనిద్వారా రాయడంతోపాటు పిల్లలు తిన్నా ఇబ్బంది ఉండదనే కోణంలో ఎన్‌సీఎస్‌సీలో భాగంగా 'ఓవర్ కమింగ్ ఆఫ్ పికా డిజార్డర్ ఈటింగ్ స్లేట్ పెన్సిల్' అనే ప్రాజెక్టును రూపొందించి ఆర్టీఎం నాగపూర్ విశ్వవిద్యాలయం వేదికగా జరిగిన 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించారు. ఇది విశేషంగా ఆకట్టుకుంది. ఇదే ప్రాజెక్టును అహ్మదాబాద్(గాంధీనగర్) సైన్స్‌సిటీ వేదికగా నిర్వహించిన 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఈ ఏడాది జనవరి 27 నుంచి 31వ తేదీ వరకు ప్రదర్శించారు.

గుడ్డు పెంకు తీసే మిషిన్

కోడిగుడ్డు పెంకు తీసేందుకు విద్యార్థులు పడుతున్న కష్టాలను చూసిన సిరిసిల్లలోని బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సమర్థకు ఓ ఆలోచన తట్టింది. గైడ్ టీచర్ భూపాల్‌రెడ్డి సలహాతో ఏకంగా మిషిన్‌ను తయారు చేసింది. ఈ మెషిన్‌పై ఉడకబెట్టిన కోడిగుడ్డు వేస్తే 5 సెకన్లలో పెంకు తీస్తుంది. ఇలా ఒకేసారి నాలుగు గుడ్ల పెంకును తీస్తుంది. ఈ ఎగ్జిబిట్ జాతీయస్థాయిలో ఎంపికైంది.



ఎగ్జిబిట్‌తో విద్యార్థిని సమర్థ



నేషనల్ కాంగ్రెస్‌లో అక్షయ

వృద్ధాప్యంలో సహాయకారిగా..

అనారోగ్యం, ఇతర సమస్యలతో మంచాలకే పరిమితమయ్యే వృద్ధుల కోసం రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని పండుగ సహస్ర గైడ్ టీచర్ మహేశ్‌చంద్ర కలిసి ఓల్డేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ బెడ్ రూపొందించారు. ఈ బెడ్ ద్వారా మంచానికే పరిమితమైన వృద్ధులకు ఒక్కరే సపర్యాలు చేయవచ్చు. వృద్ధులను బెడ్‌పై నుంచి లేపడం.. వ్యక్తిగత అవసరాలు తీర్చి, మళ్లీ పడుకోబెట్టడం చేయవచ్చు. దీని తయారీకి రూ.10వేల వరకు వెచ్చించారు.

మహిళల కష్టాలు తీర్చేలా..



ఎగ్జిబిట్‌తో విద్యార్థిని వినీల

స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తయారుచేసే కార్మికులు వంటలు వండిన తర్వాత వాటిని తరలించే క్రమంలో పడుతున్న కష్టాలను దూరం చేయాలనే ఆలోచకు ఆచరణ రూపమే ఈ ఎగ్జిబిట్. గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.వినీల, గైడ్ టీచర్ సంపత్‌కుమార్ మార్గదర్శనంలో ఈ మిషిన్‌ను తయారు చేసింది. ఈ ఎగ్జిబిట్ జేఎస్‌ఎంఎంఎస్‌ఈ సౌతిండియా స్థాయిలో మూడోస్థానంలో నిలిచింది. దీని తయారీకి రూ.5వేలు వెచ్చించారు.

సమయానికి గుర్తు చేస్తుంది



ఎగ్జిబిట్‌ను వివరిస్తున్న హర్షిత

పాఠశాలకు వచ్చే విద్యార్థులు శానిటైజర్ స్ప్రే, వాటర్ బాటిల్, సోప్ డిస్పెన్సర్ తెచ్చుకుంటారు. ఒక్కోసారి హడావుడిలో ఏదోఒకటి మర్చిపోయే అవకాశం ఉంది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని దాసరి హర్షిత యాంటీపాండమిక్ వాటర్ బాటిల్‌ను గైడ్ టీచర్ టి.సంపత్‌కుమార్ సాయంతో తయారు చేసింది. ఈ వాటర్ బాటిల్‌లో మూడు భాగాలు ఉంటాయి. పైభాగాన శానిటైజర్ మధ్యలో నీరు కిందిభాగాన సోప్ డిస్పెన్సర్ అమర్చారు. పిల్లలు నీళ్లుతాగే సమయాన్ని గుర్తుచేసేలా టైమర్ కూడా అమర్చారు.

వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేలా..

ముస్తాబాద్ చుట్టుపక్కల ఎక్కువగా రైస్‌మిల్లులు, ఇతర ఫ్యాక్టరీలు ఉండడంతో ఆ ప్రాంతంలో గాలిలో కార్బన్‌డయాక్సైడ్ ఎక్కువ శాతంలో ఉంటుంది. ఆ ప్రాంత ప్రజలకు వస్తున్న శ్వాసకోశ, ఇతరత్రా అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపేందుకు చేసిన పరిశోధనకు రూపం ఎయిర్‌ఫిల్టర్. ముస్తాబాద్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దీటి అక్షయ, గైడ్ టీచర్ రాజ్‌మహ్మద్ సలహాలు, సూచనలతో ఈ ఎయిర్ ఫిల్టర్‌ను తయారు చేశారు. ఈ మిషిన్ ద్వారా ఎక్కువ పీడనం, తక్కువ ఉష్ణోగ్రతలో కార్బన్‌డయాక్సైడ్‌ను ద్రవస్థితిలోకి చేర్చవచ్చు. పీడనాన్ని మరింత పెంచడం ద్వారా కార్బన్‌డయాక్సైడ్‌ను ఘన స్థితిలోకి మార్చవచ్చు. దీన్ని విద్యార్థిని అక్షయ, గైడ్‌టీచర్ రాజ్‌మహ్మద్ ఇటీవల గుజరాత్‌లో జరిగిన నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో పేపర్ ప్రజెంటేషన్ చేశారు. అక్కడికి వచ్చిన శాస్త్రవేత్తలు, పరిశోధకుల అభినందనలు అందుకున్నారు.

నేషనల్‌కు మూడు ప్రాజెక్టులు



రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి ఇన్‌స్పైర్ మానక్‌లో మూడు ప్రాజెక్టులు నేషనల్‌స్థాయికి ఎంపికయ్యాయి. ఇందులో ఒక ప్రాజెక్టు సౌతిండియా స్థాయిలో మూడోస్థానంలో నిలిచింది. నేషనల్ చిల్డ్రన్ కాంగ్రెస్‌లో ఒక ఎగ్జిబిట్ నేషనల్ లెవల్‌లో పాల్గొని అప్రిషియేషన్ సర్టిఫికెట్ పొందింది. ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఎల్లవేళలా ప్రోత్సాహం అందిస్తాం. జిల్లా నుంచి మరిన్నీ ఆవిష్కరణలు వచ్చేలా కృషి చేస్తాం.
– పాముల దేవయ్య, జిల్లా సైన్స్ అధికారి

మేధావుల మాస్టారు



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఘన్ముక్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఏ.వేణుగోపాల్‌రెడ్డి బాల మేధావులను తయారుచేయడంలో ముందుంటాడు. పిల్లలకు ప్రయోగాత్మక బోధనలు చేస్తుంటారు. 2016, 2018లో జరిగిన నేషనల్ టీచర్స్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. 2017లో ఇండియా ఇంటర్‌నేషన్ సైన్స్ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. రీజనల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ భోపాల్, మైసూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్నారు. 2017లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. జాతీయ సైన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నీడ్ ఆఫ్ సైన్స్ టు బీ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఇన్ టు ఏ వే ఆఫ్ లైఫ్' (జీవన అవసరాల కోసం శాస్త్ర విజ్ఞానం) అంశంపై ఎస్‌సీఈఆర్‌టీ వారు ఈనెల 28న నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు.

సృజనాత్మకత వెలికితీసేలా..



విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచన శక్తిని వెలికితీయడంలో వెన్నంటి ప్రోత్సహిస్తున్నారు శంకరపట్నం మండలం కొత్తగట్టు జెడ్పీ స్కూల్ అసిస్టెంట్ కట్ట వేణుగోపాలాచారి. కరీంనగర్‌కు చెందిన ఈయన ఎమ్మెస్సీ (ఫిజిక్స్), బీఈడీ చేసి 1996లో ఎస్జీటీగా సుల్తానాబాద్ మండలంలో విధుల్లో చేరారు. 2015 నుంచి కొత్తగట్టులో చేస్తున్నారు. 2015లో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో అవార్డు సాధించారు. 2022 నవంబర్‌లో అసోం రాష్ట్రం గౌహతిలో ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థిని సీహెచ్.నిఖిలతోపాటు పాల్గొన్నారు. జాతీయ సైన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'నీడ్ ఆఫ్ సైన్స్ టు బీ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఇన్ టు ఏ వే ఆఫ్ లైఫ్' అంశంపై ఎస్‌సీఈఆర్‌టీ వారు ఈనెల 28న నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు.

ఉత్తమ ప్రదర్శనలు.. అవార్డులు



ఆటపాటలతోపాటు జనరల్ నాలెడ్జ్, సైన్స్ ప్రయోగాలు, వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయడంలో ఉపాధ్యాయుడు బాసబత్తిని ఓదెలుకుమార్ ప్రత్యేకత. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన ఓదెలుకుమార్ ఎమ్మెస్సీ (భౌతిక రసాయన శాస్త్రం) బీఈడీ చేశారు. సైన్స్ పాఠాలను ప్రయోగపద్ధతిలో బోధిస్తుంటారు. ఏటా ఫిబ్రవరి 28న 'లో కాస్ట్– నో కాస్ట్' పరికరాలతో సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌గా శిక్షణ పొంది 2009 నుంచి ప్రతి వేసవిలో జిల్లాలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 2011లో ఎస్‌సీఈఆర్టీ ద్వారా కంప్యూటర్ శిక్షణ పొంది మన టీవీ చానెల్ ద్వారా 7వ తరగతికి సంబంధించి 'కాంతి పరావర్తనం' పాఠ్యాంశాన్ని బోధించారు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం మానకొండూర్ మండలం పచ్చునూర్ జెడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 28న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు.

న్యూస్‌రీల్

కవులు సమాజ మార్గదర్శకులు



సన్మానం అందుకున్న కవులు

కరీంనగర్ కల్చరల్: కవులు సమాజ మార్గదర్శకులని జిల్లా అదనపు పాలనాధికారి జీవీ.శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ఆదివారం ఫిలింభవన్‌లో భవానిసాహిత్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీవీ.శ్యాం ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ.. సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకమన్నారు. చౌడూరు నరసింహారావు 'ఆణిముత్యాలు', డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ స్వీయ సంపాదకత్వంలో 'విశ్వంభరుడు' మంచి కట్ల భాస్కర్ 'కిక్' పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రముఖకవి దాస్యం సేనాధిపతి, వెంకటస్వామి నాయుడు, కవులు బి.కిషన్, పొట్లపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష



పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపుకలెక్టర్

కరీంనగర్: టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 15,095 మంది అభ్యర్థుల కోసం నాలుగు ప్రభుత్వ, 28 ప్రైవేట్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలోని ఏర్పాట్లను అదనపు కలెక్టర్ జీవీ. శ్యాంప్రసాద్ లాల్ తనిఖీ చేశారు. ఉదయం జరిగిన పరీక్షకు 15,095 మందికి గాను 10,106 మంది హాజరు కాగా 4,989మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1,5095 మందికిగాను 9,990మంది హాజరు కాగా 5,105 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 66.95శాతం, మధ్యాహ్నం 66.18 శాతం నమోదైంది.

పుస్తక మహోత్సవం విజయవంతం చేయండి

కరీంనగర్: జిల్లాకేంద్రంలో మార్చి 2వ తేదీ నుంచి 8వరకు నిర్వహించనున్న కరీంనగర్ పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కరీంనగర్ పుస్తక మహోత్సవం కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులకు దిశానిర్దేశం చేశారు. మార్చి 2 నుంచి 8వరకు మహిళా వికాస, సాహిత్య సమాలోచనపై జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే(సర్కస్ గ్రౌండ్)పార్కులో కార్యక్రమం ఉంటుందని అన్నారు. 8వ తరగతి నుంచి ఆపై తరగతుల పిల్లలతో పుస్తకపఠనం, చిత్రలేఖనం, లింగసమానత్వం అనే అంశంపై వ్యాసరచన మొదలగు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్, డీఈవో జనార్దన్ రావు, డీడబ్ల్యూవో సబితాకుమారి, కలెక్టరేట్ ఏఓ కె.నారాయణ, ఏ.దేవేందర్ పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

కరీంనగర్: రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం రాంనగర్‌లో జరిగిన తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) జిల్లా మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 317 ఎకరాల్లో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భూమిని కేంద్రానికి అప్పగించి మూడేళ్లు కావస్తున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం గిరిజన సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం



కరీంనగర్: ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. పాలకవర్గ సభ్యులందరితో పెండ్యాల కేశవరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాజన్న జిల్లా జెడ్పీచైర్మన్ న్యాలకొండ అరుణ, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వుచ్చిడి మోహన్‌రెడ్డి, గుజ్జుల రామక్రిష్టారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ అల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రెడ్డి బాంధవులు పాల్గొన్నారు.

జల ఇంద్రధనుస్సు

- నిప్పులు చిమ్ముతూ రంగులు వెదజల్లే ఫౌంటేన్
- కనువిందు చేసే లేజర్ క్రాంతి పుంజాలు, వినసొంపైన సంగీతం
- 30మీటర్ల డయా ఫ్రేమ్ దాని మధ్యలో వాటర్ స్క్రీన్
- 26 నిమిషాల పాటు మైమరింపజేసేలా జలదృశ్యం




రంగులు చిమ్ముతున్న ఫౌంటేన్ (నమూనా)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మానేరు రివర్ ఫ్రంట్‌లో భాగంగా ఏర్పాటు చేయనున్న ఫౌంటేన్ అద్భుత జలదృశ్యంగా నిలవనుంది. నీటిని చిమ్ముతూ నిప్పులు కక్కుతూ వందమీటర్లకు పైగా ఎగిసిపడే నీటితో రంగుల లేజర్ క్రాంతి పుంజాలతో నగరవాసులకు కనువిందు చేయనుంది. దాదాపు రూ.69కోట్లకు పైగా బడ్జెట్‌తో ఏర్పాటు చేయనున్న ఈ ఫౌంటేన్ ప్రపంచంలోనే మూడో అతిపెద్దది. నీటిని చిమ్ముతూ అద్భుత నేపథ్యసంగీతంతో లేజర్ కాంతుల జిలుగుల మధ్య భారీ వాటర్‌స్క్రీన్‌పై లఘు చిత్రాల ప్రదర్శించేలా దీనికి సాంకేతిక సొబగులు అద్దనున్నారు. ప్రపంచంలోనే అత్యాధునిక ఇంజినీరింగ్ టెక్నాలజీతో కరీంనగర్‌లో ఏర్పాటు చేయనున్న ఈ మ్యూజికల్ ఫౌంటేన్ సాంకేతికంగా అనేక విశేషాలను కలిగి ఉంది.

- రొబొటిక్ జెట్లతో కూడిన 30మీటర్ల డయా ఫ్రేమ్ దాని మధ్యలో వాటర్ స్క్రీన్ ఉంటుంది. ఈ ఫ్రేమ్ 24రొబొటిక్ జెట్లను కలిగి ఉంటుంది. ఈ జెట్లు నీటిని వివిధ ఆకృతుల్లో నర్తింపజేస్తూ విభిన్న రంగుల్లో నీటిని పది మీటర్ల ఎత్తువరకు వెదజల్లుతాయి. ఈ జెట్లు నిప్పు/నీటిని వివిధ దిక్కులకు ఎగజిమ్ముతాయి. ఇందులో వివిధ దిక్కుల్లో కదిలే 48 భారీ హెడ్‌లైట్స్ ఉంటాయి. ఈ డయా ఫ్రేమ్ మధ్యలో 30 మీటర్ల వృత్తాకార వాటర్ స్క్రీన్ ఉంటుంది. 40వేలు ల్యూమెన్స్ సామర్థ్యం కలిగిన ప్రాజెక్టర్‌ను వాటర్ స్క్రీన్ కోసం వినియోగిస్తారు.
- 10 మీటర్లు, 30 మీటర్ల కొలతల్లో ఉండే వాల్ ప్రాజెక్టర్ మ్యాప్ అత్యంత కీలకమైంది. దీనిపై అంచున ల్యామినార్ జెట్లు అమర్చబడి ఉంటాయి. ఇది లఘు చిత్రాల ప్రదర్శనకు వీలుగా ఉంటుంది. ఇందు కోసం 22వేల ల్యూమెన్ల సామర్థ్యం కలిగిన రెండు ప్రాజెక్టర్లను వాడుతారు.
- 100 మీటర్లు, 30 మీటర్ల కొలతలతో తేలియాడే మ్యూజికల్ ఫౌంటేన్(బాల్ ఆన్ వాటర్)చాలా ప్రత్యేకమైనది. నదిమధ్యలో 30 మీటర్ల గోడకు ముందు వైపున ఉంటుంది. టూడీ సాంకేతికతతో నడిచే 54 రొబొటిక్ జెట్లు దీనిలో అమరుస్తారు. అందులో 16 పొడవైన టాల్ జెట్లు మధ్యలో మూడు నిప్పులు కక్కే ఫ్రేమ్ జెట్లు ఉంటాయి. ఈ బాల్ ఆన్ వాటర్ షో పది నుంచి పన్నెండు నిమిషాలు నిడివి ఉంటుంది. 'అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేయనున్న ఈ ఫౌంటేన్ షోను ఆగస్టు 15న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభింపజేసే సంకల్పంతో ఉన్నాం'అని మంత్రి కమలాకర్ వివరించారు.

వరల్డ్ టూరిజం స్పాట్‌గా కరీంనగర్

- మంత్రి గంగుల కమలాకర్



భూమిపూజ చేసిన మంత్రి కమలాకర్

కరీంనగర్/కరీంనగర్‌సిటీ/కరీంనగర్‌రూరల్: అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న మానేరు రివర్ ఫ్రంట్‌తో కరీంనగర్ వరల్డ్ టూరిజం స్పాట్‌గా మారుతుందని రాష్ట్ర బీసీసంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఆదివారం మానేరు రివర్‌ఫ్రంట్‌లో రూ.69కోట్లతో నిర్మించే బిగ్ ఓ ఐలాండ్ వాటర్ ఫౌంటేన్ పనులకు భూమిపూజ చేశారు. కరీంనగర్‌కు నూతన ఒరవడిని సృష్టించేలా సియోల్, చైనాలో నడుస్తున్న బిగ్ ఓ ఐలాండ్ వాటర్ ఫౌంటేన్‌ను కరీంనగర్ మానేరు రివర్‌ఫ్రంట్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఫౌంటేన్‌ను ఆరుమాసాల్లో పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని అన్నారు. అనంతరం మార్వాడీల వైకుంఠధామం పనులను రూ.25 లక్షల సీఎం అస్యూరెన్స్ నిధులతో ప్రారంభించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మేయర్ వై.సునీల్‌రావు, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, తదితరులున్నారు.

అంబేద్కర్‌బాటలో నడవాలి
బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతీఒక్కరు నడవాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ మండలం చేగుర్తిలో అంబేద్కర్ విగ్రహాన్ని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఆవిష్కరించారు. చేగుర్తి–మొగ్దుంపూర్ రోడ్డుకు త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ అరుణ, ఉపసర్పంచ్ విజయ, ఎంపీటీసీ స్వరూప, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టు దొంగలు దొరికారు..!

- బీదర్ వెళ్లి పట్టుకొచ్చిన పోలీసులు
- ముందే వెల్లడించిన 'సాక్షి'
- అంజన్న ఆభరణాల గుర్తింపునకు యత్నాలు
- త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం



చేతులకు గ్లౌసులు వేసుకోని నిందితులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్/జగిత్యాలక్రైం/కొండగట్టు: కొండగట్టులోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున జరిగిన చోరీ కేసును పోలీసులు చేధించారు. ఆలయంలోని సీసీ పుటేజీలు పరిశీలించి, వేలిముద్రలు సేకరించి పాతనేరస్తుల పనిగా నిర్ధారణకు వచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా నారాయణఖేడ్ సమీపంలోని ఓ తండాకు చెందిన 8 మంది చాలాకాలంగా చోరీలు చేస్తూ.. తప్పించుకునేందుకు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ప్రాంతంలో మకాం వేశారు. వివిధ ప్రాంతాల్లో అపహరించిన ఆభరణాలను కర్ణాటకలో విక్రయిస్తారు.

పథకం ప్రకారమే దొంగతనం..
కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో దొంగతనం చేసేందుకు ముందే పథకం రూపొందించుకున్నారు. అనుకున్నట్లుగానే ఈనెల 24న కొండగట్టు చేరుకున్నారు. దిగువ ప్రాంతంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేశారు. గుట్టపైకి చేరి భేతాళస్వామి ఆలయం వెనకాల మద్యం సేవించారు. శుక్రవారం వేకువజామున 1.20 గంటల తర్వాత భద్రతా సిబ్బంది ఆలయం ఎదుట ఉండడాన్ని అదనుగా భావించిన దొంగలు.. భక్తుల వేషధారణలో ఆలయం వెనుక నుంచి లోనికి ప్రవేశించి చోరీ చేశారు. ఆభరణాలతో వచ్చిన దారినుంచే పారిపోయారు. సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఉంటాయో రెక్కీలో గుర్తించిన దొంగలు.. వాటికి చిక్కకుండా ఉండేందుకు చోరీ అనంతరం ఆలయం వెనుకవైపు ఉన్న గుట్టపై నుంచి కిందికి దిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. జగిత్యాల మెయిన్ రోడ్డుకు చేరుకుని ద్విచక్రవాహనాలపై కోరుట్ల, మెట్‌పల్లి మీదుగా.. కామారెడ్డి, నారాయణఖేడ్ నుంచి బీదర్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అదే సమయంలో దొంగలు నారాయణఖేడ్, కామారెడ్డి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ మీదుగా కొండగట్టు చేరినట్లు అనుమానిస్తున్నారు. వచ్చిన దారిన వెళ్తే పట్టుబడుతామనే ఆలోచనతో దొంగలు ఇలా.. వలయాకారాన్ని ఎంచుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

స్థానిక నేరస్తుడితో పరిచయం
స్థానికంగా ఉండే ఓ పాత నేరస్తుడిని పరిచయం చేసుకున్న 8 మంది దొంగలు.. ద్విచక్రవాహనాలపై కొండగట్టుకు చేరుకున్నారని పోలీసులు భావిస్తున్నారు. వీరిలో ఐదుగురు వివిధ ప్రాంతాల్లో కాపలా ఉండగా.. ముగ్గురు ఆలయంలో చోరి చేశారని, ఆ తర్వాత అందరూ కలిసి అవే వాహనాలపై బీదర్ పారిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఫింగర్ ప్రింట్స్, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా మరుసటి రోజే దొంగలను గుర్తించారని, మూడు ప్రత్యేక బృందాలు బీదర్ వెళ్లి దొంగలను పట్టుకున్నాయని సమాచారం. ఆభరణాలు స్వాధీనం చేసుకునే యత్నంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ప్రక్రియ పూర్తయ్యాకే దొంగల వివరాలు వెల్లడిస్తారని తెలిసింది.

క్లుప్తంగా

నేత్రదానంతో ఇద్దరు అంధుల్లో వెలుగులు



నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం అందజేస్తున్న సదాశయ ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని మార్కండేయకాలనీలో అనారోగ్యంతో మృతిచెందిన వృద్ధురాలు పడాల లక్ష్మి(70) ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించి ఆమె చూపు సజీవంగా ఉందని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు కొనియాడారు. ఆదివారం నేత్రదాత ఇంటి వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ నెల 18న అనారోగ్యంతో మృతిచెందిన లక్ష్మి నేత్రాలను కుటుంబ సభ్యులు ఐ బ్యాంక్‌కు దానం చేయడం అందరికీ స్ఫూర్తి దాయకమని ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ లింగమూర్తి, ఉపాధ్యక్షుడు రాజమౌళి, ప్రతినిధి కేఎస్.వాసు, బీజేపీ నాయకుడు సోమారపు అరుణ్‌కుమార్ కొనియాడారు. ఈ సందర్భంగా నేత్రదాత కుమారుడు సాంబయ్య, కోడలు స్వరూపరాణికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన పత్రాన్ని అందజేశారు. నేత్ర, అవయవ, శరీర దానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బంధువులు సుగుణమ్మ, సాయిపవన్, శివాణి, బుచ్చయ్య, రవీందర్, సత్యనారాయణ, శారద, లక్ష్మి, సుమిత్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో నగదు, సామగ్రి దగ్ధం



కాలిపోయిన సామగ్రి

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని గణేశ్‌నగర్‌లో ఓ ఇంట్లో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం చోటుచేసుకొని నగదు, సామగ్రి దగ్ధమైనాయి. బాధితులు తెలిపిన వివరాలు.. గణేశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న వెంగల శ్రీధర్ అనే ఉపాధ్యాయుడి ఇంట్లో శనివారం రాత్రి గ్యాస్ లీకైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు పరిగెత్తారు. ఈక్రమంలో మంటలు చెలరేగి ఇంట్లోని విలువైన వస్తువులు, రూ.లక్ష వరకు నగదు కాలిపోయాయి. ఫైర్‌స్టేషన్ అధికారులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఘటన సమయంలో ఇంట్లోని కుటుంబ సభ్యులు బయటకు పరిగెత్తడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితులు బోరున విలపించారు.

ఆత్మరక్షణ క్రీడను పాఠ్యాంశంగా చేర్చాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కరీంనగర్ అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



పోటీలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

కరీంనగర్‌స్పోర్ట్స్: గోజురాయ్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ పాఠశాలలో ఆత్మరక్షణ క్రీడను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 100 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా విద్యాలయాల్లో సెల్ఫ్ డిఫెన్స్, కరాటే వంటి శిక్షణ ప్రారంభించిందన్నారు. రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో చిన్నారులు ఇంత పెద్దమొత్తంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులే ముఖ్య అతిథులు అని అభివర్ణించారు. పిల్లలు చదువుతో పాటుగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లో రాణించాలన్నారు. కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం రెట్టింపవుతుందన్నారు.

డిసెంబర్‌లో అంతర్జాతీయ కరాటే పోటీలు

గోజురాయ్ ఇండియా చీఫ్ ఎల్.నాగేశ్వరరావు మాట్లాడుతూ, కరీంనగర్‌లో క్రీడాపోటీల నిర్వహణకు అనువైన వసతులు ఉన్నాయని, ఇక్కడ డిసెంబర్‌లో అంతర్జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గోజురాయ్ కరాటే డో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, పోటీల నిర్వాహకుడు సురభి వేణుగోపాల్ మాట్లాడుతూ, కటాస్, టీం కటా, వెపన్ కటా, కుమిటీ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి కీర్తి రాజవీరు, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, గోజు రాయ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురభి అన్వేష్, విద్యాసాగర్, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.కాగా రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో భాగంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు విద్యార్థుల నాన్‌చాక్, కుమిటీ విన్యాసాలు అలరించాయి.

భారత్ బచావో విజయవంతం చేయండి

- హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): వచ్చే నెల 11, 12వ తేదీల్లో నిర్వహించే భారత్ బచావో జాతీయ సదస్సును విజయవంతం చేయాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ కోరారు. ఆదివారం స్థానిక యూనియన్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరపత్రాలు విడుదల చేశారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితో పాలన సాగాలన్నారు. రాష్ట్రాల వారీగా మేధోమథనం చేసి ప్రత్యేక పాలసీలు రూపొందించాలన్నారు. ఉగ్రవాదం సమాజానికి ప్రమాదకరమని, దీన్ని కూకటి వేళ్లతో పెకిలించి వేయాలన్నారు. మనువాద, మతోన్మాద, రాజకీయ ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విశాల షాపింగ్‌మాల్‌లో అనసూయ సందడి





షాపింగ్‌మాల్‌లోని పట్టుచీరల విభాగాన్ని ప్రారంభిస్తున్న సినీనటి అనసూయ

సిరిసిల్లఅర్బన్: సినీనటి, ప్రముఖ టీవీ వ్యాఖ్యాత అనసూయ ఆదివారం సిరిసిల్లలో సందడి చేసింది. జిల్లా కేంద్రంలోని ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ విశాల షాపింగ్ మాల్‌లో నూతన పట్టుచీరలు, సంప్రదాయ దుస్తుల విభాగం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైంది. నూతన విభాగాన్ని ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేసింది. అనంతరం మాల్‌లో తిరుగుతూ పట్టుచీరలను పరిశీలించి మాట్లాడారు. విశాల షాపింగ్‌మాల్‌లో సరికొత్త వెరైటీలతో పట్టు చీరలు, ఇతర సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనసూయ వస్తుందని తెలిసిన అభిమానులు, పట్టణ ప్రజలు షాపింగ్‌మాల్‌కు భారీగా తరలివచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు గుండ్లపల్లి నీరజ, దార్నం అరుణ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, విశాల షాపింగ్ యజమానులు వేముల శ్రీనివాస్, విష్ణు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలపై సంఘటితంగా పోరాడాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

మానకొండూర్: తపాలా ఉద్యోగుల సమస్యలపై సంఘటితంగా పోరాడాలని ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ పోస్ట్‌మెన్ అండ్ ఎంటీఎస్ తెలంగాణ సర్కిల్ కార్యదర్శి ఎం.మధుసూదన్ రావు అన్నారు. రెండురోజుల పాటు జరిగిన ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, పోస్టుమెన్ అండ్ ఎంటీఎస్ (ఏఐపీఈయూ–పీ4) తెలంగాణ సర్కిల్ మూడవ ద్వైవార్షిక సమావేశాలు ఆదివారం మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలో ఓ ఫామ్‌హౌస్‌లో ముగిశాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ఉద్యోగుల సమస్యల సాధన కోసం చేయాల్సిన ఉద్యమాలు, అనుసరించాల్సిన విధానాలపై పలు తీర్మానాలు చేసి ఆమోదింపజేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

సర్కిల్ ప్రెసిడెంట్‌గా సీహెచ్.కుమార్ (హైదరాబాద్), వైస్ ప్రెసిడెంట్లుగా విజయరామరాజు (హుజురాబాద్), ఇక్బాల్ (నిజామాబాద్), వెంకట్ రెడ్డి (హైదరాబాద్ సిటీ), సర్కిల్ సెక్రెటరీ ఎం.మధుసూదన్‌రావు (హైదరాబాద్ సిటీ), సర్కిల్ డిప్యూటీ సెక్రెటరీ మహమూద్ (సికింద్రాబాద్), సర్కిల్ అసిస్టెంట్ సెక్రెటరీలు ఎస్వీరావు (ఖమ్మం), ఇ.ఉదయ్‌కుమార్ (కరీంనగర్), ఎండీ తాజొద్దీన్(మంచిర్యాల), ఎం.వెంకట్‌రెడ్డి (మహబూబ్‌నగర్), ట్రెజరర్ ఎ.రమేశ్ (సికింద్రాబాద్), అసిస్టెంట్ ట్రెజరర్ ఎండీ జియాయొద్దీన్ (ఖైరతాబాద్), ఆర్గనైజింగ్ సెక్రెటరీలు యాదయ్య (నల్గొండ), నర్సింహారెడ్డి (హైదరాబాద్), ఒబేదుల్లాను (హైదారాబాద్) ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.మహంతి, పి.సురేష్, ముక్తార్‌అహ్మద్, మహేందర్, శ్రావణ్‌కుమార్, జీఆర్.రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కేఎస్ చారి, అనిల్‌కుమార్, మల్లేశం, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ప్రతినిధులు అనిల్‌కుమార్, ఉదయ్ మాట్లాడుతూ, తొలిసారిగా కరీంనగర్‌లో నిర్వహించిన సర్కిల్ సమావేశాలకు జాతీయ, రాష్ట్ర నాయకులు, అన్ని జిల్లాల నుంచి యూనియన్ ప్రతినిధులు హాజరై విజయవంతం చేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

శుభకార్యంలో అగ్నిప్రమాదం

- గ్యాస్ సిలిండర్ లీకై చెలరేగిన మంటలు
- కాలిపోయిన టెంట్, వేదిక



కాలిపోయిన వేదిక

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం బందనకల్‌లో గ్యాస్ సిలిండర్ లీకేజీతో అగ్నిప్రమాదం జరిగింది. బాధితుడు పాతూరి లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు. లక్ష్మారెడ్డి ఇంట్లో ఆదివారం ఓ శుభకార్యం నిర్వహిస్తున్నాడు. ఇంటి బంగ్లాపై టెంట్ వేసి.. అక్కడే వేదికను ఏర్పాటు చేశారు. మరో వైపు వంటలు చేయిస్తున్నారు. ఈక్రమంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు ఎగిసిపడి టెంట్‌కు అంటుకున్నాయి. పక్కనే ఉన్న వేదిక, ఫర్నీచర్, కుర్చీలు, కెమెరాలు, సౌండ్‌సిస్టమ్, వంటకాలు కాలిబూడిదయ్యాయి. ఫంక్షన్ ఉత్సాహంగా సాగుతుండగా జరిగిన ప్రమాదంతో అందరు షాక్‌కు గురయ్యారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. చుట్టుపక్కల వారు గమనించి పైపుల ద్వారా నీటిని చల్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.2లక్షలకు పైగా నష్టం జరిగిందని ఈవెంట్ నిర్వాహకులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

బాలికపై లైంగికదాడి

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో వేములవాడ రోడ్ ఏరియాలో 15 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాలు.. నాలుగు రోజుల క్రితం సదరు బాలికకు వరుసకు బావ అయ్యే యువకుడు మాయమాటలతో ప్రలోభపెట్టి కోరుట్ల పట్టణంలో వేములవాడ రోడ్ పరిసరాలకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అత్యాచారానికి పాల్పడిన యువకుడు అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ పేర్కొన్నారు. బాలికను జగిత్యాల సఖి కేంద్రానికి తరలించి విచారణ జరుపుతున్నట్లు వివరించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

- ఓసీపీ–1లో క్యాంపర్‌పైకి ఎక్కిన డంపర్



క్యాంపర్‌పైకి ఎక్కిన డంపర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధి ఓసీపీ–1లో ఆదివారం క్యాంపర్(జీప్)ను డంపర్ ఢీకొంది. కన్వేయన్స్ వాహనంగా తీసుకెళ్లిన క్యాంపర్‌ను నిలిపి అందులో ఉన్న ట్రిప్‌మెన్ డంపర్ ఆపరేటర్‌తో మాట్లాడేందుకు డంపర్‌పైకి ఎక్కాడు. అనంతరం దిగి క్యాంపర్ వైపు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా డంపర్ ఆపరేటర్ కుడివైపు తిప్పే ప్రయత్నం చేయడంతో ఈప్రమాదం జరిగింది. ఈక్రమంలో డంపర్ ముందు టైర్ క్యాంపర్ పైకి ఎక్కడంతో పెద్ద మొత్తంలో వాహనం డ్యామేజీ అయ్యింది. అందులో ఉన్న ట్రిప్‌మెన్, క్యాంపర్ డ్రైవర్ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. కాగా ఈ ఘటనను అధికారులు సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టారు.

అంతర్జాతీయ పోటీల్లో సత్తాచాటాలి



క్రీడాకారులను సన్మానిస్తున్న దామోదర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): అంతర్జాతీయ సెపక్‌టాక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆదివారం యైటింక్లయిన్ కాలనీ ప్రెస్ భవన్‌లో సెపక్‌టాక్రా సౌత్‌జోన్ చైర్మన్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల దామోదర్‌రావు సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది అక్టోబర్‌లో బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి సెపక్‌టాక్రా పోటీల్లో తెలంగాణ నుంచి జగిత్యాల జిల్లాకు చెందిన భీమేశ్ (పురుషుల విభాగంలో), రక్షిత(మహిళల విభాగంలో) పాల్గొని ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ సెపక్‌టాక్రా పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు మార్చి 3 నుంచి 5 వరకు మహారాష్ట్రలో నిర్వహించనున్న అంతర్జాతీయ సెపక్‌టాక్రా పోటీల్లో (భారత్–ఇంగ్లాండ్ మధ్య జరిగే పోటీల్లో) మన దేశ జట్టు తరుపున ఆడనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో సత్తా చాటి మన జట్టు విజ యానికి తోడ్పడాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో సెపక్‌టాక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓదెలు యాదవ్, సీనియర్ పీఈటీ సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసర గ్రామాల అభివృద్ధే సింగరేణి ధ్యేయం

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోదావరిఖని(రామగుండం): పరిసర గ్రామాల అభివృద్ధే సింగరేణి సంస్థ ధ్యేయమని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం న్యూమారేడుపాక గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి ప్రభావిత, నిర్వాసిత గ్రామాల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నామన్నారు. దీనిలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలే కాకుండా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, సోలార్ దీపాలు, నీటి శుద్ధి ప్లాంట్లు, ఇంకుడు గుంతలు, బోర్ వేల్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నిరుద్యోగ యువతకు ఉచిత మోటార్ డ్రైవింగ్, పోలీస్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, మహిళలలకు ఉచిత వృత్తి విద్యలలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈసందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరంలో జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్, ఎముకల వైద్యులు, స్త్రీల వైద్యనిపుణులు, ఛాతి వైద్యులు, చెవి, ముక్కు, గొంతు, చర్మ, డెంటల్, కంటి వైద్యులు పాల్గొని పరీక్షలు చేశారు. ల్యాబ్‌కు సంబంధించి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లిన కారు

- విరిగిన చెట్టు తట్టుకొని తప్పిన పెనుప్రమాదం
- సురక్షితంగా బయటపడిన యువకులు
- మద్యం మత్తులోనే ప్రమాదం?



బావిలో పడిన కారు

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని గునుకులకొండాపూర్, చొక్కాలపల్లి గ్రామాల మధ్య కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఎస్సై సురేందర్, స్థానికుల కథనం మేరకు.. జనగామ జిల్లా బచ్చన్నపల్లి గ్రామానికి చెందిన రాజు, సురేశ్, బాలకిషన్ ఆదివారం కారులో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం బేగంపేట గ్రామ శివారు మడుపువానిపల్లెలో శుభకార్యానికి వచ్చారు. ఇటీవలే ఆ గ్రామంలో ఓ యువకుడి వివాహం జరిగింది. ఇందులో భాగంగా ఆదివారం కుటుంబసభ్యులు పోచమ్మ బోనాలు చేయగా, ముగ్గురు యువకులు హాజరయ్యారు. ఈక్రమంలో గన్నేరువరం మండలం గుండ్లపల్లికి వచ్చి, తిరిగి మడుపువానిపల్లెకు వెళ్తుండగా చొక్కాలపల్లె సమీపంలో కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. కాగా అప్పటికే బావిలో చెట్టు విరిగిపోయి పడి ఉండటంతో పాటు పూడిక ఉంది. కారు దూసుకెళ్లి వాటిపై ఆగిపోయింది. నీటిలో మునిగి ఉంటే పెను ప్రమాదం సంభవించేది. ఎస్సై స్థానికులతో కలిసి కారుతో పాటు అందులో ప్రయాణిస్తున్న ముగ్గురిని క్రేన్, తాళ్ల సాయంతో బయటకు తీశారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. మద్యం మత్తులోనే ప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. రహదారి వెంట బావులు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటి వద్ద రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్ చేసినా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోలేదని సీపీఐ మండల సహాయ కార్యదర్శి చొక్కల శ్రీశైలం తెలిపారు. ఇప్పటికైనా రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తు బావిలోపడి వ్యక్తి మృతి



లక్ష్మయ్య మృతదేహం

రామగుండం: అంతర్గాం మండల పరిధి లింగాపూర్ గ్రామానికి చెందిన అయిడపు లక్ష్మయ్య (60) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. లక్ష్మయ్య ఇంటి సమీపంలోనే వినియోగంలో లేని బావి వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో పాములు సంచరిస్తున్నాయనే ఉద్దేశంతో శుభ్రం చేస్తున్న క్రమంలో కాలు జారి బావిలో పడ్డాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉంది. భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి..

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన గుగ్గిల్ల అనూష (24) ఇటీవల ఆత్మహత్యకు పాల్పడగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల వివరాలు.. అనూష కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం పలు ఆసుపత్రులు తిరిగినా నయం కాలేదు. ఈక్రమంలో కడుపునొప్పి బాధ భరించలేక ఈ నెల 6న ఇంట్లో ఎవరూ లేని సమయంలో టాయిలెట్ క్లీన్ చేసే యాసిడ్ తాగింది. కుటుంబ సభ్యులు జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తండ్రి గుగ్గిల్ల సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులుతెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలు..



కనుకమ్మ మృతదేహం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన వృద్ధురాలు సాయిల్ల కనుకమ్మ(70) ఆదివారం వడదెబ్బతో మృతిచెందింది. స్థానికుల వివరాలు.. కనుకమ్మ మహిళలతో కలిసి బొమ్మకల్‌లో పత్తి ఏరేందుకు వెళ్లింది. పత్తి ఏరుతుండగా మధ్యాహ్నం 2గంటలకు ఎండకు అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతిచెందగా ట్రాక్టర్‌లో దుర్శేడ్‌కు తీసుకొచ్చారు. మృతురాలికి భర్త ఐలయ్యతోపాటు ఇద్దరు కుమారులున్నారు.

శునకాల స్వైరవిహారం

- రామగుండం పరిధిలో 10 మందిపై దాడి



వీధికుక్క దాడిలో గాయపడిన వృద్ధురాలు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఆదివారం శునకాలు స్వైర విహారం చేశాయి. 10 మందిపై దాడి చేసి గాయపరిచాయి. స్థానికుల వివరాలు.. 35వ డివిజన్‌లో రత్నమ్మ అనే వృద్ధురాలిపై వీధికుక్క దాడి చేసి గాయపరిచింది. 13వ డివిజన్‌లో మరో వృద్ధుడిని వీధి కుక్క కరిచింది. వీరిద్దరినీ స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. తిలక్‌నగర్‌లోని శ్రీధర్మశాస్త వృద్ధుల ఆశ్రమం ఆవరణలో కూడా ఇద్దరు వృద్ధులను వీధి కుక్కలు కరిచాయి. అలాగే ఆయా ప్రాంతాల్లో వీధికుక్కల దాడిలో గాయపడిన ఆరుగురు బాధితులు చికిత్స కోసం ఆస్పత్రులకు భయంతో పరుగులు తీశారు. వెంటబడి తరుముతున్న వీధికుక్కల దాడులకు జనం భయంతో వణికిపోతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులు వెంటనే వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ సంప్రదాయాలు పాటించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి కమలాకర్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): సంస్కృతి సంప్రదాయాలకు మనదేశం నిలయమని, ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను పాటించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో ఫ్యాంటసీ పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కవి వారాల ఆనంద్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డితో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాలలో విషయాలతో పాటు సమాజంలో వ్యవహరించే తీరును ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నిర్దేశించిన మార్గాలను పాటించి లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. విద్య సంవత్సరంలో అద్భుతంగా రాణించినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృపాదానంకు జీవన సాఫల్య పురస్కారం



అవార్డు అందుకుంటున్న కృపాదానం

కరీంనగర్ కల్చరల్: వల్లూరి ఫౌండేషన్ వారి జీవిత సాఫల్య పురస్కారంను కరీంనగర్‌కు చెందిన వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జి.కృపాదానం అందుకున్నారు. ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కృపాదానంను సల్వాజి ప్రవీణ్, రాజమౌళి, వారాల ఆనంద్, గంద్ర లక్ష్మణరావు, మాడిశెట్టి గోపాల్, అనంతచారిలు అభినందనలు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ

కొత్తపల్లి: తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తన నివాసంలో ఆవిష్కరించారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని అన్నారు. అనంతరం మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో మంత్రి గంగుల కమలాకర్, చల్ల హరిశంకర్‌లను ఘనంగా సత్కరించారు. లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకటరమణ, మల్లిఖార్జున్, జగన్మోహన్, సత్యనారాయణ, శ్రీనివాస్, మధుసూధన్, గంగాధర్, వెంకటేష్, రఘు, సతీష్, సుగుణాకర్ పాల్గొన్నారు.

ఏఐఎంఐఎం సదస్సులో జిల్లా నాయకులు

విద్యానగర్ (కరీంనగర్) : ముంబైలోని ముంబ్రాలో రెండు రోజులపాటు జరిగిన ఏఐఎంఐఎం జాతీయస్థాయి తొలి రాజకీయ సదస్సులో ఎంఐఎం పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. నాయకులు సయ్యద్ బర్కత్ అలీ, అబ్బాస్ సమీ, అలీబాబా, అజర్ దబీర్, కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, షర్ఫుద్దీన్‌లతో పాటు జగిత్యాల, పెద్దపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి నాయకులు యునుస్ నదీం, ఇమ్రాన్, సాబీర్, అఖిల్, అబ్దుల్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలకు ప్రాధాన్యం కల్పించాలి

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న మైనారిటీ నాయకులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాయచూర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలకు ఒక్క మైనార్టీ నాయకుడిని కూడా పిలవలేదని, రేవంత్‌రెడ్డి పాదయాత్రకు రోడ్ మ్యాప్ కూడా తెలుపకపోవడం బాధాకరమన్నారు. పీసీసీ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి పాదయాత్ర కరీంనగర్‌లో చేపట్టనున్న సందర్భంగా ముందస్తుగా కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధోశక్తి

కరీంనగర్‌స్పోర్ట్స్: పిల్లలకు చదరంగంతో మేధోశక్తి పెంపొందుతుందని బొమ్మకల్ ప్రకృతి చికిత్సాలయ ముఖ్య వైద్యాధికారిణి తంగడ మంజుల అన్నారు. ఆదివారం నియో కిడ్స్ ఫన్ ల్యాండ్ ఆవరణలో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ అనిల్ తో పాటు 25 టీములు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

విద్యానగర్(కరీంనగర్): కృతికా నక్షత్రం సందర్భంగా ఆదివారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలోని శ్రీవల్లిదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి వారలకు ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణశర్మ విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'మసీద్ ఎక్స్‌పో-23'

కరీంనగర్‌కల్చరల్: జమాతే ఇస్లామీ హిందూ కరీంనగర్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఆదివారం మసీద్ ఎక్స్‌పో-23 పేరుతో సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హిందూ పట్టణ జిల్లా అధ్యక్షుడు ఖైరొద్దీన్ మాట్లాడుతూ రోజూ 5 పూటలు నమాజ్ దైవ ఆరాధన చేస్తారన్నారు. అనంతరం మసీద్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హిందూ కరీంనగర్ సెంట్రల్ అధ్యక్షుడు మహమ్మద్ నయీమొద్దీన్, జమాతే ఇస్లామీ బాధ్యులు ఆరిష్ ఇర్ఫాన్, మొయిద్ హమీద్, అబ్దుల్ హై షోయెబ్ లతీఫ్, ఇద్రీస్, ఉమేర్, వాజిద్ పాల్గొన్నారు.

వైభవంగా మల్లిఖార్జునస్వామి కల్యాణం





కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని శ్రీకొచ్చెగుట్ట మల్లిఖార్జునస్వామి ఆలయం చతుర్థ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం భ్రమరాంబ, కేతమ సహిత మల్లిఖార్జునస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మిడిదొడ్డి కపిల్ మాధవ-శ్రీలత దంపతులు తమిళనాడులో ప్రత్యేకంగా తయారు చేయించిన ఆలయ క్షేత్రపాలకుడు శ్రీకాళభైరవ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. సాయంత్రం త్రిపురాసుర సంహారం, మల్లెచెరువులో స్వామి వారి తెప్పోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మొగిలి, సభ్యులు మల్లేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యాస.. 'బూర్ల' శ్వాస

- సమాజ చైతన్యం కోసం తనదైన శైలిలో రచనలు
- అధ్యాపకుడిగా, కవిగా రాణిస్తున్న వెంకటేశ్వర్లు



సినారె చేతుల మీదుగా రంజని కుందుర్తి పురస్కారం అందుకుంటున్న వెంకటేశ్వర్లు (ఫైల్)

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ యాసలో కవిత్వం గొప్పతనాన్ని, తెలంగాణ పల్లె దృశ్యాలను ఆవిష్కరిస్తూ.. ప్రపంచీకరణ, సమైక్య రాష్ట్రం వల్ల పరాయీకరణకు గురవుతున్న తెలంగాణ దుస్థితిని కళ్లకు కట్టాడు. ప్రస్తుతం దళిత బహుజన స్ఫూహతో మరింత పదునెక్కిన కవిత్వాన్ని రాస్తూ, అణగారిన వర్గాలపై, మహిళల పట్ల వివక్షను గుర్తించి సమాజ మార్పుకోసం తన కలానికి వాస్తవికతను అద్దుతూ, తెలంగాణ యాస సౌందర్యాన్ని కవితా వాహికగా చేసుకొని తనదైన శైలిలో కవితలు రాస్తూ అధ్యాపకుడు, కవి, సాహితీవేత్తగా సాహిత్య రంగంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు బూర్ల వెంకటేశ్వర్లు. పెద్దపల్లి జిల్లా లాలపల్లి గ్రామంలో 1973లో జన్మించారు. 1998 ఉపాధ్యాయ నియామకాల్లో జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించి ద్వితీయ శ్రేణి తెలుగు పండితునిగా గుమ్లాపూర్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగంలో చేరారు. 2004లో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి జూనియర్ లెక్చరర్‌గా మెట్‌పల్లి కళాశాలలో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం పదోన్నతి పొంది హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తూ కరీంనగర్‌లో ఉంటున్నారు.

సాహిత్య ప్రస్థానం

1997లో 'దేవత' పేరుతో మొదటి కవిత ఆంధ్ర సారస్వత పరిషత్ ఛాత్రోపాధ్యాయ పత్రిక శ్రీముఖిలో అచ్చయింది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి అస్తిత్వ కాంక్షతో, తెలంగాణ యాస సోయితో కవిత్వం రాయడం మొదలెట్టారు. ఉద్యమ సమయంలో కవిత్వాన్ని కరపత్రాలుగా అచ్చువేసి పంచారు. ఫ్లెక్సీ మీద కవిత్వం ముద్రించి తెలంగాణ చౌక్‌లో ప్రదర్శించారు. వృత్తి, ప్రవృత్తిని రెండు భుజాల మీద సమతూకం వేసుకుంటూ కదిలిపోతున్న సాహిత్య ప్రస్థానంలోనూ నిరంతరం కవిగా కొనసాగుతూ 2007లో మొదటి రచన కవిత్వ పుస్తకం 'వాకిలి', 'రంగుల విల్లు' నానీలు ప్రచురించారు. 2013లో 'పెద్ద కచ్చురం' కవిత్వ సంపుటి, 2015లో 'బాయిగిర్క మీద ఊర విష్క', 2017లో 'రెండు పక్షులూ ఒక జీవితం', 2021లో 'ప్రాణ గంధం' పుస్తకాలు, 2022లో తెలంగాణ భాష అనుశీలన వ్యాసాల పుస్తకం 'ఉపకారి' వెలువరించారు. సాహితీ సోపతి ప్రచురించిన అనేక పుస్తకాలకు సహ సంపాదకునిగా వ్యవహరించారు. మదురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో జూకంటి జగన్నాథం రచనలపై పీహెచ్‌డీ చేస్తున్నారు. ఇంటర్మీడియట్ తెలుగు పాఠ్య పుస్తక సంపాదక మండలి సభ్యుడిగా కొత్త పుస్తకాల రూపకల్పనలో పాలు పంచుకున్నారు. అనేక మంది వర్ధమాన కవుల పుస్తకాలకు విలువైన ముందు మాటలు రాశారు. ప్రస్తుతం తెరవే రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



వెంకటేశ్వర్లు రచించిన పుస్తకాలు

వరించిన పురస్కారాలు

- విద్యార్థి దశనుంచే కవిత్వం రాస్తున్న బూర్ల అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు.
- 1997లో సుప్రసిద్ధ కవి విమర్శకుడు జీవీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.
- 1998లో మహా సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ నిర్వహించిన మహా సహస్రావధానంలో పచ్ఛకునిగా పాల్గొని సన్మానం పొందారు.
- ఓ పత్రిక నిర్వహించిన కవితల పోటీల్లో రాష్ట్ర స్థాయి తృతీయ బహుమతి, సాహితీ మిత్రులు మచిలీపట్నం వారి తృతీయ బహుమతిని ప్రఖ్యాత కవి కె.శివారెడ్డి చేతుల మీదుగా స్వీకరించారు.
- 2007 'ఎక్స్ రే' అవార్డు, 2018లో 'అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారం', 2019లో 'బీఎస్ రాములు' స్ఫూర్తి పురస్కారం వరించాయి.
- 2010లో సినారె చేతుల మీదుగా 'రంజని కుందుర్తి' ఉత్తమ కవిత అవార్డు అందుకున్నారు.
- 2022లో గ్లోబల్ తెలుగు అకాడమీ సత్కారాన్ని అందుకున్నారు.

మానవీయ సమాజం కోసం



మానవత్వమే మత మని, ఎల్లలులేని ప్రేమ విశ్వశాంతి సాధనమని విశ్వసించడం నా కవిత లక్ష్యం. సకల ఆధిపత్యాలను ధిక్కరించడం. ప్రజా పక్షం వహిస్తూ మానవీయ సమాజం కోసం కవిత్వాన్ని వాహికగా చేసుకోవడం, తెలంగాణ యాస సాహిత్య అస్తిత్వాల రక్షణకు పాటుపడడమే ధ్యేయం.

– బూర్ల వెంకటేశ్వర్లు, కవి

తాగునీటి కోసం కాలనీవాసుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న కాలనీవాసులు

- రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రజ్వీచమన్, విజయ్‌నగర్‌కాలనీ, ప్రియదర్శినీకాలనీ, సిటిజన్ కాలనీ, సెల్ఫీనగర్‌కాలనీవాసులు తాగునీటి కోసం ఆదివారం ఆందోళన చేపట్టారు. గతేడాది నుంచి ఈ కాలనీలకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సక్రమంగా నీటిసరఫరా కాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో మున్సిపల్ అధికారులు గేట్‌వాల్వ్‌ను మూసివేయడంతో నీరు రావడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తాగునీటికి ఇబ్బంది కలుగుతుందని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన కాలనీవాసులు ఆదివారం పెద్దపల్లి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శ్రీపురంకాలనీలో ఉంటున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆందోళనను గమనించి వాహనంలో మరోమార్గం నుంచి వెళ్లిపోయారు. రాస్తారోకోతో రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో సమాచారం అందుకున్న రూరల్ సీఐ విజ్ఞాన్‌రావు అక్కడికి వచ్చి కాలనీవాసులతో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వాజీద్, శేఖర్, నాయకులు గొర్రె రాజయ్య, కాంపల్లి శంకర్‌లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ ఆదర్శాలను కొనసాగించాలి



హోమంలో పాల్గొన్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: బంజారా ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన సంత్ సేవాలాల్ ఆదర్శాలను కొనసాగించాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ 284వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్‌లోని సేవాలాల్ గుట్టపై నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్నారు. హోమంలో పాల్గొని మాట్లాడుతూ త్యాగాలకు మారుపేరు, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని, ఆయన జయంతి వేడుకల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో ఎంపీటీసీ భూక్యా తిరుపతినాయక్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీజేపీ మోర్చా ఎస్టీ సెల్ నాయకుడు గుగులోతు సదానందంనాయక్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, ఉత్సవ కమిటీ నాయకులు మోహన్‌నాయక్, శ్రీనివాస్ నాయక్, రామచంద్ర నాయక్, హంబిబాయ్, పూజారి విట్టల్ మహారాజ్, భాస్కర్ మహారాజ్, సుజా, లావణ్య, లలిత, బాల్ సింగ్, సరోజన, నిమ్మా నాయక్, దత్తాత్రేయ నాయక్, నాయకులు కిషన్‌నాయక్, బీమాసాహెబ్, రాజునాయక్, మోహన్ నాయక్, డా.రామచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం కార్యవర్గం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

కరీంనగర్‌క్రైం: ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జిల్లా కోర్టు ఆవరణలో జరిగాయి. సంఘ సలహాదారులుగా ఆరెపల్లి మోహన్, కొరివి వేణుగోపాల్, మర్రి వెంకటస్వామిలు ఎంపికయ్యారు. సంఘం అధ్యక్షుడిగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా దుర్గం మారుతి చామనపల్లి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా దాసం శ్రీధర్, సంయుక్త కార్యదర్శులుగా సుంకె దేవకిషన్, బండపల్లి శ్రీకాంత్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా లక్కం కిశోర్, బలరాంనాయక్, స్పోర్ట్స్ కార్యదర్శిగా కుమ్మరి నగేశ్, భువనగిరి మహేందర్, కోశాధికారిగా జల్ల రమేశ్, మహిళా ప్రతినిధులుగా పొన్నాల స్వరూప, అంకమల్ల రజితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మేకల థామస్, మండ రవీందర్, తుమ్మ ప్రభాకర్, జూనియర్లుగా తాండ్ర భూమయ్య, పస్తం ఆంజనేయులు, హరికృష్ణలు ఎంపికైనట్లు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, మాజీ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజిరెడ్డి తదితరులు అభినందించారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న కుతాడి శివరాజ్

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో కార్మిక చట్టాలు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన తెలంగాణ లేబర్ యూనియన్ నాల్గవ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ లేబర్ యూనియన్ అన్ని వేళల కార్మికులకు అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్, ఇండియా జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్. ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య. వైఎస్సార్‌టీపీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు పోలు శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు కారుకూరి శ్రీనివాస్, జటోత్ చక్రవర్తి నాయక్, దేరగుంల అశ్విని, జిలకర బాలస్వామి, కాశిపాక అజయ్, జగజంపుల లలిత తదితరులు పాల్గొన్నారు.

యువతకు సాహిత్యాన్ని పరిచయం చేయాలి



సాహిత్య పుస్తకాలను పరిచయం చేస్తున్న కవులు

విద్యానగర్(కరీంనగర్): కళాశాల స్థాయి నుంచే యువతకు సాహిత్యాన్ని పరిచయం చేస్తే ఉత్తమ సమాజాన్ని నిర్మించగలుగుతామని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో అనిల్ డ్యానీ గాంధారి వాన, ఇబ్రహీం నిర్గుణ్ బహిరంగ ప్రకటన, ధరణికోట రమేశ్‌కుమార్ ఇది ఇట్లెందుకు సాహిత్య పుస్తకాల పరిచయ సభలో మాట్లాడారు. పగలు ప్రతీకారాలు, ద్వేషవిద్వేషాలతో దిగజారుతున్న మనిషిని సన్మార్గంలో నిలబెట్టగల శక్తి సాహిత్యానికి ఉందన్నారు. తెలంగాణ రచయితల వేదిక, ఉమెన్స్ కాలేజీ తెలుగు శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఉమెన్స్ కాలేజీ తెలుగు శాఖాధిపతి మట్టా సంపత్‌కుమార్ రెడ్డి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పుప్పాల శ్రీరాం, సాహితీవేతలు కందుకూరి అంజయ్య, అన్నవరం దేవేందర్, ద్యాసం సేనాధిపతి, జూకంటి జగన్నాథం, గాజోజు నాగభూషణం, బుర్ర తిరుపతి, సీవీ కుమార్, కూకట్ల తిరుపతి, పెనుగొండ సరసిజ బసవేశ్వర్, విలాసాగరం రవీందర్, తోట నిర్మలారాణి, దేవేంద్ర, పెంటయ్య, గుండు రమణయ్య, గాలిపెల్లి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ సంబరాలు



సంబురాలు నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్/విద్యానగర్(కరీంనగర్): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి ఎన్నికల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ కూటమి విజయం సాధించిన సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్, శాతవాహన యూనివర్సిటీల వద్ద సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి భారీ మెజారిటీతో గెలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వేడుకల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గజ్జల శ్రీకాంత్, నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.రోహిత్, కాంపెల్లి అరవింద్, జిల్లా కమిటీ సభ్యులు సురేశ్, తిప్పారపు శ్రీజ, శివ, మనోజ్, నాయకులు వినయ్, సందేశ్, రక్షక్, సతీశ్ ,సందీప్, సంతోష్ శశికుమార్, రేవంత్, చందు, శ్రీహరి, సౌజన్య, శృతి, స్పందన, మౌనిక, భవానీ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతో కొత్త విషయాలు



అవగాహన కల్పిస్తున్న అడిగె శ్రీనివాస్

కరీంనగర్: విద్యార్థులు పుస్తకాలు చదవడం వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చని మోటివేటర్ అడిగె శ్రీనివాస్ అన్నారు. తీగలగుట్టపల్లిలోని ఎస్‌వీజీసీ బాలుర కళాశాలలో ఆదివారం ›పిల్లల చదువుపై‹ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల్లో తమ అనుభవాలతో పాటు సాధించిన విజయాలను పొందుపరుస్తారని తెలిపారు. అలాంటి పుస్తకాలు చదవడం వల్ల జీవితంలో ఎదురయ్యే సమస్యలను సులభంగా పరిష్కరించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.మహేందర్‌రెడ్డి, బాలుర క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎంవీ, వరప్రసాద్, బాలికల క్యాంపస్ ప్రిన్సిపాల్ కాంతాల రాంరెడ్డి, డైరెక్టర్లు ఎస్.హరికృష్ణ, వంగల సంతోశ్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం: నగరంలోని మంకమ్మతోట దర్గాన్ వాడీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎండిపోయిన చెట్ల కొమ్మలు పడి ఉన్నాయి. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టం జరగలేదని అగ్నిమాపక కేంద్ర అధికారి పరమేశ్వర్ వివరించారు.

హిందుత్వం అంటే అందరినీ కలిపేది



మాట్లాడుతున్న సామల కిరణ్

కరీంనగర్‌టౌన్: హిందుత్వం అంటే అందరినీ కలిపేదని, అందరి బాగు కోరడమే హిందుత్వమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ సామల కిరణ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక జ్యోతినగర్‌లో శారీరక ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజ సంఘటనకు నిత్యశాఖ మాధ్యమంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పనిచేస్తూ ఉంటుందన్నారు. నిత్యశాఖలో స్వయంసేవకులు శారీరక, బౌద్ధిక కార్యక్రమాలతో సంస్కారాన్ని, దేశభక్తిని పెంపొందించుకుంటారని తెలిపారు. సంఘకార్యంలో ప్రజలందరి భాగస్వామ్యాన్ని అభిలాషిస్తున్నామని తెలిపారు. మరో ముఖ్యఅతిథి రిటైర్డ్ మిలటరీ ఫిజియో తెరపిస్ట్ ఎం .నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సమాజంలో సైనికుల మాదిరిగా కష్టపడుతున్న తీరు వెలకట్టలేనిదన్నారు. అనేక సందర్భాల్లో స్వయంసేవకులు దేశవ్యాప్తంగా చేసిన సేవలు గుర్తుంటాయని అన్నారు. రాష్ట్రీయ స్వయంసేన సంఘ్ బాధ్యులు మాననీయ జిల్లా సంఘచాలకులు చక్రవర్తుల రమణాచార్యులు, జిల్లా సహసంఘ చాలకులు ఎలగందుల సత్యనారాయణ, పాక సత్యనారాయణ, బాలరాజు, చామ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


సీనియర్ న్యాయవాది మృతి



గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ముదుగంటి గోవర్ధన్‌రెడ్డి (73) ఆదివారం మృతి చెందారు. గంగాధర మండలం అచంపల్లికి చెందిన ఆయన 1973లో న్యాయవాద వృత్తిని ఎంచుకున్నారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఆర్టీసీ న్యాయ సలహాదారుగా, కామధేను కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొనసాగారు. అచంపల్లి సర్పంచ్‌గా, కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగారు. ప్రస్తుతం తెలంగాణ హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నారు. ఆయన మృతికి సంతాపంగా న్యాయవాదులు విధులకు గైర్హాజరు కానున్నట్లు బార్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా 11కేవీ రాంనగర్ ఫీడర్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చేపల మార్కెట్ ప్రాంతం నుంచి సంతోశ్‌నగర్ రోడ్ నం.9 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలి



ప్రచారయాత్రలో పాల్గొన్న పలు సంఘాల నాయకులు

కరీంనగర్: కరెన్సీ నోట్లపై డాక్టర్ బీఆర్. అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కరెన్సీ నోటుపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో సాగుతున్న ప్రచారయాత్ర ఆదివారం పట్టణంలోని కోర్టు చౌరస్తా వద్దకు చేరుకుంది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్వాడీ సుదర్శన్, న్యాయవాదులు, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...



ప్రధాని మోదీతో ఏపీ గవర్నర్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఢిల్లీ పర్యటనకు వచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆదివారం ప్రధాని, కేంద్ర హోం మంత్రి, మాజీ రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారంతా జస్టిస్ నజీర్‌కు అభినందనలు తెలిపారు.

నాటుపడవ బోల్తా
ఆరుగురు గల్లంతు..

పొదలకూరు: సరదాగా చెరువులో విహరించాలన్న యువకుల సంతోషం విషాదంగా మారింది. ఒక గ్రామానికి చెందిన పది మంది యువకులు నాటు పడవలో చెరువులో షికారుకెళ్లి ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో నలుగురు సురక్షితంగా బయటపడగా, ఆరుగురు గల్లంతయ్యారు. ఈ ఘోర దుర్ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు కొత్త చెరువులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. విషయం తెలుసుకుని గ్రామస్తులందరూ చెరువు వద్దకు చేరుకున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం తోడేరుకు చెందిన పముజుల బాలాజీ (20), బట్ట రఘు (20), అట్లా శ్రీనాథ్ (16), మన్నూరు కళ్యాణ్ (30), చల్లా ప్రశాంత్‌కుమార్ (16), పాడి సురేంద్ర (16), ఏనుగు విష్ణు (18), ఎ. కిరణ్ (18), ఒంటేరు మహేంద్ర (20), ఒంటేరు మహేష్ (19) సా.5.30 గంటల ప్రాంతంలో చెరువులో నాటు పడవలో షికారుకెళ్లారు. చెరువు మధ్యలోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏనుగు విష్ణు, ఒంటేరు మహేంద్ర, ఒంటేరు మహేష్, ఎ. కిరణ్ ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మిగిలిన ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఈ సమాచారం తెలుసుకున్న పొదలకూరు సీఐ జీ సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరీముల్లా గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టినా గల్లంతైన యువకుల ఆచూకీ దొరకలేదు.

ఏసీపీ నేతృత్వంలో నవీన్ హత్యకేసు దర్యాప్తు

- హరిహరకృష్ణతోపాటు స్నేహితులను ప్రశ్నించేందుకు సిద్ధమైన పోలీసులు
- నిందితుడి కస్టడీ కోసం నేడు కోర్టులో పిటిషన్ వేసేందుకు ఏర్పాట్లు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్యకేసులో దర్యాప్తు అధికారిగా వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయన నేతృత్వంలో పలు పోలీసు బృందాలు లోతుగా దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలను రాబట్టే పనిలో నిమగ్నమయ్యాయి. ఘటన జరిగిన ప్రదేశానికి కొద్దిదూరంలోనే విజయవాడ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఉన్నాయని.. వాటిని పరిశీలిస్తే నవీన్, హరిహరకృష్ణతోపాటు ఇంకా ఎంతమంది అక్కడికి వచ్చారనేది తేలనున్నట్టు పోలీసులు చెప్తున్నారు. ఇక నవీన్‌ను హత్య చేసిన ప్రాంతానికి దగ్గరగా ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట, బాటసింగారం ప్రాంతాలపై హరిహరకృష్ణకు ముందే స్పష్టమైన అవగాహన ఉన్నట్టు భావిస్తున్నారు. శివారు ప్రాంతాలు కావడం, పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలు ఉండటంతో.. నిర్మానుష్య ప్రాంతాలను ఎన్నుకుని గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం. నవీన్, హరిహరకృష్ణ, వారి స్నేహితులు గతంలో గంజాయికోసం ఈ ప్రాంతాలకు వచ్చి ఉంటారని, ఈ క్రమంలోనే హత్యకు నిర్మానుష్య ప్రాంతాన్ని సులువుగా ఎంచుకుని ఉంటాడని భావిస్తున్నారు.



హరిహరకృష్ణ



నవీన్(ఫైల్)

నిందితుడి కస్టడీ కోసం నేడు పిటిషన్

ఈ కేసులో నిందితుడు హరిహరకృష్ణను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఈ హత్యకు సంబంధించి హరిహరకృష్ణ, నవీన్ స్నేహితులను కూడా విచారించనున్నట్టు సమాచారం. నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ.. ఆ తర్వాత నవీన్ స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డులు బయటికి వచ్చాయి. హరిహరకృష్ణ హత్యకు పాల్పడిన ఆందోళన, భయం వంటివేమీ లేకుండా మాట్లాడిన తీరు విస్మయానికి గురిచేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిందితుడి అన్నకూ నేర చరిత్రే..

ఖిలా వరంగల్: స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన హరిహరకృష్ణ స్వస్థలం వరంగల్‌లోని కరీమాబాద్ ప్రాంతం. తండ్రి స్థానికంగా ఆర్‌ఎంపీ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. హరిహరకృష్ణ అన్న ముఖేశ్ గతంలో ఓ హత్యానేరంలో జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు హరిహరకృష్ణ తాను ప్రేమించిన యువతి కోసం స్నేహితుడిని దారుణంగా హత్యచేయడం కరీమాబాద్ ప్రాంతంలో కలకలం రేపింది.

నవీన్ తల్లిదండ్రులు మమ్మల్ని క్షమించాలి

ఇద్దరు ప్రాణ స్నేహితులు ఒకే అమ్మాయిని ప్రేమించడం దురదృష్టకరమని.. అయినా తప్పు చేసినవారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని నిందితుడు హరిహరకృష్ణ తండ్రి పేరాల ప్రభాకర్ పేర్కొన్నారు. తన కొడుకును ఉన్నతంగా చూడాలని అనుకున్నానని, కానీ ఇలా అవుతుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన కొడుకును తానే స్వయంగా పోలీసులకు అప్పగించానని వివరించారు. నవీన్ తల్లిదండ్రులకు తీరని లోటు జరిగిందని.. వారు తన కుటుంబాన్ని పెద్ద మనసుతో క్షమించాలని విజ్ఞప్తి చేశారు.



విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో హరియాణాలోని కురుక్షేత్రలో 16 రోజులపాటు జరిగిన లక్ష చండీ మహా యజ్ఞం ఆదివారం మహా పూర్ణాహుతితో ముగిసింది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ..ఈ భూమండలంపై లక్ష చండీ మహా యజ్ఞం జరిగిన తొలి ప్రాంతంగా కురుక్షేత్రలోని గుంతీ గ్రామం చరిత్రలో నిలుస్తుందని తెలిపారు. లోక కల్యాణార్థం ఇలాంటి కార్యక్రమాలు రాజుల కాలంలో చేపట్టినట్లు చరిత్ర ద్వారా తెలుసుకున్నామని, ఇప్పుడు కళ్లారా చూశామని తెలిపారు. భారతావనికి కచ్చితంగా శుభ దినం కాగలదని ఆకాంక్షించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర మాట్లాడుతూ ఇది మహత్తర యజ్ఞమని అభివర్ణించారు. –సింహాచలం

ఉగాది తర్వాత గొర్రెల పంపిణీ

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రెండో విడత గొర్రెల పంపిణీ ఉగాది, శ్రీరామనవమి పండగల తర్వాత చేపడతామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖమంత్రి టి.హరీశ్‌రావు ప్రకటించారు. గొర్రెల ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ పథకం యూనిట్ వ్యయాన్ని కూడా పెంచుతామన్నారు. ఆదివారం సంగారెడ్డిలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం, కురుమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ రూ.300 కోట్లతో హైదరాబాద్‌లో గొల్ల, కురుమల ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వం గొల్ల, కురుమలను వాడుకుందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.2 వేల కోట్లతో సరిపెట్టి, బీసీలకు అన్యాయం చేస్తోందని హరీశ్ విమర్శించారు. కురుమ సామాజిక వర్గంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగేవని, కల్యాణలక్ష్మి పథకం అమలు చేసిన తర్వాత ఈ బాల్యవివాహాలు బంద్ అయ్యాయన్నారు. రాష్ట్రంలో గొల్ల, కురుమలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కర్ణాటక మాజీ మంత్రి రేవన్న సీఎం కేసీఆర్‌ను కలిసి గొంగడి కప్పి అభినందించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ విషయంలో రేవన్నకు ఏఐసీసీ నోటీసులు కూడా జారీ చేసిందన్నారు. సభలో ఎంపీలు బీబీపాటిల్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, మాణిక్‌రావు, హెచ్‌డీసీ రాష్ట్ర చైర్మన్ చింతప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, గొల్ల కుర్మ సంఘం నేతలు నగేశ్, శ్రీహరి, పాండు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీశ్‌రావుకు గొంగడి కప్పిన కురుమలు

తొలి గంటలో బిడ్డకు ముర్రుపాలు

సాక్షి, హైదరాబాద్: పుట్టిన తొలి గంటలో తల్లి నుంచి బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ, మాతా శిశు సంరక్షణ కేంద్రాలలో గర్భిణులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 'బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్‌నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా'ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల్లో సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఇందుకోసం మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లో లాక్టేషన్‌వర్కర్లను నియమించనున్నారు. దీంతోపాటు మాతా శిశు సంరక్షణ యూనిట్లలో తల్లిపాలకేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని ఆస్పత్రుల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వస్తున్నట్లు వైద్య వర్గాలు చెప్పాయి. తొలిగంటలోనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల అనేకరకాల జబ్బుల నుంచి రక్షణ ఏర్పడుతుంది. ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే తాగిస్తే..ఐదేళ్లలోపు పిల్లల మరణాలను 22% నివారించవచ్చని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువ శాతం సిజేరియన్ ద్వారానే బిడ్డను బయటకు తీయడం వల్ల వారు తొలి గంటలో ముర్రుపాలకు దూరమవుతున్నారు. ఆ సమయంలో బిడ్డకు తల్లి పాలిచ్చే పరిస్థితి ఉండటంలేదు. ఈ పరిస్థితిని నివారించేందుకే బ్రెస్ట్ ఫీడింగ్‌పై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు ఆదివారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టకపోయినా, కొట్టారని పాత ఫొటోలతో ప్రజలను మోసం చేసిన ఈనాడు దిగజారుడు పాత్రికేయ విలువలకు వ్యతిరేకంగా గత మూడు రోజులుగా ఏపీ వ్యాప్తంగా ప్రజల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. ఆదివారం కూడా ప్రజలు, వివిధ సంఘాల నేతలు, పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనాడు తీరును నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

అదరగొట్టిన బాడీబిల్డర్స్



పోటీల్లో పాల్గొన్న బాడీ బిల్డర్లు





ప్రదర్శన ఇస్తున్న బాడీ బిల్డర్లు

- బెల్లంపల్లిలో అట్టహాసంగా రాష్ట్రస్థాయి పోటీలు
- నిర్వాహకులను అభినందించిన అతిథులు

బెల్లంపల్లి: ఉక్కు నరాలు, మెలికలు తిరిగిన కండరాలతో బాడీ బిల్డర్లు అలరించారు. శారీరక దృఢత్వం కలిగి ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చి అదరహో అనిపించారు. వందల మంది వీక్షకుల మధ్య బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించారు. సైకో జిమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ... సుదీర్ఘచరిత్ర కలిగిన బెల్లంపల్లిలో రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బాడీ బిల్డింగ్ పోటీలతో బెల్లంపల్లికి వన్నె వచ్చిందన్నారు. క్రీడాకారులు ఎంతో శారీరక కసరత్తు చేయాల్సి ఉంటుందని, పోటీల్లో నెగ్గడానికి బాడీని అత్యంత ఫిట్‌నెస్ ఉంచుకోవడం, నిత్యం గంటల తరబడి వ్యాయామం చేయడంతోపాటు బలమైన ఆహారం తీసుకోవడం చేస్తుంటారని వివరించారు. కష్టసాధ్యమైన పోటీలను ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. క్రీడాకారులకు, నిర్వాహకులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ.. సాధారణ పట్టణమైన బెల్లంపల్లిలో రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీ నిర్వహించడం సాహసోపేతమైన నిర్ణయమని పేర్కొన్నారు. పోటీలతో క్రీడాకారుల్లో అంతర్లీనంగా దాగిఉన్న ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

బొగ్గు గనుల క్షేత్రమైన బెల్లంపల్లికి ఎంతోచరిత్ర ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ అన్నారు. ఎంతో మంది బాడీబిల్డింగ్ క్రీడాకారులను తయారు చేసిన ఘనత బెల్లంపల్లికి ఉందని తెలిపారు. ఏసీపీ సదయ్య మాట్లాడుతూ.. క్రీడలకు, క్రీడాకారులకు పోలీసు శాఖ తగిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

వివిధ విభాగాల్లో పోటీలు

రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలను 55 కిలోలు, 60 కిలోలు, 65 కిలోల విభాగాల్లో నిర్వహించారు. మిస్టర్ తెలంగాణ, మిస్టర్ ఆదిలాబాద్, వికలాంగులు, మాస్టర్స్‌కు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించి ప్రతిభ చాటుకున్నారు. ఈపోటీల్లో మిస్టర్ తెలంగాణగా ఎంపికైన క్రీడాకారుడికి రూ.50 వేల నగదు బహుమతిని అందించనున్నారు. జూనియర్ మిస్టర్ నేషనల్ సెలక్షన్‌కు ప్రతిభ చాటిన క్రీడాకారుడిని ఎంపిక చేస్తారు. పోటీలు అర్ధరాత్రి వరకు జరిగాయి. పోటీలను తిలకించడానికి యువకులు, మహిళలు, విద్యార్థులు తరలివచ్చారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు సదానందం, బాలు, శేఖర్, నగేశ్, ఫారభ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

- రైతులకు నష్టం చేసే చట్టాలు తెచ్చింది మోదీనే..
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- కాగజ్‌నగర్ పట్టణంలో మంచిర్యాల, కుమురంభీం జిల్లాల విస్తృత స్థాయి సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ సాధారణ ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ(ఎం) మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీరభద్రం హాజరై మాట్లాడారు. రైతులను నష్టం చేసే చట్టాలను తీసుకొచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం దేశాన్ని భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మార్చి 23 నుంచి రాష్ట్రంలో మూడు ప్రచార జాతాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఒక జాతా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సెక్రెటేరియట్ సభ్యుడు వీరయ్య నాయకత్వంలో ఈ జాతా పలు జిల్లాలు, మండల కేంద్రాల గుండా సాగుతుందని వివరించారు. మూడు జాతాలు రాష్ట్రంలోని అన్నిజిల్లాలు, ప్రధాన నగరాలు, మండల కేంద్రాల గుండా కొనసాగి మార్చి 30న హైదరాబాద్‌కు చేరుకుంటాయని తెలిపారు. అదేరోజు హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టే కార్యక్రమాలు, ప్రచార జాతా విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు

సమావేశం అనంతరం వీరభద్రం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీతో కలిసి పోటీచేసే యోచనలో ఉన్నామని తెలిపారు. బీఆర్‌ఎస్‌పార్టీ కొంతకాలంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తోందన్నారు. ఈ క్రమంలో మునుగోడు అసెంబ్లీ ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఓడించేందుకు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చామని తెలిపారు. బీజేపీని ఓడించేందుకు రాబోయే ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌తో కలిసి పోటీ చేయాలని ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రోత్సహించే బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, ఆశయ్య, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశాలత, రెండు జిల్లాల కార్యదర్శులు సంకె రవి, కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, ముంజం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఇంకెన్నాళ్లు.. వేతనాల వ్యథ

- కాంట్రాక్టు కార్మికులకు అందని కనీస వేతనాలు
- పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని.. సంస్థ లాభాల్లో కీలకపాత్ర
- హైపవర్ కమిటీ వేతనాల అమలులో వివక్ష
- రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో జీవో నంబర్ 22



ఆందోళన నిర్వహిస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

గోదావరిఖని(రామగుండం): చాలీచాలని వేతనాలతో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అరిగోస పడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదని వాపోతున్నారు. తమకు అన్ని విధాల అన్యాయం జరిగినా పట్టించుకునే వారే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులకు చట్టబద్ధమైన వేతనాలు అమలు కావడంలేదు. సింగరేణి వ్యాప్తంగా 25వేల మందికిపైగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గతంలో 18రోజుల సమ్మె చేపట్టారు. అయినా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల జీవో నంబర్ 22 అమలుపై రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేయాల్సి ఉంది. సింగరేణి యాజమాన్యం జీవో అమలు చేయాలని లేఖ రాసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిర్ణయం తీసుకోలేదు. దీంతో కాంట్రాక్ట్ కార్మికులకు పనికితగ్గ వేతనాలు అందడం లేదు.


జీడీకే-5 ఓసీపీలో ఆందోళన

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు కాకపోవడంతో వారికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. జీవో నంబర్ 22 అమలు అయితే కనీస వేతనం రూ.19వేల వరకు ఉండవచ్చని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఈక్రమంలో కనీసవేతనాల అమలు చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే వారికి న్యాయం జరిగే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో కాంట్రాక్టు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–5 ఓసీపీలో కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. మూడురోజులుగా సమ్మె కొనసాగుతున్నా అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్కిల్డ్ వేతనాలతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఖాళీ క్వార్టర్లు కేటాయించాలి

సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోన్న కాంట్రాక్టు కార్మికులకు ఖాళీ క్వార్టర్లు కేటాయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సంస్థవ్యాప్తంగా 25వేల పైచిలుకు కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. సుమారు 14వేల క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. ఈక్రమంలో సంస్థ కోసం పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు క్వార్టర్లు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

యాజమాన్యం స్పందించాలి



సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలి. ఈ విషయంలో జీడీకే–5 ఓసీపీలో గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టు కార్మికుల జీవో 22 అమలు కోసం గెజిట్ విడుదల చేయాలి. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత వస్తున్న జీతాలు కార్మికులకు ఏమాత్రం సరిపోవడం లేదు. అలాగే ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలి. – వేల్పుల కుమారస్వామి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె


సింగరేణి ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చేనెల 26 నుంచి సమ్మెలోకి వెళ్తామని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం జీడీకే–5 ఓసీపీ వద్ద ఆందోళన నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఓబీ ఆపరేటర్స్‌కు హైస్కిల్డ్ వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులు పెడుతున్నారని, సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కౌశిక్ హరి, బుర్ర తిరుపతి, పూసాల తిరుపతి, వెంకన్న, తోకల రమేశ్, మద్దెల శ్రీనివాస్ ఎంపె గౌస్, శనగల శ్రీనివాస్, రామగిరి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో కార్మికులు, నాయకులు

సన్నిధి

మంచి మాట



మార్పు ఒక సాంత్వన

మార్పును పొందడం, మారడం బతుకుతున్న మనిషికి ఎంతో అవసరం. మనిషి రాయి కాదు మార్పును పొందకుండా మార కుండా పడి ఉండడానికి. బతుకుతున్న మనిషి మార్పును పొందుతూ ఉండాలి, మారుతూ ఉండాలి. బతకడానికి సిద్ధంగా ఉన్న మనిషి మారడానికి కూడా సిద్ధంగా ఉండాలి. ఒక మనిషి మారకపోవడం అతడు సరిగ్గా బతకలేక పోవ డమూ, బతకకపోవడమూ అవుతుంది.

'నువ్వు ఇక్కడ ఉంది బతకడానికి; నువ్వు ఇక్కడ ఉంది ఆడడానికి; నువ్వు ఇక్కడ ఉంది బతుకును అనుభవించడాని కి' అని ఓషో చెప్పారు. మార్పు లేకుండా, మారకుండా రాయిలా బతికితే ఎలా? బతుకుతూ ఉండడానికి, బతుకును అనుభవిస్తూ ఉండడానికి మనిషిలో ఎప్పటికప్పుడు మార్పు వస్తూ ఉండాలి; మనిషి తనను తాను మార్చుకుంటూ, తనకు తాను మార్పులు చేసుకుంటూ బతుకును ఆస్వాదిస్తూ ఉండాలి.

మార్పుల్ని స్వీకరించని మనిషికి, మారని మనిషికి, ఊరట ఉండదు, సాంత్వన ఉండదు. 'ఎవరికి ఏది తెలియదో అది వాళ్లకు ఉండదు' అని తాత్త్వికకృతి త్రిపురారహస్యం మాట. మారడం తెలియనివాళ్లకు మార్పు అనేది ఉండదు. మార్పు లేనివాళ్లకు బతుకు సరిగ్గా ఉండదు. అంతేకాదు బతక డమే భారమైపోతుంది. మనిషిలో మార్పులు రాకపోడానికి ముఖ్యమైన కారణాలు అభిప్రాయాలు. అభిప్రాయాల వలలో చిక్కుకుపోయినవాళ్లు మారడం చాతకాకుండా మానసికంగా బాధపడుతూనే ఉంటారు; తమవాళ్లను అదేపనిగా బాధపెడు తూనే ఉంటారు. అభిప్రాయాలకు అతీతమైన అవగాహన మనిషికి అవసరమైన మార్పుల్ని తీసుకొస్తూ ఉంటుంది.

వయసువల్ల మనిషికి శారీరకమైన మార్పులు రావడం సహజం. ఆ విధంగానే ప్రతి మనిషికీ ఆలోచనపరంగా, దృక్పథంపరంగా, ప్రవర్తనపరంగా, మనస్తత్వంపరంగా మార్పులు రావాలి. మన దైనందిన జీవితంలో భాగం అయి పోయిన కంప్యూటర్లను మనం రిఫ్రెష్ చేస్తూ ఉంటాం. ఆ విధంగా మనల్ని కూడా మనం మాటిమాటికీ రిఫ్రెష్ చేసు కుంటూ ఉండాలి. అలా చేసుకుంటూ ఉండడంవల్ల జడత్వం లేదా స్తబ్దత తొలగిపోతుంది. జడత్వం, స్తబ్దతలు తొలగి పోతున్న కొద్దీ మనలో మార్పు వస్తూ ఉంటుంది.

మన జీవితాన్ని మన మస్తిష్కం నిర్ణయిస్తుంది. మస్తి ష్కంలో మార్పులు రాకపోతే జీవితంలో మార్పులు రావు. మారని మస్తిష్కం మొద్దు లాంటిది. మస్తిష్కం మొద్దుగా ఉంటే జీవితం మొద్దుబారిపోతుంది. మన చుట్టూ ఉన్నవాళ్లలో ఇలా మొద్దుబారిన జీవితాలతో చాల మంది కనిపిస్తూ ఉంటారు. మార్పులకు మాలిమి అవని వాళ్లు మానసికరోగులుగా కూడా అయిపోతారు. కొంతమంది ఉన్మాదులుగా అయిపోవడానికి కారణం వాళ్లలో మార్పు అనేది రాకపోవడమే; వాళ్లకు మార్పు అవసరం అని వాళ్లు గ్రహించకపోవడమే.

ప్రపంచానికి ఎంతో కీడు చేస్తున్న మతోన్మాదం, ప్రాంతీయ వాదం, ముఠాతత్త్వం వంటివాటికి మూలం మారని, మార లేని మనుషుల మనస్తత్వమే. మనుషులు పసితనం నుంచి మారుతూ వచ్చాక ఒక వయసు తరువాత మారడాన్ని ఆపేసు కుంటారు. తమ అభిప్రాయాలు, నమ్మకాలు, ఆలోచనలు, అభిరుచులు, ఉద్దేశాలు, ప్రవర్తన సరైనవే అని తీర్మానించు కుని తమలో తాము కూరుకుపోతూ ఉంటారు. మారకపో వడం తమ గొప్పతనం అని నిర్ణయించుకుంటారు. అటుపైన వాళ్లు మూర్ఖులుగానో, చాదస్తులుగానో, తిక్కవ్యక్తులుగానో, పనికిరానివాళ్లుగానో, అసూయాపరులుగానో, దొంగలు గానో, ఇంగితం లేనివాళ్లుగానో, వంచకులుగానో, చెడ్డవాళ్ల గానో, హంతకులుగానో రూపొందుతూ ఉంటారు. సంఘానికి, ప్రపంచానికి మారని పలువురివల్ల ఎంతో హాని జరిగింది, జరుగు తోంది. మారకపోవడంవల్ల మనుషులు మనుషులకు అపాయకరమైపోతూ ఉన్నారు.

మార్పును పొందడం, మారడం మనుషులకు ఉండి తీరాల్సిన లక్షణం. ఊరట, సాంత్వన కావాలంటే, రావా లంటే, ఉండాలంటే మనుషులు మారడం నేర్చుకోవాలి. మారడం నేర్చు కుని మనుషులు శాంతంగా బతకాలి.

– రోచిష్మాన్

దమ్మపదం

స్థిరచిత్తం అంటే అదే!



అది గంగానదీ తీరం. లోతు తక్కువ ప్రదేశం. నది మధ్యలో అక్కడక్కడ ఇసుక దిబ్బలు న్నాయి. నదీ తీరంలో గట్టు వెంట గొర్రెల మంద మేస్తోంది. ఆ మందను చూసింది ఒక తోడేలు. మందలో చివరిలో మందకు కొద్ది దూరంలో ఒంటరిగా మేస్తోంది ఒక పొట్టేలు. తోడేలు చూపు దాని మీద పడింది. 'ఈ బలిసిన పొట్టేలు అయితే రెండు రోజులకు సరిపోతుంది' అనుకుంది. మాటు కాచి, పొంచి పొంచి దాని దగ్గరకు వచ్చింది. ఎండుటాకుల ధ్వనిని బట్టి ఏదో తనవైపు వస్తున్నట్లు గుర్తించింది పొట్టేలు. తల పైకెత్తి చూసింది. తన మీదికి దూకి వస్తున్న తోడేలు కనిపించే సరికి నది మధ్యలో ఉన్న ఇసుక తిన్నెల మీదికి పరుగుతీ సింది. అలా రెండు మూడు తిన్నెలు దాటి తీరాన్నుండి దూరంగా పోయాయి రెండూ.

అంతలో వరదనీరు ఉరకలేస్తూ ఉరవడిగా వచ్చిపడు తోంది. పొట్టేలు ప్రాణ భయంతో ఇసుక దిబ్బ మీది నుండి నది నీటిలోకి దూకేసి ఈదు కుంటూ వెళ్లిపోయింది. తోడేలు మాత్రం దిబ్బమీదే నిలబడిపోయి, పొట్టేలు వైపే చూస్తూ ఉండిపో యింది.

ఇంతలో వరద నీరు హెచ్చింది. మధ్యలో ఉన్న ఇసుక దిబ్బలు మునిగి పోసాగాయి. తోడేలు పొట్టేలు మీది నుంచి చూపు తిప్పుకునేసరికే అది నిలబడ్డ దిబ్బ చాలా మునిగిపో యింది. కొద్దిసేపటికి ఆ దిబ్బమీది కొద్ది ఎత్తైన ప్రదేశం మాత్రమే మిగి లింది. తోడేలు ఆ ఎత్తు ప్రదేశానికి చేరింది. ఆ వరద అలా రెండురోజులు ఉంది. వేటాడటం అటుంచి, కనీసం ఒడ్డుకు చేరే మార్గం కనిపించలేదు.

అది తనలో తనే 'ఈ ప్రమాదాన్నుండి బయట పడ తానో లేదో, ఇప్పటిదాకా ఎంతో హింస చేశాను. ఎన్నో జీవుల్ని చంపాను. ఆ కర్మ ఫలం నాకు మంచిని చేకూ ర్చదు. కాబట్టి బతికినన్ని రోజులు ఇక అహింసను, మైత్రిని, మంచితనాన్ని పాటించాలి' అనుకుంది. ఆ దిబ్బ మీదికి చేరి, కూర్చొని ధ్యానం చేయసాగింది.

కొంత సమయం గడిచింది. ఎక్కడో సన్నగా మేక అరుపు దాని చెవులబడింది. తపస్సు భగ్నం అయ్యింది. మెల్లగా కళ్లు తెరిచింది. అటూ ఇటూ చూసింది. వరద కొద్దిగా తగ్గింది. తాను ఉన్న ఇసుక దిబ్బ ఇంకొద్దిగా బైట పడింది. దాని మీదకు చేరి అరుస్తూ ఉన్న మేకపిల్ల కనిపించింది. తోడేలు మెల్లగా లేచి మేక పిల్లకేసి వంగి వంగి నడవసాగింది. దాదాపు దగ్గరగా పోయి ఒక్క ఉదుటున దూకింది. కానీ.. గురి తప్పి నీటిలో పడడంతో శబ్దం వచ్చింది. ఆ శబ్దాన్ని విని అటు చూసిన మేక పిల్ల ప్రాణభయంతో నది నీటిలోకి ఎగిరి దూకి ఈదుకుంటూ వెళ్లిపోయింది. తోడేలుకు మరలా నిరాశ.'లేదు. మరలా నేను నా మనస్సును కుదుట పరచుకోవాలి. హింసను విడనాడాలి. అహింసతో జీవిం చాలి. తపస్సు చేసి, చేసిన పాప ఫలాన్ని రూపు మాపుకో వాలి' అనుకుంది.


బుద్ధుడు ఈ కథ చెప్పి– ''మనం మనకు అనను కూల పరిస్థితులు వచ్చినప్పుడు శాంతంతో, అహింసతో, జీవ కారుణ్యాన్నీ, ధర్మాన్నీ ఆచరించడం కాదు. కోపం రావడానికి కారణాలు ఉన్నప్పుడూ, హింస చేసే అవ కాశం వచ్చినప్పుడూ తప్పు చేసే పరిస్థితులు కలిగిన ప్పుడు అవి చేయకుండా ఉండటమే గొప్పతనం. అలా ఉంచగలిగిందే ధ్యానం. అలా మన చిత్తాన్ని ప్రక్షాళన చేసుకోవాలి. నా మార్గం మనస్సును అలా దృఢంగా మలుస్తుంది''అని చెప్పాడు. స్థిర చిత్తం అంటే అదే మరి!

– డా. బొర్రా గోవర్ధన్

గురువాణి

నీలోని నువ్వు చెప్పేది విను... చాలు


ధర్మం చెప్పడానికి లోకం లో ఉన్న ఐదు ప్రమాణాలలో ఒకటి అంతరాత్మ ప్రబోధం. అది మనిషికి ఎప్పుడూ లోపల ఉండే ధర్మాన్ని చెబుతుంటుంది. చెయ్యకూడని పని చేస్తున్నప్పుడు... లోపలినుంచి ఒక సణుగుడు వినిపిస్తుం టుంది. ''ఎం దుకు చేస్తు న్నావు... నలుగురి లో ఎంత మంచి పేరు తెచ్చుకున్నావు. తప్పుచేసి మచ్చ తెచ్చుకోకు, నామాట విను... దానికి దూరంగా ఉండు..'' అని లోపలి నుంచి ఘోషిస్తుంటుంది. మీరు ఏ పని మొదలు పెట్టినా ఒక్క అంత రాత్మ మాత్రమే ఒక ప్రశ్నతో మిమ్మల్ని నిలదీస్తుంటుంది. 'ఇది చేయవచ్చా ?.. అని! అలా నిలదీస్తున్నందుకు దాని గొంతు పిసికేయకూడదు. అదేం చెబు తుందో ఓపికగా విని ఆలోచించినవారిని ''శ్రద్ధ కలిగిన వారు'' అంటారు. అలా ఎందుకడుగుతుంది అంటే... అప్పటికే ఆయన.. శారీరక, మానసిక సుఖాల కోసం దిగజారిపోయాడు. అయినా అది మాత్రం హెచ్చరిస్తూనే ఉంటుంది. దాని మాట విన్న వాడు మహాత్ముడవుతాడు.



శరీరంలో శక్తి, ఇంద్రియాలకు పటుత్వం, మన సులో విజృంభణ ఉందని సుఖాన్ని పొందడం మంచిది కాదు. ఎవరూ కూడా మొదటి నుంచే నూరు శాతం నిలకడగా ఉండలేరు. అది అంత తేలికేం కాదు కూడా. కానీ లోపలిమనిషి చెబుతున్న వాటిని శ్రద్ధగా వినడం అలవాటు చేసుకుంటే.. క్రమేణా ఆచరణలో కూడా అలవాటవుతుంది. అదే ధర్మంగా నడుచుకోవడం అంటే.

మహాత్మాగాంధీ మొదటిసారి లండన్ బయల్దేరుతున్నప్పుడు... మద్యం, మాంసం, మగువలకు వశపడే అవకాశాలు అక్కడ ఎక్కు వని వినడం వల్ల తల్లి అనుమతి నిరాకరిం చింది. వారి కుటుంబ శ్రేయోభిలాషి అయిన ఒక స్వామీజీ జోక్యం చేసు కొని ..''ఏ కారణం చేత కూడా ఈ మూడింటికీ వశపడను'' అని తల్లికి ప్రమాణం చేయించి పంపారు. తల్లి భయాలే నిజమయ్యే పరిస్థితి ఏర్ప డింది. ఒక స్త్రీతో ఆయ నకు హద్దులు దాటిన సంబంధం ఏర్పడుతున్న క్షణాల్లో ఉన్నట్టుండి అమ్మకిచ్చిన మాట గుర్తొ చ్చింది. ఆయన వెంటనే వెళ్ళిపోయి.. తరువాత ఆ స్త్రీకి నిజాయితీగా ఒక ఉత్తరం రాస్తూ... తనకు పెళ్ళయిందనీ, ఒక కుమారుడు కూడా ఉన్నాడనీ, ముందుగా ఈ విషయాలు చెప్పకపోవడం తప్పేనని, తనను క్షమించాలని కోరాడు. అదీ అంతరాత్మ ప్రబోధం అంటే. అదీ లోపలున్న మనిషి మాటను నువ్వు వినడం అంటే.. ఇటువంటిదే మరో సంఘటన జరిగినా.. మనసు మాట విని దానికి దూరంగా జరిగాడు... వీటిని నెమ రేసుకుంటూ ఆయన ఇలా రాసుకున్నారు...

''భక్తి అనేది మనిషిలో ఉన్న విశృంఖల త్వాన్ని తుడిచేస్తుంటుంది. ఇంటిని ఏ కారణం తో శుభ్రపరచు కుంటుంటామో... మనసును కూడా భగవద్భక్తి అనే చీపురుపట్టి లోపలి మాలిన్యాలను శుభ్రపరచుకుంటుండాలి. మనసు నిర్మలంగా ఉన్నప్పుడు అంతరాత్మ మాట విని ధర్మమార్గంలోనే నడుస్తుంటుంది. సుఖాలకోసం పక్క చూపులు చూడదు.''



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అమృత బిందువులు

- బాధల్ని మిగిల్చే బంధుత్వాల కంటే... ప్రశాంతతను ఇచ్చే ఒంటరితనం గొప్పది.
  అవసరాలకు పలకరించే పలకరింపుల కంటే...
  బాధల్ని తగ్గించే కన్నీళ్లే గొప్పవి.
  అవసరాల్ని తీర్చని ఆస్తుల కంటే... ఆకల్ని తీర్చే అన్నం గొప్పది.
- వయస్సు పెరిగే కొద్దీ సమాజంలో, మనిషి జీవితం ఆప్యాయతకి, మంచితనానికి చిరునామా, అలంకరణ కావాలి. కానీ, అహంకారానికి, ద్వేషానికి, గొడవలకు మూలం కాకూడదు.
- ఆశ జీవితాన్ని ఎన్నో మలుపులు తిప్పుతుంది. అత్యాశ అధఃపాతాళానికి దారితీస్తుంది. నిరాశ బతుకు మీద విరక్తిని పెంచుతుంది.
- సేవచేయడం, శ్రద్ధగా వినడం, గ్రహించడం, గుర్తుపెట్టుకోవడం, ఊహించడం, పొరపాటును సరిదిద్దడం, ప్రయోజనం కలిగించడం, తత్వజ్ఞానం అనే బుద్ధికున్న ఎనిమిది లక్షణాలు మానవుణ్ని మహోన్నతుడిగా కీర్తి శిఖరాలమీద కూర్చోబెడతాయి. ఇవే మహోన్నత మార్గాన మనిషిని నడిపిస్తాయి.
- నిన్నటి కన్నా నేడు మిన్నగా... నేటికన్నా మిన్నగా రేపు జీవించాలి.
- జీవితంలో వాస్తవం ఉండాలి. ఏం జరిగినా స్వీకరించే ధైర్యం ఉండాలి.
- మన జీవితాన్ని మనమే రూపు దిద్దుకోవాలి.

సినిమా

కథ మళ్లీ కలిపింది



మహేశ్‌బాబు, త్రివిక్రమ్

ఓ సినిమా సూపర్ హిట్ అయితే ఆ హీరో, డైరెక్టర్ కాంబినేషన్ రిపీట్ కావాలని ఆడియన్స్ కోరుకుం టుంటారు. కానీ సరైన కథ కుదిరితేనే ఆ కాంబో రిపీట్ అవుతుంది. అలా మంచి కథ కుదరడంతో పదేళ్ల తర్వాత టాలీవుడ్‌లో రిపీట్ అవుతున్న కొన్ని కాంబినేషన్స్‌పై (హీరో-డైరెక్టర్) ఓ లుక్కేద్దాం.

★ హీరో మహేశ్ బాబు ముచ్చటగా మూడోసారి దర్శకుడు త్రివిక్రమ్‌తో సినిమా చేస్తున్నారు. 2005లో వచ్చిన 'అతడు' సినిమా కోసం మహేశ్, త్రివిక్రమ్ తొలిసారి చేతులు కలిపారు. ఆ మూవీ హిట్ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో 2010లో 'ఖలేజా' చిత్రం వచ్చింది. ఇప్పుడు పన్నెండేళ్ల తర్వాత మహేశ్, త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న సినిమా సెట్స్‌పైన ఉంది. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పూజాహెగ్డే, శ్రీలీల హీరోయిన్స్. ఇప్పటికే కొంత షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబుతో పాటు పూజాహెగ్డే, శ్రీలీల పాల్గొంటారని తెలిసింది. ఈ సినిమాలో నటి రమ్యకృష్ణ ఓ కీలక పాత్ర చేయనున్నారని టాక్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటోంది చిత్రయూనిట్.

★ హీరో అల్లు అర్జున్‌తో 'ఆర్య' (2004), 'ఆర్య 2' (2009) వంటి ప్రేమకథా చిత్రాలు తీశారు దర్శకుడు సుకుమార్. పది సంవత్స రాల తర్వాత అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప' రూపొందుతోంది. ఇందులో రష్మికా మందన్న హీరోయిన్. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకువస్తోంది. 'పుష్ప' తొలిపార్టు 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై అద్భుత విజయం సాధించింది. దీంతో మలిపార్టు 'పుష్ప: ది రూల్'పై మరింత ఫోకస్ పెట్టారు అల్లు అర్జున్ అండ్ సుకుమార్. ఆల్రెడీ 'పుష్ప: ది రూల్' షూటింగ్ మొదలైంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ మార్చి మొదటివారంలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. మలయాళ నటుడు ఫాహద్ ఫాజిల్, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్న 'పుష్ప: ది రూల్' కి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా 2024లో రిలీజ్ కానున్నట్లు తెలిసింది.

★ పదిహేను సంవత్సరాల క్రితం వచ్చిన 'ఢీ: కొట్టిచూడు'(2007) సినిమా ప్రేక్షకులను బాగా ఎంటర్‌టైన్ చేసింది. మంచు విష్ణు హీరోగా నటించిన ఈ సినిమాకు శ్రీనువైట్ల దర్శకత్వం వహించారు. అయితే వీరిద్దరి కాంబినేషన్‌లోని మరో సినిమా ప్రకటన రావడానికి దాదాపు పుష్కరకాలం పట్టింది. 'ఢీ: కొట్టిచూడు' సినిమాకు సీక్వెల్‌గా 'ఢీ2: డబుల్ డోస్' సినిమా రూపొందను న్నట్లు 2020 నవంబరులో ప్రకటించారు మంచు విష్ణు. అయితే ఈ సినిమాపై మరో అప్‌డేట్ రావాల్సి ఉంది. మరోవైపు గోపీచంద్‌తో ఓ సినిమా చేయనున్నట్లు ఇటీవల వెల్లడించారు దర్శకుడు శ్రీనువైట్ల. మరి.. ఆయన దర్శకత్వంలో ఏ హీరో సినిమా ముందుగా సెట్స్‌పైకి వెళుతుందో తెలియాలంటే కొద్దిరోజులు వేచి చూడాలి.




అల్లు అర్జున్

సుకుమార్

★ ఆది పినిశెట్టి హీరోగా నటించిన చిత్రాల్లో 2009లో వచ్చిన హారర్ ఫిల్మ్ 'ఈరమ్' మంచి హిట్ సాధించింది. అరివళగన్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రం తెలుగులో 'వైశాలి'గా 2011లో విడుదలై సక్సెస్ సాధించింది. పద్నాలుగేళ్ల తర్వాత ఆది, అరివళగన్ కాంబినేషన్‌లో తెలుగు, తమిళ భాషల్లో 'శబ్దం' అనే చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ మొదలైంది. లక్ష్మీ మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని 7జీ శివ నిర్మిస్తు న్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.


కాగా పదేళ్ల గ్యాప్ తర్వాత రిపీట్ అవుతున్న హీరో, డైరెక్టర్ కాంబినేషన్ జాబితాలో మరికొన్ని తెలుగు చిత్రాలు ఉన్నాయి.



మంచు విష్ణు, శ్రీను వైట్ల



ఆది పినిశెట్టి



అరివళగన్

కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి కన్నుమూత



కె.విశ్వనాథ్, జయలక్ష్మి


తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో విషాదం నెలకొంది. దివంగత డైరెక్టర్ 'కళాతపస్వి' కె.విశ్వనాథ్ సతీమణి కాశీనాథుని జయలక్ష్మి(88) ఇకలేరు. ఆదివారం సాయంత్రం 5:45 గంటలపైన ఆమె తుదిశ్వాస విడిచారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంచానికే పరిమితమయ్యారు. భర్త విశ్వనాథ్ మరణం తర్వాత మరింత అనారోగ్యానికి గురయ్యారు జయలక్ష్మి. ఈ క్రమంలోనే ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు కుటుంబ సభ్యులు. అక్కడే ఆమె తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కైకలూరు జయలక్ష్మి స్వస్థలం. 1935లో వినాయక చవితి రోజున జన్మించారామె. ఆమె అన్నయ్య చదువు కోసం వారి కుటుంబం బందరుకి మారింది. అక్కడి లేడీ యాంఫిల్ మిషనరీ స్కూల్లో చదివారు జయలక్ష్మి. ఆమె పదో తరగతి చదువుతున్నప్పుడే పద్నాలుగేళ్లకే కె.విశ్వనాథ్‌తో 1948 అక్టోబర్ 2న వివాహం జరిగింది. ఆ తర్వాత మద్రాసులో కాపురం పెట్టారు విశ్వనాథ్-జయలక్ష్మి దంపతులు. వారికి ముగ్గురు సంతానం. పద్మావతి దేవి, కాశీనాథుని నాగేంద్ర నాథ్, కాశీనాథుని రవీంద్రనాథ్. ఈ నెల 2న కె.విశ్వనాథ్ కన్నుమూశారు. ఆయనతో 75 ఏళ్ల వైవాహిక జీవితం గడిపారు జయలక్ష్మి. కె.విశ్వనాథ్ మరణించినప్పటి నుంచి ఆయన మీద ఉన్న ప్రేమతో ఆమె తీవ్ర మనో వేదనకు గురై, ఆరోగ్యం మరింత క్షీణించ టంతో తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివ దేహాన్ని ఆస్పత్రి నుంచి ఫిలింనగర్‌లోని ఇంటికి తరలించారు. విశ్వనాథ్ చనిపోయిన 24 రోజులకే జయ లక్ష్మి కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. జయలక్ష్మి మృతిపట్ల పలు వురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. కె.విశ్వ నాథ్ తుదిశ్వాస విడిచిన వార్డులోనే జయలక్ష్మి కూడా కన్నుమూయటం దురదృష్టకరమని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం పంజాగుట్ట స్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

వైఎస్ జగన్ సంతాపం:

జయలక్ష్మి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

యాక్షన్ బిగిన్స్



సమంత

మయోసైటిస్ వ్యాధి నుంచి కోలుకుం టున్న సమంత మెల్లిగా వర్క్‌లో బిజీ అవుతున్నారు. ఇటీవల బాక్సింగ్ సాధన చేస్తున్న ఫోటోను షేర్ చేశారు సమంత. తాజాగా తాను గుర్రపుస్వారీ ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేసి, ''ది బ్యూటీ అండ్ ది బీస్ట్.. రెండూ నీవే..' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. కాగా సమంత బాక్సింగ్, గుర్రపు స్వారీ ప్రాక్టీస్ చేస్తున్నది 'సిటాడెల్' ప్రాజెక్ట్ కోసమట. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఆల్రెడీ ముంబైలో షూటింగ్ కూడా మొదలైంది. అయితే తన పాత్రలో భాగంగా సమంత యాక్షన్ సీన్స్ చేయాల్సి ఉందట. అందుకే బాక్సింగ్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నారని టాక్. సో.. సమంత బ్యాక్ ఇన్ టు ది యాక్షన్ అని నెటిజన్లు అంటున్నారు.

సినిమానే మనల్ని ఎంచుకుంటుంది - హరీశ్ శంకర్

''మంచి చిత్రం ఎంచుకున్నామంటూ చాలా మంది అంటారు. కానీ, సినిమా అంటే ప్యాషన్ ఉన్నవాళ్లనే ఆ సినిమా ఎంపిక చేసుకుంటుంది.. అంతేకానీ, సినిమాను మనం సెలెక్ట్ చేసుకోం'' అని డైరెక్టర్ హరీశ్ శంకర్ అన్నారు. ప్రణవ చంద్ర, మాళవిక సతీషన్ జంటగా శివ నాగేశ్వరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దోచేవారెవరురా'. బొడ్డు కోటేశ్వరరావు నిర్మించిన ఈ సినిమా మార్చి 11న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హరీశ్ శంకర్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఎన్నో మంచి సినిమాలు తీసిన శివ నాగేశ్వరావుగారు ఇప్పుడు 'దోచేవారెవరురా' వంటి మంచి కథతో వస్తున్నారు. ట్రైలర్, పాటలు బాగున్నాయి.. ఈ సినిమా పెద్ద హిట్ కావాలి'' అన్నారు. ''కథ మొత్తం డబ్బు చుట్టూ తిరుగు తుంది. కుటుంబమంతా చూడదగ్గ సినిమా ఇది'' అన్నారు శివ నాగేశ్వరావు. ''దోచేవారెవరురా'లో మంచి వినోదం ఉంటుంది'' అన్నారు బొడ్డు కోటేశ్వర రావు.



ప్రణవ చంద్ర, మాళవిక, హరీశ్, శివ నాగేశ్వరరావు

మంచి సినిమా చేశాం – దిల్ రాజు



మామిడి హరికృష్ణ, 'దిల్'రాజు

ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'బలగం'. వేణు ఎల్దండి దర్శకత్వం వహించారు. 'దిల్' రాజు ప్రొడక్షన్స్, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ చిత్రం మార్చి 3న రిలీజ్ కానుంది. ఈ మూవీలోని 'బలరామ నర్సయ్యో..' అనే పాటను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ రిలీజ్ చేసి, మాట్లాడుతూ–''చావు అనే అశుభ అంశాన్ని తీసుకుని శుభాల వైపు తీసుకువెళ్లే గొప్ప ప్రయోగమే 'బలగం'' అన్నారు. ''బలగం' చాలా మంచి సినిమా'' అన్నారు 'దిల్' రాజు.''మరిన్ని ప్రయోగాత్మక సినిమాలు రావాలంటే ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి'' అన్నారు ప్రియదర్శి.

కామెడీ డ్రామా



'వెన్నెల' కిషోర్, సునీల్

సునీల్, శ్రీనివాస్ రెడ్డి, 'వెన్నెల' కిషోర్, ధనరాజ్, 'బిగ్‌బాస్' ఫేమ్ వాసంతి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'భువన విజయమ్'. ఈ చిత్రం ద్వారా యలమంద చరణ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. కిరణ్, వీఎస్కే నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని దర్శకుడు వేణు ఊడుగుల విడుదల చేశారు. ''కామెడీ డ్రామాగా రూపొందిన చిత్రం 'భువన విజయమ్'. వేసవిలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: లక్ష్మి, సంగీతం: శేఖర్ చంద్ర.

బిగ్ స్నేక్ రెడీ



యేలూరు సురేంద్ర రెడ్డి

చైనాలో ఘన విజయం సాధించిన 'బిగ్ స్నేక్ కింగ్' చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. లిక్విన్ లుఓ, వాంగ్ జియోలాంగ్, వెంకీ జాఓ, గాఓ షెంగ్యు కీలక పాత్రల్లో గుఓ మింగర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బిగ్ స్నేక్ కింగ్'. గత ఏడాది మే 11న చైనాలో విడుదలైన ఈ చిత్రం మార్చి 3న ఇండియాలో విడుదల కానుంది. బుద్ధ భగవాన్ పతాకంపై యేలూరు సురేంద్ర రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''బిగ్ స్నేక్ కింగ్' సిరీస్‌లో చైనా వాళ్లు దాదాపు 10 సినిమాలు చేశారు.. వాటిని కూడా నెలకి ఒకటి చొప్పున తెలుగులో రిలీజ్ చేస్తాను'' అన్నారు.

యాక్షన్ థ్రిల్లర్



స్మిరితరాణి, విన్ను

విన్ను మద్దిపాటి, స్మిరితరాణి బోర జంటగా సాయిశివన్ జంపాన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గ్రంథాలయం'. ఎస్.వైష్ణవి శ్రీ నిర్మించిన ఈ సినిమా మార్చి 3న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకులు బి.గోపాల్, కాశీ విశ్వనాథ్, నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ విడుదల చేశారు. ''కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ట్రైలర్ రిలీజయ్యాక సినిమాపై అంచనాలు పెరిగాయి. డిస్ట్రిబ్యూటర్స్ గ్రూపులలో మా ట్రైలర్ వైరల్‌గా మారింది'' అన్నారు సాయిశివన్ జంపాన, ఎస్.వైష్ణవి శ్రీ.

విజయంతో ముగించిన హైదరాబాద్ ఎఫ్‌సీ

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) లీగ్ దశను హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) విజయంతో ముగించింది. ఆదివారం కొచ్చిలో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 1–0 గోల్ తేడాతో కేరళ బ్లాస్టర్స్‌ను ఓడించింది. 29వ నిమిషంలో చేసిన ఏకైక గోల్‌తో బోర్హా హెరెరా హైదరాబాద్‌ను గెలిపించాడు. లీగ్ దశలో ఆడిన 20 మ్యాచ్‌లలో 13 గెలిచి 4 మ్యాచ్‌లు ఓడిన హైదరాబాద్ మరో 3 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. మొత్తం 42 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన టీమ్ ఇప్పటికే 'ప్లే ఆఫ్స్' దశకు అర్హత సాధించింది. లీగ్ దశలో 46 పాయింట్లతో ముంబై సిటీ ఎఫ్‌సీ అగ్రస్థానంలో నిలిచింది. మార్చి 4న కోల్‌కతాలో మోహన్‌బగాన్, ఒడిషా ఎఫ్‌సీ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో హైదరాబాద్ రెండో సెమీఫైనల్ (తొలి అంచె)లో తలపడుతుంది. ఈ మ్యాచ్ మార్చి 9న హైదరాబాద్‌లోనే జరుగుతుంది. మార్చి 13న రెండో సెమీఫైనల్ (రెండో అంచె) మ్యాచ్ ప్రత్యర్థి వేదికపై జరుగుతుంది.



ఆసీస్ అమ్మాయిల 'సిక్సర్'

ఎదురే లేని ప్రదర్శనతో, ఓటమెరుగని జైత్రయాత్రతో కంగారూ సేన ఆరో సారి విశ్వ విజేతగా నిలిచింది. అన్ని రంగాల్లో రాణించిన ఆస్ట్రేలియా అమ్మాయిలు ఈ టి20 ప్రపంచకప్‌ను కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. సఫారీ 'తొలిసారి' ఫైనల్ చేరిన మురిపెం రన్నరప్‌గానే ముగిసింది. సొంతగడ్డపై తమ మద్దతుదారుల మధ్య బౌలింగ్‌లో ఆకట్టుకున్న దక్షిణాఫ్రికా... బ్యాటింగ్ వైఫల్యంతో ప్రపంచకప్ కలను సాకారం చేసుకోలేకపోయింది.

- ఆరో సారి టి20 ప్రపంచకప్ కైవసం
- ఫైనల్లో 19 పరుగులతో దక్షిణాఫ్రికాపై గెలుపు
- బెత్ మూనీ అర్ధ సెంచరీ



కేప్‌టౌన్: ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు మరో 'హ్యాట్రిక్'తో టి20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. 2010, 2012, 2014లలో వరుసగా మూడు సార్లు విశ్వవిజేతగా నిలిచిన ఆసీస్... 2016 మెగా ఈవెంట్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మళ్లీ 2018, 2020, 2023లలో ప్రపంచకప్‌ల హ్యాట్రిక్ నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో మెగ్ లానింగ్ సేన 19 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై నెగ్గింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెత్ మూనీ (53 బంతుల్లో 74 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు అర్ధ సెంచరీ సాధించగా, ఆష్లే గార్డ్‌నర్ (21 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడుగా ఆడింది. సఫారీ బౌలర్లలో షబ్నిమ్ ఇస్మాయిల్ (2/26), మరిజన్ కాప్ (2/35) కంగారు పెట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 137 పరుగులే చేసింది. ఓపెనర్ లారా వోల్‌వార్ట్ (48 బంతుల్లో 61; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాటం వృథా అయ్యింది. టోర్నీలో 110 పరుగులు చేయడంతో పాటు 10 వికెట్లు తీసిన ఆసీస్ ఆల్‌రౌండర్ గార్డ్‌నర్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది.

బెత్ మూనీ సూపర్ ఇన్నింగ్స్

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో గొప్ప మెరుపులేమీ లేవు. కానీ ఒక్క బ్యాటర్ మూనీ ఆస్ట్రేలియాను 20 ఓవర్ల పాటు నడిపించింది. ఓపెనర్‌గా క్రీజులోకి వచ్చిన ఆమె కడదాకా క్రీజులో నిలిచింది. పిచ్ నెమ్మదించిన సమయంలో... ప్రత్యర్థి సీమర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తున్న తరుణంలో వికెట్‌ను కాపాడుకొని... కష్టమైనా సరే పరుగుల్ని సాధించిపెట్టింది. మరో ఓపెనర్ అలీసా హీలీ (20 బంతుల్లో 18; 3 ఫోర్లు) పవర్ ప్లే వరకైనా నిలువలేదు. అయితే టాపార్డర్‌లో ఆష్లే గార్డ్‌నర్‌తో మూనీ భాగస్వామ్యం జట్టు ఇన్నింగ్స్‌కు కీలకంగా మారింది. ఇద్దరు రెండో వికెట్‌కు 46 పరుగులే జత చేసినప్పటికీ... తర్వాత పిచ్ పరిస్థితుల దృష్ట్యా అదే మెరుగైన భాగస్వామ్యం అని చెప్పొచ్చు. తర్వాత గ్రేస్ హారిస్ (10), కెప్టెన్ మెగ్ లానింగ్ (10), ఎలైస్ పెరీ (7), వేర్‌హమ్ (0) సులువుగానే దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి పడిపోయారు. షబ్నిమ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో తొలి రెండు బంతుల్ని మూని 6, 4గా బాదింది. అయితే మూడో బంతికి ఒక్క పరుగు మాత్రమే రాగా... వరుస బంతుల్లో షబ్నిమ్ రెండు వికెట్లతో ఆసీస్‌ను కట్టడి చేసింది.



రాణించిన వోల్‌వార్ట్

సొంతగడ్డపై కాస్త కష్టపడితే ఛేదించే లక్ష్యమే ఎదురుగా ఉన్నప్పటికీ దక్షిణాఫ్రికా ఆ పని చేయలేకపోయింది. ఆసీస్ చేసింది పెద్ద స్కోరేం కాకపోవడంతో బౌలర్లు తొలి ఓవర్‌నుంచే పట్టుబిగించారు. దీంతో తొలి 5 ఓవర్లలో సఫారీ వికెట్ నష్టానికి 17 పరుగులే చేసింది. ఓపెనర్ లారా వోల్‌వర్ట్ ధాటిగా ఆడటంతో కుదుట పడుతున్న దక్షిణాఫ్రికాకు మరో బ్యాటర్ సహకారం లేకపోవడంతో ప్రపంచకప్‌నే మూల్యంగా చెల్లించుకుంది. టాపార్డర్‌లో బ్రిట్స్ (10), మరిజన్ కప్ (11) సహా, మిడిలార్డర్‌లో కెప్టెన్ సునే లూస్ (2), నదిన్ డి క్లెర్క్ (8), అనెకె బాస్చ్ (1) ఆసీస్ బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోయారు. క్లొయె ట్రియాన్ (23 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్)లాంటి బ్యాటర్ ఇంకొక్కరు జత యినా సఫారీ కొత్త చరిత్ర సృష్టించేది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలీసా హీలీ (సి) డిక్లెర్క్ (బి) మరిజన్ 18; బెత్ మూనీ నాటౌట్ 74; ఆష్లే గార్డ్‌నర్ (సి) లూస్ (బి) ట్రియాన్ 29; గ్రేస్ (బి) ఎమ్‌లబా 10; మెగ్ లానింగ్ (సి) ట్రియాన్ (బి) మరిజన్ 10; ఎలైస్ పెరీ (సి) బ్రిట్స్ (బి) షబ్నిమ్ 7; జార్జియా (బి) షబ్నిమ్ 0; తాహ్లియా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 156. **వికెట్ల పతనం:** 1–36, 2–82, 3–103, 4–122, 5–155, 6–155. **బౌలింగ్:** ఎమ్‌లబా 3–0–24–1, షబ్నిమ్ 4–1–26–2, మరిజన్ కాప్ 4–0–35–2, అయబొంగ ఖాకా 4–0–27–0, నదిన్ డిక్లెర్క్ 3–0–27–0, క్లోయె ట్రియాన్ 2–0–15–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లారా వోల్‌వార్ట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షట్ 61; బ్రిట్స్ (సి) మెక్‌గ్రాత్ (బి) బ్రౌన్ 10; మరిజన్ (సి) బ్రౌన్ (బి) గార్డ్‌నర్ 11; లూస్ రనౌట్ 2; ట్రియాన్ (బి) జొనసెన్ 25; డి క్లెర్క్ నాటౌట్ 8; బాష్ రనౌట్ 1; జాఫ్త నాటౌట్ 9; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 137. **వికెట్ల పతనం:** 1–17, 2–46, 3–54, 4–109, 5–121, 6–122. **బౌలింగ్:** మేగన్ షట్ 4–0–23–1, ఆష్లే గార్డ్‌నెర్ 4–0–20–1, డార్సి బ్రౌన్ 4–0–25–1, పెరీ 1–0–5–0, జెస్ జొనసెన్ 3–0–21–1, జార్జియా 2–0–21–0, తాహ్లియా మెక్‌గ్రాత్ 2–0–17–0.

సెమీఫైనల్లో శ్రీకాంత్



పుణే: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ సెమీస్‌లోకి అడుగు పెట్టాడు. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో రెండో సీడ్ శ్రీకాంత్ 21–10, 18–21, 21–16 స్కోరుతో కార్తికేయ కుమార్‌పై విజయం సాధించాడు. ఇతర పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, హర్షీల్ దాని, మిథున్ మంజునాథ్ కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల డబుల్స్‌లో టాప్ సీడ్ గాయత్రి గోపీచంద్ – ట్రెసా జాలీ జంట సెమీస్‌లోకి అడుగు పెట్టింది. క్వార్టర్స్‌లో గాయత్రి–ట్రెసా 21–16, 21–12 తేడాతో తనీషా క్రాస్టో–అశ్విని పొన్నప్పపై విజయం సాధించారు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, అస్మిత చలీహ సెమీస్ చేరుకున్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో హేమనాగేంద్ర–కనికా కన్వాల్ జోడి సెమీస్ చేరుకుంది. ఇషాన్ భట్నాగర్–తనీషా క్రాస్టో జంట వీరికి వాకోవర్ ఇచ్చింది.

న్యూజిలాండ్ 202/3



వెల్లింగ్టన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 226 పరుగుల ఆధిక్యం కోల్పోయి ఫాలో ఆన్ ఆడిన ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మ్యాచ్ మూడో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి కివీస్ 3 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (172 బంతుల్లో 83; 11 ఫోర్లు), డెవాన్ కాన్వే (155 బంతుల్లో 61; 6 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 149 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. క్రీజ్‌లో కేన్ విలియమ్సన్ (25 బ్యాటింగ్), నికోల్స్ (18 బ్యాటింగ్) ఉన్నారు. న్యూజిలాండ్ మరో 24 పరుగులు వెనుకబడి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 138/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 209 పరుగులకు ఆలౌటైంది. టిమ్ సౌతీ (49 బంతుల్లో 73; 5 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగాడు.

భారత బాక్సర్లకు రజతాలు

సోఫియా: స్ట్రాండ్జా మెమోరియల్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు అనామిక, అనుపమ, గోవింద్ కుమార్ సహాని రజత పతకాలు సాధించారు. మహిళల 50 కేజీల ఫైనల్లో జాతీయ చాంపియన్ అనామిక 1–4తో చైనాకు చెందిన హు మెయి చేతిలో ఓడింది. పురుషుల 48 కేజీల తుదిపోరులో గోవింద్ కుమార్ 1–4తో షోదియోర్జన్ మెలికుజీవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో పరాజయం చవిచూశాడు. మహిళల 81 కేజీల ఫైనల్లో అనుపమ 0–5తో ఆస్ట్రేలియన్ బాక్సర్ ఎమ్మా సూ గ్రీన్‌ట్రీ చేతిలో ఓడిపోయింది. ఈ టోర్నీలో భారత్ మొత్తం ఎనిమిది పతకాలు సాధించింది. ఇందులో మూడు రజతాలు కాగా... ఐదు కాంస్య పతకాలున్నాయి. పురుషుల కేటగిరీలో బిశ్వామిత్ర చొంగ్తమ్ (51 కేజీలు), సచిన్ (54 కేజీలు), మహిళల విభాగంలో కలైవాణి (48 కేజీలు), శ్రుతి యాదవ్ (70 కేజీలు), మోనిక (ప్లస్ 81 కేజీలు) కాంస్యాలు గెలిచారు.



జాతీయ హాకీ విజేత మధ్యప్రదేశ్

సాక్షి, కాకినాడ: జాతీయ మహిళల సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో మధ్యప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో మధ్యప్రదేశ్ 5–1 గోల్స్ తేడాతో మహారాష్ట్రను చిత్తు చేసింది. మధ్యప్రదేశ్ తరఫున దీక్షా తివారి (2వ నిమిషం, 4వ ని.), మన్‌మీత్ కౌర్ (38వ ని.), ప్రీతి దూబే (42వ ని.), ఐశ్వర్య చవాన్ (42వ ని.) గోల్స్ సాధించగా... మహారాష్ట్ర జట్టునుంచి లాల్‌రిండికి (25వ ని.) ఏకైక గోల్ చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రతిభ ఆర్యకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మరో వైపు ప్లే ఆఫ్ పోరులో హరియాణాను 2–1తో ఓడించిన జార్ఖండ్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-ఈపీఎఫ్‌వోలో 557 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, ఏపీఎఫ్‌సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 557
- **పోస్టుల వివరాలు:** ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్–418, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్–159.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్ నుంచి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ఈవో/ఏవో పోస్టులకు 30 ఏళ్లు, ఏపీఎఫ్‌సీ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, అనంతపురం, హైదరాబాద్.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2023.
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం.. ప్రభుత్వ గుర్తింపు పొందిన వివిధ జర్నలిజం కోర్సుల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు- అర్హతలు

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం(పీజీడీజే): కోర్సు వ్యవధి 12 నెలలు, కనీస విద్యార్హత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **డిప్లొమా ఇన్ జర్నలిజం(డీజే):** కోర్సు వ్యవధి ఆరు నెలలు, కనీస విద్యార్హత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం(డీటీవీజే):** కోర్సు వ్యవధి ఆరు నెలలు, కనీస విద్యార్హత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం(సీజే):** కోర్సు వ్యవధి మూడు నెలలు, కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.

ముఖ్య సమాచారం

- ఈ కోర్సులను రెగ్యులర్‌గాను, కరస్పాండెన్స్(దూర విద్య) విధానంలోనూ చేయవచ్చు. ఆన్‌లైన్ తరగతుల సౌకర్యం ఉంది. ఇంటి దగ్గర నుంచే పాఠ్యాంశాలను లైవ్‌లో వినవచ్చు.
- తెలుగు లేదా ఇంగ్లిష్‌ను బోధనా మాధ్యమంగా ఎంపిక చేసుకోవచ్చు.
- ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి.
- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందడానికి చివరి తేది:** 07.03.2023
- **అడ్మిషన్లు పొందడానికి చివరి తేది:**13.03.2023
- **వెబ్‌సైట్:** www.apcj.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, వడోదరలో 546 పోస్టులు

గుజరాత్‌లోని వడోదరలో బ్యాంక్ ఆఫ్ బరోడా.. ఒప్పంద ప్రాతిపదికన వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 546
- **పోస్టుల వివరాలు:** వెల్త్ మేనేజ్‌మెంట్–24, ప్రైవేట్ బ్యాంకింగ్–17, అక్విజిషన్–505. **వెల్త్ మేనేజ్‌మెంట్: విభాగాలు:** ఎన్ఆర్ఐ వెల్త్ ప్రొడక్ట్స్ మేనేజర్, గ్రూప్ సేల్స్ హెడ్, వెల్త్ స్ట్రాటజిస్ట్, హెడ్ వెల్త్–టెక్నాలజీ, ప్రొడక్ట్ మేనేజర్(ట్రేడ్ అండ్ ఫారెక్స్), ట్రేడ్ రెగ్యులేషన్ సీనియర్ మేనేజర్. **ప్రైవేట్ బ్యాంకింగ్: విభాగా లు:** రేడియన్స్ ప్రైవేట్ సేల్స్ హెడ్,ప్రొడక్ట్ హెడ్–ప్రైవేట్ బ్యాంకింగ్, ప్రైవేట్ బ్యాంకర్. **అక్విజిషన్: విభాగాలు:** అక్విజిషన్ ఆఫీసర్, నేషనల్ అక్విజిషన్ హెడ్, రీజనల్ అక్విజిషన్ సేల్స్ హెడ్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీ(గ్రాడ్యుయేషన్)ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** అక్విజషన్ విభాగానికి సంబంధించిన పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 21 నుంచి 28 ఏళ్లు ఉండాలి. ఇతర పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 24 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్/ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.03.2023.
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

కంటోన్మెంట్ బోర్డ్, ఝాన్సీలో 17 ఉద్యోగాలు

ఝాన్సీలోని కంటోన్మెంట్ బోర్డ్.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
- **పోస్టుల వివరాలు:**అసిస్టెంట్ ఇంజనీర్,అసిస్టెంట్ టీచర్, జూనియర్ అసిస్టెంట్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి/ఇంటర్మీడియట్/బ్యాచిలర్స్ డిగ్రీ/బీటీసీ/బీఈడీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** కాంపిటేటివ్ ఎగ్జామినేషన్/స్కిల్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** రాతపరీక్ష 100 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు 1 మార్కు ఉంటుంది. రుణాత్మక మార్కులు ఉండవు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.03.2023.
- **వెబ్‌సైట్:** jhansi.cantt.gov.in

ఫార్మసీలో బెస్ట్ పీజీకి.. జీప్యాట్!

ఫార్మసీ రంగం శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఈ రంగంలో ఫార్మసీ నిపుణుల సేవలు ఎంతో కీలకం. ఎం.ఫార్మసీతో ఫార్మా రంగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. బీఫార్మసీ ఉత్తీర్ణులు ఉన్నత విద్య ఎంఫార్మసీలో చేరేందుకు మార్గం.. జీప్యాట్! ఈ ఎంట్రన్స్‌లో ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయిలో నైపర్ సహా పలు ప్రముఖ ఫార్మా ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంఫార్మసీలో చేరేందుకు అవకాశం లభిస్తుంది. ఇటీవల జీప్యాట్-2023 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జీప్యాట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు మార్గాలు, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

» జీప్యాట్ 2023 నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్‌టీఏ
» మాస్టర్ ఆఫ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి జీప్యాట్
» ఎం.ఫార్మసీ పూర్తయితే విస్తృత ఉద్యోగావకాశాలు
» జీప్యాట్ ద్వారా ప్రవేశం పొందితే స్కాలర్‌షిప్ సదుపాయం

బీ.ఫార్మసీ.. విద్యార్థుల నుంచి ఆదరణ పొందుతున్న కోర్సుల్లో ఒకటి. ముఖ్యంగా బైపీసీ విద్యార్థులకు చక్కటి ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. బీఫార్మసీ తర్వాత తమకు ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌లో ఎం.ఫార్మసీ పూర్తి చేస్తే.. ఉన్నత అవకాశాలు అందుకోవచ్చు. జాతీయ స్థాయిలోని పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎం ఫార్మసీలో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎంట్రన్స్.. గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్). జీప్యాట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది.

జీప్యాట్‌తో ప్రయోజనాలు

- జీప్యాట్ స్కోర్ ఆధారంగా దేశంలోని 800కు పైగా ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎం ఫార్మసీలో ప్రవేశం పొందొచ్చు. • దేశంలో ఫార్మా విద్యారంగంలో మేటి సంస్థలుగా పేరొందిన నైపర్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫార్మా ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)ల్లో సీటు పొందాలంటే.. తొలుత జీప్యాట్‌లో అర్హత సాధించాలి. ఆ తర్వాత నైపర్‌లు నిర్వహించే నైపర్ జేఈఈలో ర్యాంకు సొంతం చేసుకోవాలి. • జీప్యాట్ ఉత్తీర్ణతతో ఎం.ఫార్మసీలో చేరితే నెలకు రూ.12,400 స్కాలర్‌షిప్ అందుకునే సదుపాయం ఉంది. • రాష్ట్రాల పరిధిలో ఎం.ఫార్మసీ సీట్ల భర్తీలో ముందుగా జీప్యాట్ ఉత్తీర్ణులకే ప్రాధాన్యం లభిస్తుంది.
- **అర్హత:** నాలుగేళ్ల బీఫార్మసీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 10+2+ 4 విధానంలో బీఫార్మసీ పూర్తి చేసుకోవాలి. 2023లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

4 విభాగాలు.. 500 మార్కులు

- ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఎంతో కీలకంగా నిలుస్తున్న జీప్యాట్‌ను ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్ట్ టెస్ట్‌గా నిర్వహిస్తున్నారు. మొత్తం నాలుగు విభాగాల్లో.. 500 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, అనుబంధ సబ్జెక్ట్‌లు 38 ప్రశ్నలు–152 మార్కులు; ఫార్మాస్యుటిక్స్ అనుబంధ సబ్జెక్ట్‌లు 38 ప్రశ్నలు–152 మార్కులు; ఫార్మకోగ్నసీ అనుబంధ సబ్జెక్టులు 10 ప్రశ్నలు–40 మార్కులు; ఫార్మకాలజీ అనుబంధ సబ్జెక్ట్‌లు 28 ప్రశ్నలు–112 మార్కులు; ఇతర సబ్జెక్టులు 11 ప్రశ్నలు–44 మార్కులకు.. ఇలా మొత్తం 125 ప్రశ్నలు–500 మార్కులకు జీప్యాట్ జరుగుతుంది. • ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్(ఒక మార్కు) నిబంధన అమల్లో ఉంది. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- పరీక్షను నిర్దేశిత తేదీలో రెండు సెషన్స్‌లో (ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు) నిర్వహిస్తారు.

మలి దశలో ఇలా

జీప్యాట్‌లో స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించే ఇన్‌స్టిట్యూట్‌లు మలి దశలో.. ప్రత్యేక ప్రవేశ ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. జీప్యాట్ అర్హతతో ఎంఫార్మసీలో ప్రవేశానికి ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు ఈ స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి నేరుగా అడ్మిషన్ కల్పిస్తాయి. మరికొన్ని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు మలి దశలో గ్రూప్ డిస్కషన్,పర్సనల్ ఇంటర్వ్యూలను కూడా నిర్వహిస్తున్నాయి. వాటిలోనూ చూపిన ప్రతిభ ఆధారంగా జీప్యాట్ స్కోర్‌కు వెయిటేజీ కల్పి సీట్లు కల్పిస్తున్నాయి.

విజయం సాధించాలంటే

జాతీయ స్థాయిలో ఎంతో పోటీ నెలకొంటున్న జీప్యాట్‌లో విజయానికి అభ్యర్థులు విభాగాల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ

ఈ విభాగంలో ప్రశ్నలు ప్రాథమికంగా ఉంటాయి. కాన్సెప్టులపై అవగాహనతో సదరు ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు. ముఖ్యంగా ఇందులో కర్బన రసాయన శాస్త్రంపై దృష్టిపెట్టాలి. ఎలక్ట్రోఫిలిక్, న్యూక్లియోఫిలిక్ రియాక్షన్స్, ఇంటర్మీడియెట్ రియాక్షన్స్‌ను అధ్యయనం చేయాలి. ఎస్ఏఆర్ ఆఫ్ స్టెరాయిడ్స్, నామ్‌నిక్లేచర్ అండ్ కెమికల్ మొయిటీ ఆఫ్ ది మెడికల్ డ్రగ్స్ గురించి అధ్యయనం చేయాలి.

ఫార్మాస్యుటిక్స్

ఇందులో రాణించాలంటే.. రసాయనాలు, టాబ్లెట్ల సూత్రీకరణతో మొదలుపెట్టాలి. సూక్ష్మజీవులను హతమార్చే(స్టెరిలైజేషన్) నైపుణ్యాలు, న్యూమరికల్ ప్రాబ్లమ్స్‌పై ప్రధానంగా దృష్టిపెట్టాలి. సర్ఫేస్ అండ్ ఇంటర్ ఫేషియల్ ఫినామినా, రియాలజీ, కైనటిక్స్ అండ్ డ్రగ్స్ స్టెబిలిటీ, బయో ఫార్మాటిక్స్ అండ్ ఫార్మకోకైనటిక్స్ అంశాలను ప్రత్యేక దృష్టితో చదవాలి.



ఫార్మకోగ్నసీ

పూర్తిగా థియరీ ఆధారిత ప్రశ్నలతో ఉండే ఫార్మకోగ్నసీలో రాణించాలంటే.. అభ్యర్థులు పాఠ్యాంశాలను క్షుణ్నంగా చదివి షార్ట్ నోట్స్ రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల చివరి దశ ప్రిపరేషన్‌లో ప్రయోజనం ఉంటుంది. ఆయా ఔషధాలకు సంబంధించిన భావనలు, విధానాలు, ప్రభావాలు, ఉపయోగాల గురించి అధ్యయనం చేయాలి. ముఖ్యంగా గ్లైకోసైడ్స్, ఆల్కలాయిడ్స్, వాలటైల్ ఆయిల్స్, రెసిన్స్, టానిన్స్, కార్బొహైడ్రేట్స్, టిష్యూ కల్చర్, హెర్బల్ డ్రగ్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

ఫార్మకాలజీ

జీప్యాట్‌లో ఎక్కువ వెయిటేజీ ఉన్న విభాగంగా ఫార్మకాలజీని పేర్కొనొచ్చు. ఇందులో డ్రగ్ ఇంటరాక్షన్, మెకానిజమ్స్, డ్రగ్స్–సైడ్ ఎఫెక్ట్స్(బాడీ పెయిన్స్ వంటి సాధారణ సైడ్ ఎఫెక్ట్స్ కాకుండా)ను అధ్యయనం చేయాలి. డ్రగ్స్‌ను సంక్షిప్త నామాల్లో గుర్తుంచుకొనేందుకు డ్రగ్స్ వర్గీకరణ పాఠ్యాంశం ఉపయోగపడుతుంది. అంకాలజీ(కీమోథెరపీ డ్రగ్స్, నూతన టెక్నాలజీలు తదితరం), న్యూరో ఫార్మకాలజీ, అరుదైన వ్యాధులు, కార్డియోవస్కులర్ అండ్ బ్లడ్ ప్రొడక్ట్స్ తదితర ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

సమస్యల సాధన

- ఇతర సబ్జెక్ట్‌ల విషయంలో ఫార్మాస్యూటికల్ అనాలసిస్‌కు సంబంధించి.. భావనలను అర్థం చేసుకుంటూ చదవాలి. అదేవిధంగా వీలైనన్ని ఎక్కువ సమస్యలు సాధించాలి. ఫార్ములాలను నోట్ చేసుకోవాలి. యూవీ, ఐఆర్, ఎన్ఎంఆర్, మాస్ స్పెక్ట్రోస్కోపీ,క్రొమాటోగ్రఫీ, పోలరోగ్రఫీ అండ్ పొలారిమెట్రీ, ఫ్లేమ్ ఫోటోమీటర్, కండక్టోమెట్రీ, ఆంపెరోమెట్రీ, పొటెన్షియోమెట్రీ అంశాలపై క్షుణ్నమైన అవగాహన ఏర్పరచుకోవాలి. అంతేకాకుండా స్పెక్ట్రోస్కోపీ–మాస్ స్పెక్ట్రోస్కోపీ, యూవీ, ఐఆర్, ఎన్ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీ చాప్టర్లను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.
- క్లాసిఫికేషన్ ఆఫ్ డ్రగ్స్, షెడ్యూల్స్ ఆఫ్ డ్రగ్స్ చాప్టర్లకు వేర్వేరు నోట్సు రాసుకోవాలి.
- జీప్యాట్‌లో న్యూమరికల్ ప్రాబ్లమ్స్ సంఖ్య పెరుగుతున్న విషయాన్ని గుర్తించి ఈ తరహా ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యంగా బయో ఫార్మాస్యుటిక్స్, డిప్రెషన్ ఇన్ ఫ్రీజింగ్ పాయింట్, అలిగేషన్ మెథడ్, డోస్ ఆన్ ది బేసిస్ ఆఫ్ బాడీ వెయిట్ అండ్ ఏజ్ టాపిక్స్‌పై ప్రాబ్లమ్స్ ఎక్కువగా అడుగుతున్నారు.
- గత ప్రశ్నపత్రాలు, మాక్ టెస్టులకు హాజరవ్వడం ద్వారా జీప్యాట్ ప్యాట్రన్‌పై అవగాహన ఏర్పడుతుంది. వెయిటేజీ, ప్రశ్నల తీరు తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

350కు పైగా లక్ష్యంగా

మొత్తం 500 మార్కులకు నిర్వహించే జీప్యాట్‌లో.. 350కు పైగా స్కోర్ లక్ష్యంగా ప్రిపరేషన్ సాగించాలి. ఫలితంగా.. బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సీటు సొంతం చేసుకునే అవకాశాలు మెరుగవుతాయి. గత మూడు, నాలుగేళ్లుగా ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో సీటు ఖరారు చేసుకున్న అభ్యర్థుల గణాంకాలే ఇందుకు నిదర్శనం. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులు 125 నుంచి 200 మధ్యలో మార్కులు సాధన లక్ష్యంగా కృషి చేస్తే సీటు లభించే వీలుంటుంది.

ఎంఫార్మసీ.. క్రేజీ స్పెషలైజేషన్లు

ప్రస్తుత పరిస్థితుల్లో ఫార్మకాలజీ, ఫార్మాస్యుటిక్స్, టాక్సికాలజీ, ఫార్మా మేనేజ్‌మెంట్, ఫార్మకోగ్నసీ స్పెషలైజేషన్‌లు పూర్తి చేస్తే ఎంఫార్మసీ తర్వాత ఉజ్వల అవకాశాలు అందుకోవచ్చు. కోర్సు పూర్తి చేసుకున్నాక డ్రగ్ డిస్కవరీ సంస్థలు, డ్రగ్ ఫార్ములేషన్ కంపెనీలు, బల్క్ డ్రగ్ ప్రొడక్షన్ సంస్థల్లో సీనియర్ లెవల్‌లో ఉద్యోగాలు లభిస్తాయి. జీప్యాట్‌తో పీజీ పూర్తి చేసిన తర్వాత పీహెచ్‌డీ వైపు అడుగులు వేస్తే పరిశోధన రంగంలో భవిష్యత్తు మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మార్చి 6, 2023
- **దరఖాస్తు సవరణ అవకాశం:**మార్చి 7–9,2023
- **జీప్యాట్ పరీక్ష తేదీ:** మే రెండో వారంలో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- **వెబ్‌సైట్:** https://gpat.nta.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	142	59,464
నిఫ్టీ ▽	45	17,466

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,395	▽	195
డోజోన్స్	32,817	▽	337
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,879	▽	29
డాక్స్	15,210	▽	226
షాంఘై	3,267	▽	20
నికాయ్	27,453	△	349

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.93	83.60
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	97.89	101.22
€	యూరో	ఒకటి	86.22	89.31
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	60.48	62.43
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.34	57.70
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.68	62.64
SAR	సౌదీ రియాల్	[illegible]	21.07	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.63	23.43
¥	చైనా యువాన్	[illegible]	10.80	12.87

విశ్రాంత జీవనం.. హాయిగా..!



- తొలి ప్రాధాన్యం 'రిటైర్మెంట్' ప్లానింగ్...
- వృద్ధాప్యంలో 30 ఏళ్లపాటు జీవన అవసరాలు..
- ఆర్జన మొదలైన వెంటనే పెట్టుబడి ఆరంభించాలి
- ఆలస్యం చేసిన కొద్దీ లక్ష్యానికి దూరం
- కాంపౌండింగ్ ప్రయోజనం కోల్పోవాల్సి రావచ్చు
- ఆర్థిక సలహాదారుల సూచనలు తీసుకోవాలి
- ప్రణాళిక మేరకు సాగినప్పుడే వృద్ధాప్యంలో ప్రశాంతత

ప్రజల ఆయుర్దాయం పెరుగుతోంది. గతంలో మాదిరి కాకుండా నేటి యువత ప్రైవేటు రంగంలోనే ఎక్కువగా ఉపాధి పొందుతున్నారు. లేదంటే సొంత వ్యాపారాలు, ఇతర స్వయం ఉపాధి మార్గాలతో స్థిరపడుతున్నారు. జీవించి ఉన్నంత కాలం ఉద్యోగ, వ్యాపారాలు నిర్వహించలేం. ఉద్యోగంలో అయితే 58 ఏళ్లకు దిగిపోవాల్సిందే. స్వయం ఉపాధిలోని వారికి వయో పరిమితి లేదు. అయినా కానీ ఏదో ఒక రోజు చేస్తున్న పనికి విరామం పలకాల్సిందే. శారీరక, ఆరోగ్య పరమైన మార్పులు మునుపటి మాదిరిగా పనిచేయనీయవు. కనుక వృద్ధాప్యంలో పనికి విరామం పలికిన తర్వాత జీవన అవసరాలను తీర్చుకోవడం ఎలా అన్నది ముందే ఆలోచించాలి. దీనివల్ల విశ్రాంత రోజుల్లో ప్రశాంతమైన జీవనానికి అవకాశం లభిస్తుంది. ఈ అంశంపై 'మనీ పాఠశాల' వ్యవస్థాపకులు వివేక్ లా ఏం చెబుతున్నారో చూద్దాం...

రిటైర్మెంట్ అనేది తప్పనిసరి దీర్ఘకాల ప్రణాళిక. అంతేకాదు, జీవితంలో ఖరీదైన లక్ష్యాల్లో ఇది కూడా ఒకటి. ఎందుకంటే రిటైర్మెంట్ తర్వాత మరో 20–30 ఏళ్లు జీవించాల్సి రావడం, అందుకు కావాల్సినంత నిధిని సమకూర్చుకోవడం చిన్న విషయం కాదు. దీనికి డబ్బు విలువను హరించే ద్రవ్యోల్బణ ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని ఎదుర్కొనే స్థాయిలో రిటైర్మెంట్ కోసం కేటాయింపులు చేసుకోవాలి. చేస్తున్న పనికే రిటైర్మెంట్ కానీ, మన జీవన అవసరాలకు కాదు. ఉద్యోగం/వ్యాపారం ఆగిపోయినా, మన జీవన అవసరాలను తీర్చే ఆదాయం ఆగిపోకూడదని అనుకుంటే అందుకు ముందు నుంచి తగిన ఏర్పాట్లు ఉండాలి. ఆర్జన ఆరంభించిన వెంటనే రిటర్మెంట్ ప్రణాళిక మొదలు పెట్టాలి. నిజానికి చాలా మంది యువత దీని ప్రాధాన్యాన్ని గుర్తించడం లేదు. దీంతో రిటైర్మెంట్ తర్వాత జీవితం ఎంతో మందికి సవాలుగా మారుతోంది.



వివేక్ లా
మనీ పాఠశాల వ్యవస్థాపకులు

45–55 ఏళ్లకే రిటైర్మెంట్ తీసుకుని ప్రపంచమంతా తిరిగి రావాలి? ఇది కొందరి లక్ష్యం కావచ్చు. కానీ, 60 ఏళ్లు వచ్చే నాటికి అయినా దీన్ని సాధించగలిగారా? అని ప్రశ్నిస్తే.. ఎక్కువ మంది నుంచి లేదన్నదే సమాధానం వస్తుంది. సంపాదన మొదలైన నాటి నుంచే రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్ చేయాలని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, మనలో చాలా మంది ఆర్జించే మొత్తం చెప్పుకోతగ్గ గొప్పగా ఉండదు. దీంతో పరిమిత ఆర్జన, అవసరాల నడుమ.. రిటైర్మెంట్ 60 ఏళ్లప్పుడు కదా, తర్వాత చూద్దాంలే? అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. యుక్త వయసు, ఆరోగ్యం సహకరిస్తున్న రోజుల్లోనే అలా అనుకుంటే.. వృద్ధాప్యానికి చేరువ అవుతున్న సమయంలో రిటైర్మెంట్ ఫండ్ వంటి భారీ లక్ష్యం ఎలా సాధ్యపడుతుంది? ఒక్కసారి ఆలోచించాలి. పిల్లల విద్య, వారి వివాహం, ఇతర బాధ్యతలతో రిటైర్మెంట్‌కు ముందు వరకు చాలా మంది తీరిక లేకుండా ఉంటారు. కనుక ఏ లక్ష్యాన్నీ నిర్లక్ష్యం చేయడానికి, వాయిదా

ఆర్థిక క్రమశిక్షణ

వేయడానికి లేదు. 25–30 ఏళ్ల కెరీర్‌లో రోజువారీ అవసరాల్లో ఎలాంటి రాజీ పడకుండా, రిటైర్మెంట్‌కు కావాల్సినంత నిధిని సమకూర్చుకోవడం ఎలా? ఆర్థిక ప్రణాళిక ఇందుకు మార్గం చూపుతుంది. జీవితంలో ఏవి కావాలని కోరుకుంటున్నారు? అందుకోసం ఏం చేయాలి, ఎలా చేయాలనేది? ఆర్థిక ప్రణాళిక స్పష్టం చేస్తుంది.

ఆర్థిక క్రమశిక్షణ ప్రతి ఒక్కరికీ అవసరం. కారణాలు ఏవైనా, రిటైర్మెంట్ నాటికి కావాల్సినంత నిధి సమకూర్చుకోలేకపోతే తిరిగి మునుపటి మాదిరి యువకుల్లా పనిచేయడం సాధ్యపడదు? అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలి. ఉదాహరణకు మీరు 60 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుంటారని అనుకుంటే, 90 ఏళ్ల వరకు జీవించి ఉండేట్టు అయితే కనీసం 30 ఏళ్ల అవసరాలకు సరిపడా నిధి అవసరమవుతుంది. ఇది చాలా పెద్ద లక్ష్యమే అనడంలో సందేహం లేదు. ఆరోగ్య సంరక్షణ అవసరాలు, పిల్లల విద్య, వారి వివాహాలు, వృద్ధాప్యంలో జీవన అవసరాలు, ద్రవ్యోల్బణం వల్ల పెరిగిపోయే జీవన వ్యయాలను విస్మరించడానికి లేదు. ఉదాహరణకు రిటైర్మెంట్ తర్వాత ప్రతి నెలా అవసరాలు తీర్చుకునేందుకు రూ.3 లక్షలు కావాలని అనుకుంటే.. ఏటా 7 శాతం ద్రవ్యోల్బణం అంచనా ఆధారంగా రూ.10 కోట్ల నిధిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. 35 ఏళ్ల వయసులో ఇన్వెస్ట్‌మెంట్ ఆరంభించారని అనుకుంటే.. 60 ఏళ్ల వయసు వచ్చే నాటికి మీ చేతిలో 25 ఏళ్లు మిగిలి ఉంటుంది. ఇందుకు గాను ప్రతి నెలా రూ.55,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఇది ఏటా 12% చొప్పున వృద్ధిని చూస్తుందనుకుంటే 60 ఏళ్ల నాటికి రూ.10 కోట్లు సమకూరుతుంది.

అందుకే మొదటి నెల వేతనం నుంచే రిటైర్మెంట్ నిధి సమకూర్చుకోవడానికి తొలి అడుగు పడాలి. తల్లిదండ్రులు లేదా తాతలు ప్రభుత్వరంగంలో ఉద్యోగులుగా పనిచేసి రిటైర్మెంట్ అవ్వడంతో, వారికి పెన్షన్ సదుపాయం ఉండేది. కానీ మన పరిస్థితి అలా కాదు. గ్యారంటీడ్ పెన్షన్ అనేది లేదు. ఎవరికి వారే సొంతంగా నిధిని సమకూర్చుకుని, దానిపై ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కావడంతో మన దేశంలో సగటు ద్రవ్యోల్బణం 4–6 శాతం మధ్యలో ఉంటుందని అంచనా. అంటే నేడు పాకెట్‌లో ఉన్న రూ.1000 విలువ ఏడాది తర్వాత రూ.96కు తగ్గుతుంది. ఇలా తరిగిపోయే విలువకు తగిన రక్షణగా అదనపు పెట్టుబడి అవసరం ఉంటుంది.

వాయిదా సరికాదు..

రిటైర్మెంట్ ఆలస్యం చేసిన కొద్దీ లక్ష్యం భారంగా మారుతుంది. పెట్టుబడి ఎంత ముందుగా ప్రారంభిస్తే కాంపౌండింగ్ ప్రయోజనంతో దీర్ఘకాలంలో అది మంచి నిధిగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల పెట్టుబడి ఎన్నో రెట్లు వృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఉదాహరణకు 25 ఏళ్ల వయసు నుంచే ప్రతి నెలా రూ.5,000 చొప్పున 60 ఏళ్ల వరకు ఇన్వెస్ట్ చేస్తే.. 35 ఏళ్ల కాలంలో ఎంత సమకూరుతుంది? 12% కాంపౌండింగ్ రాబడి అంచనా ప్రకారం రూ.3.24 కోట్లు సమకూరుతుంది. కేవలం నెలకు రూ.5వేలు అంత పెద్ద నిధిగా మారిందంటే అదే కాంపౌండింగ్ మహిమ. ఒకవేళ ఈ పెట్టుడిని ఒక ఏడాది ఆలస్యంగా మొదలు పెట్టారని అనుకుందాం. అంటే 26 ఏళ్లకు ఇన్వెస్ట్‌మెంట్ మొదలైతే రూ.37 లక్షలు తక్కువ మొత్తం సమకూరుతుంది. ఏడాది ఆలస్యం చేయడం వల్ల ఏర్పడిన నష్టం రూ.37 లక్షలు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకూడని, అన్నింటికంటే ముందు ఆరంభించే పెట్టుబడి ప్రణాళిక రిటైర్మెంట్ ఫండ్ కావాలి.

మిగులు లేదని చెప్పకోవద్దు..

రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్ చేయడానికి వెసులుబాటు లేదని కొందరు చెబుతుంటారు. తర్వాత వీలు చూసుకుని మొదలు పెడదామని, అనుకుంటూ ఉంటుంటారు. కానీ, విలువైన సమయాన్ని వృథా చేసిన తర్వాత ప్రతి నెలా ఎంత మొత్తం పొదుపు చేసినా అది గణనీయమైన వృద్ధిని చూడడానికి కావల్సిందన వ్యవధి ఉండదు. ఇంతకుముందు చెప్పుకున్న ఉదాహరణలోనే 25 ఏళ్లకు కాకుండా, తీరిగ్గా 45 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్‌మెటు మొదలు పెట్టారని అనుకుందాం. ప్రతి నెలా రూ.50,000 చొప్పున అక్కడి నుంచి 15 ఏళ్లు ఇన్వెస్ట్ చేస్తే.. 12 శాతం కాంపౌండింగ్ రాబడి చొప్పున 2.5 కోట్లు సమకూరుతుంది. 25 ఏళ్ల వయసులో ఆరంభించడం వల్ల కేవలం ప్రతి నెలా రూ.5వేలతోనే రిటైర్మెంట్ నాటికి రూ.3.24 కోట్లు సమకూరుతుంటే.. 20 ఏళ్లు ఆలస్యంగా మొదలు పెట్టడం వల్ల ప్రతి నెలా రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. అప్పటికీ సమకూరే మొత్తం కేవలం రూ.2.5 కోట్లు కావడాన్ని గమనించాలి.

సమకూర్చుకునేది ఎలా?

రిటైర్మెంట్ ప్రణాళికలో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి రిటైర్మెంట్ సమయం వచ్చేంత వరకు కావాల్సిన నిధిని సమకూర్చుకోవడం. రిటైర్మెంట్ తర్వాత ఆ నిధి నుంచి ప్రతి నెలా రాబడి పొందడం రెండోది అవుతుంది. 25–30 ఏళ్ల కాల వ్యవధి ఉంటుంది కనుక, పెట్టుబడులకు ఈక్విటీలను మెరుగైన మార్గంగా చూడాలి. దీర్ఘకాలంలో ఈక్విటీలను మించి కాంపౌండెడ్ రాబడులను ఇచ్చిన మెరుగైన సాధనం మరొకటి లేదనే చెప్పుకోవాలి. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లేదంటే ఎన్‌పీఎస్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇందుకోసం ఆర్థిక సలహాదారు సూచనలను తప్పకుండా తీసుకోవాల్సి వస్తుంది. నిపుణుల సాయంతో రాబడుల అంచనాలు, కాల వ్యవధి ఆధారంగా పోర్ట్‌ఫోలియోను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. రిటైర్మెంట్‌కు సమయం దగ్గర పడుతుండగా, ఈక్విటీ పెట్టుబడులను క్రమంగా ఉపసంహరించుకుని, డెట్‌కు మళ్లించుకోవడంలో ఆర్థిక సలహాదారు సాయపడతారు. తద్వారా మీ లక్ష్యాలు నెరవేరతాయి.

ఉపసంహరించుకునే దశ

మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకుంటే, రిటైర్మెంట్ తర్వాత సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ మార్గాన్ని ఎంపిక చేసుకోవచ్చు. దీనివల్ల ప్రతీ నెలా నిర్ణయించుకున్న మేర బ్యాంకు ఖాతాకు జమ అవుతుంటుంది. మిగిలిన మొత్తాన్ని ఈక్విటీల్లోనే ఉంచడం వల్ల రాబడులతో అది వృద్ధి చెందుతూ ఉంటుంది. దాంతో ద్రవ్యోల్బణ నష్టం నుంచి రిటైర్మెంట్ ఫండ్ విలువను కాపాడుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసి ఉంటే కనుక రిటైర్మెంట్ నాటికి సమకూరిన మొత్తం నుంచి 60 శాతాన్ని వెనక్కి తీసుకోవచ్చు. దీనిపై పన్ను భారం ఉండదు. అయితే ఈ మొత్తాన్ని తిరిగి మెరుగైన రాబడులను ఇచ్చే సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. అప్పుడే మిగిలిన 30 ఏళ్ల జీవన అవసరాలకు అనుగుణంగా పెట్టుబడి వృద్ధిని చేసుకోవచ్చు. ప్రణాళిక విషయంలో ఆర్థిక నిపుణుడి సేవలు తప్పకుండా తీసుకోవాలి. రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకునే విషయంలో భయం, ఊహాజనిత, ఉద్రేకాలకు అవకాశం ఇవ్వకుండా, క్రమశిక్షణతో ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. గృహ రుణం ఇంకా తీర్చాల్సి ఉన్నా లేదా తమపై కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నా.. రిటైర్మెంట్ తీసుకున్నప్పటికీ కొన్ని రకాల రక్షణ చర్యలు ఏర్పాటు చేసుకోవాలి. గృహ రుణం తీరేంత వరకు, తమ ఆదాయంపై కుటుంబ సభ్యులు ఆధారపడే కాలానికి టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. అలాగే, హెల్త్ ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.



దూసుకుపోతున్న డిజిటల్ ఎకానమీ

- జీడీపీలో 25 శాతానికి చేరుకోవచ్చు
- ప్రముఖ బ్యాంకర్ కేవీ కామత్



ముంబై: డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు మరింతగా వృద్ధి చెందుతాయని, 2028–29 ఆర్థిక సంవత్సరం చివరికి అదనంగా సమకూరే దేశ జీడీపీలో పావు వంతు వాటా ఆక్రమిస్తాయని ప్రముఖ బ్యాంకర్ కేవీ కామత్ అంచనా వేశారు. 2029 మార్చి నాటికి దేశ జీడీపీ 7 ట్రిలియన్ డాలర్ల స్థాయిని చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం మన దేశ జీడీపీలో డిజిటల్ ఆర్థిక కార్యకలాపాల వాటా 4 శాతంగా ఉంటే, చైనాలో 40 శాతంగా ఉండడం గమనార్హం. డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు అంటే డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఈ కామర్స్, డిజిటల్ చెల్లింపులు, సేవలు తదితర వాటిని కామత్ ఉదాహరణగా పేర్కొన్నారు. చైనా జీడీలో డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు 40 శాతం సమకూరుస్తున్నాయని, మన దగ్గరా ఆ స్థాయికి చేరుకోకపోవడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదని కామత్ పేర్కొన్నారు. ఇన్‌ఫ్రా అభివృద్ధి బ్యాంక్ (నాబ్‌ఫిడ్) చైర్మన్‌గా ప్రస్తుతం కామత్ పనిచేస్తున్నారు. ''ఆర్థిక వ్యవస్థకు మరిన్ని మౌలిక సదుపాయాల అవసరం ఉంది. రవాణా, ఎక్స్‌ప్రెస్‌వే, హైవేలు, ఎయిర్‌పోర్ట్‌లు, ఓడరేవులు, రైల్వే నెట్‌వర్క్‌ల పరంగా మనం ఎంతో చేయాల్సి ఉంది. రానున్న రోజుల్లో ప్రజల రవాణాకు, వస్తు రవాణాకు వీలుగా ఎన్నో ఎక్స్‌ప్రెస్ రహదారులు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, పెద్ద ఎయిర్‌పోర్ట్‌లు వస్తాయి''అని కామత్ వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-2-2023	
విశాఖ	405–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405–00
విజయవాడ	405–00
రిటైల్ ధర (డజను)	66.00
26-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	375–00
వరంగల్	377–00
రిటైల్ ధర	4.35

షేర్ల స్టాక్స్

వేదాంతా లిమిటెడ్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 395 టార్గెట్: రూ. 540

ఎందుకంటే: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ అల్యూమినియం, జింక్, లెడ్, సిల్వర్, చమురు గ్యాస్ తదితర విభిన్న విభాగాలలో కార్యకలాపాలు విస్తరించింది. ఆయా రంగాలలో వృద్ధి అవకాశాలపై ఆశావహంగా స్పందిస్తోంది. తక్కువ నగదు వ్యయాలతో పోటీలో ముందు నిలుస్తోంది. దీంతో మందగమన పరిస్థితుల్లోనూ కంపెనీ నిలదొక్కుకోగలుగుతోంది. మాతృ సంస్థ వేదాంతా రీసోర్సెస్(వీఆర్ఎల్)కున్న అత్యధిక రుణభారం సైతం కంపెనీకి అనుకూలంగా నిలుస్తోంది. 2022 సెప్టెంబర్‌కల్లా వీఆర్ఎల్ నికర రుణ భారం 8 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 66,200 కోట్లు)గా నమోదైంది. అయితే గ్రూప్ నగదు రాక(క్యాష్ ఫ్లో) కోసం ప్రధానంగా వేదాంతా లిమిటెడ్‌పైనే గరిష్టంగా ఆధారపడుతోంది. వెరసి డివిడెండ్ల రూపంలో భారీగా నగదును అందుకుంటోంది. ఈ బాటలో రానున్న రెండేళ్ల (2023–24, 2024–25)లోనూ షేరుకి రూ. 80/50 చొప్పున అందుకునే వీలున్నట్లు అంచనా వేస్తున్నాం. మొత్తంగా 40% ఈల్డ్(రిటర్న్)కు ఇది సమానం. ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికం(క్యూ3)లో రూ. 7,100 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించింది. నిపుణుల అంచనాల కంటే ఇది రూ. 400 కోట్లు తక్కువే అయినప్పటికీ.. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో పెట్టుబడి వ్యయాలకు ముందు రూ. 6,500 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లో(ఎఫ్‌సీఎఫ్) సాధించడం సానుకూల అంశం. ఇంధన వ్యయాలు తగ్గడం, మెటల్ ధరలు పుంజుకోవడంతో క్యూ4(జనవరి–మార్చి)లోనూ మెరుగైన ఇబిటా, ఎఫ్‌సీఎఫ్‌లను సాధించే వీలుంది.



వీఐపీ ఇండస్ట్రీస్ | యాంబిట్ రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 651 టార్గెట్: రూ. 870

ఎందుకంటే: బ్రాండెడ్ లగేజీ తయారీ దిగ్గజం వీఐపీ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికం(క్యూ3)లో అంచనాలకు అనుగుణంగా రూ. 530 కోట్ల ఆదాయం సాధించింది. ప్రయాణ సంబంధ ఉపఉత్పత్తులు సైతం రూపొందించే కంపెనీ వేల్యూ విభాగంలో 38 శాతం అమ్మకాలు అందుకుంది. ఇందుకు పండుగలు, పెళ్లిళ్ల సీజన్ సహకరించింది. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో ముడివ్యయాలు మందగించినప్పటికీ స్థూల మార్జిన్లు అంచనాలకంటే 1 శాతం తగ్గి 49.4 శాతానికి చేరాయి. అంచనాలకంటే తక్కువగా రూ. 61 కోట్ల నిర్వహణ లాభం ఆర్జించింది. కాగా.. 2023 మార్చికల్లా 500కుపైగా ఈబీవోల(స్టోర్లు)కు చేరుకోనున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ ఏడాది రూ. 100 కోట్ల పెట్టుబడులు వెచ్చిస్తున్నట్లు తెలియజేసింది. బిగ్‌బజార్ స్టోర్ల స్థానే 75 శాతం స్మార్ట్ బజార్ స్టోర్లు నిర్వహణలోకి వచ్చాయి. ఎంటీ చానల్ విక్రయాలు ఊపందుకునే వీలున్నట్లు యాజమాన్యం భావిస్తోంది. వృద్ధిలో ఉన్న క్యాప్రీస్ బ్రాండు అమ్మకాలపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆదాయం వృద్ధి బాటలోనే సాగుతున్నప్పటికీ మార్జిన్లు అంతగా మెరుగుపడలేదు. అయితే కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపట్ల ఆశావహంగా ఉన్నాం. జీఎస్‌టీ కారణంగా అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో ఆర్గనైజ్‌డ్(బ్రాండెడ్) లగేజీ విక్రయాలు ఊపందుకోనున్నాయి. కుటుంబ అవసరాల కోసం కాకుండా వ్యక్తిగత ప్రయాణాలకూ విడిగా బ్యాగులు కొనుగోలు చేస్తున్న వినియోగదారుని మారుతున్న అభిరుచులు సైతం బ్రాండెడ్ లగేజీకి డిమాండ్‌ను పెంచుతున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఖర్చులు తగ్గించుకుని అయినా హెల్త్ ఇన్సూరెన్స్

- మెజారిటీ ప్రజల అభిప్రాయం ఇదే
- ఆదిత్య బిర్లా హెల్త్ సర్వేలో వెల్లడి

ముంబై: అవసరమైతే ఖరీదైన కొనుగోళ్లకు దూరంగా ఉండి మరీ, హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని దేశంలో మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ నిర్వహించిన సర్వేలో 85 శాతం మంది ఇదే చెప్పారు. 19 పట్టణాల నుంచి 6,600 మంది సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. కరోనాతో అనిశ్చితి, ఆందోళనకర పరిస్థితులతో మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడినట్టు ఈ సర్వే నివేదిక పేర్కొంది. సర్వేలో పాల్గొన్న 89 శాతం మంది తమ హెల్త్ ఇన్సూరెన్స్‌లో హెల్త్ కన్సల్టేషన్ (వైద్య సలహా) కూడా భాగంగా ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కనుక మానసిక ఆరోగ్యంపై అత్యవసర అవగాహన అవసరం ఉన్నట్టు ఈ నివేదిక ప్రస్తావించింది. కరోనా తర్వాత ఆరోగ్యం, శ్రేయస్సుపై తమ అవగాహన పెరిగినట్టు 84 శాతం మంది సర్వేలో చెప్పారు. వైద్య అత్యవసరాల్లో వినియోగించుకునేందుకు వీలుగా కొంత నిధిని పక్కన పెట్టనున్నట్టు 52 శాతం మంది తెలిపారు. ఖర్చు దృష్ట్యా తాము మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించేందుకు వెనుకాడినట్టు 35 శాతం మంది వెల్లడించారు. తాము బరువు, రక్తపోటు తదితర ఆరోగ్య అంశాలను తరచూ పర్యవేక్షించుకోవడం లేదని ప్రతి ముగ్గురిలో ఒక్కరు చెప్పడం గమనార్హం. కరోనా తర్వాత ఆరోగ్యం విషయంలో ప్రజల ఆలోచన విధానం మారిందని, ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండడంతోపాటు అత్యవసర పరిస్థితుల పట్ల సన్నద్ధతను అర్థం చేసుకుంటున్నారని ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ సర్వే నివేదిక తెలియజేసింది. ''ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరాన్ని కరోనా తర్వాత ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. టెక్నాలజీ సాయంతో తాము తీసుకునే ఆహారాన్ని పర్యవేక్షించుకుంటున్నారు''అని ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ సీఈవో మయాంక్ భత్వాల్ తెలిపారు.



ఫండ్ డైరెక్ట్/రెగ్యులర్ ప్లాన్లలో తేడా ఎందుకు?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఏదైనా మ్యూచువల్ ఫండ్ పథకం రెగ్యులర్ ప్లాన్ ఎన్ఏవీ, డైరెక్ట్ ప్లాన్ ఎన్ఏవీకి భిన్నంగా ఉంటుందా? ఒకే పెట్టుబడికి ఈ రెండు ప్లాన్లలో కేటాయించే యూనిట్లలో వ్యత్యాసం ఉంటుందా? – శామ్

మీరు అడిగింది నిజమే. మ్యూచువల్ ఫండ్ రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్ల నెట్ అస్సెట్ వ్యాల్యూ (ఎన్ఏవీ) వేర్వేరుగా ఉంటాయి. కారణం ఏమిటంటే..? ఒక ఫండ్ ఎన్ఏవీని నిర్ణయించేవి రెండు అంశాలు. ఆ పథకం పోర్ట్‌ఫోలియోతోపాటు, ఎక్స్‌పెన్స్ రేషియో. కనుక ఒక పథకం పోర్ట్‌ఫోలియో, ఎక్స్‌పెన్స్‌రేషియో అనేవి భిన్నంగా ఉండొచ్చు. కనుక ఎన్ఏవీలో మార్పు ఉండొచ్చు. అయితే, ఒక పథకం రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్లకు సంబంధించి పోర్ట్‌ఫోలియో ఒకటే ఉంటుంది. కాకపోతే ఎక్స్‌పెన్స్ రేడియో మాత్రం వేర్వేరుగా ఉంటుంది. కనుక ఎన్ఏవీపై దీని ప్రభావం పడుతుంది. రెగ్యులర్ ప్లాన్లకు పంపిణీదారుల కమీషన్‌ను కూడా కలుస్తుంది. కనుక రెగ్యులర్ ప్లాన్ల ఎన్ఏవీ అధికంగా ఉంటుంది. డైరెక్టర్ ప్లాన్లలో ఎలాంటి పంపిణీదారుల కమీషన్ ఉండదు. కనుక వాటి ఎన్ఏవీ తక్కువగా ఉంటుంది. ఒక పథకంలో ఇన్వెస్టర్ పెట్టుబడికి ఎన్ని యూనిట్లు వస్తాయనేది.. యూనిట్ ఎన్ఏవీపైనే ఆధారపడి ఉంటుంది. ఇన్వెస్టర్ మొత్తం పెట్టుబడిని, ఎన్ఏవీతో భాగిస్తే ఎన్ని యూనిట్లు వస్తాయో తెలుస్తుంది. ఒక పథకం రెగ్యులర్ ప్లాన్ ఎన్ఏవీ రూ.11గా ఉండి.. రూ.10,000 పెట్టుబడి పెడుతున్నారని అనుకుందాం. అప్పుడు ఈ పెట్టుబడికి 909.09 యూనిట్లు వస్తాయి. డైరెక్ట్ ప్లాన్ ఎన్ఏవీ రూ.10 ఉందనుకుందాం. అప్పుడు అదే రూ.10,000 పెట్టుబడికి 1,000 యూనిట్లు లభిస్తాయి.



నా వయసు 51 ఏళ్లు. పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. 2023 మార్చితో 15 ఏళ్ల కాల వ్యవధి ముగుస్తుంది. దీన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించుకునే అవకాశం ఉందని తెలిసింది. దాన్ని కొనసాగించాలని అనుకుంటున్నాను. నాకు ఇప్పట్లో డబ్బులతో పని లేదు. నెలకు రూ.12,500 చొప్పున పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. అయితే పీపీఎఫ్‌ను కొనసాగించుకోవాలా లేదా అది ముగిసిన తర్వాత.. ఈఎల్ఎస్ఎస్ పథకంలో ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకోవాలా? పీపీఎఫ్‌లో పెట్టుబడులు, రాబడులపై పన్ను లేదు. ఈఎల్ఎస్ఎస్‌లోనూ పెట్టుబడులపై సెక్షన్ 80సీ కింద పన్ను లేదు. నేను 20 శాతం పన్ను పరిధిలో ఉన్నాను. మంచి సలహా ఇవ్వగలరు? – సెంథిల్ కుమార్

ఈక్విటీల్లో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయడం ద్వారా డెట్‌తో పోలిస్తే మెరుగైన రాబడులు సొంతం చేసుకోవచ్చని వ్యాల్యూరీసెర్చ్ తరచూ చెబుతుంటుంది. మీకు సమీప కాలంలో డబ్బుతో అవసరం లేదంటున్నారు. కనుక పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేయడం కంటే ఈఎల్ఎస్ఎస్ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన ఆలోచన అవుతుంది. మీకు ఈక్విటీల పట్ల తగినంత అనుభవం ఉందని అనుకుంటున్నాం. అలాగే, మీ పెట్టుబడుల కాల వ్యవధి కనీసం ఐదేళ్ల నుంచి ఏడేళ్లు ఉంటుందనే అంచనాతో ఈ సూచన చేస్తున్నాం. ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో పెట్టుబడులకు మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుందని మర్చిపోవద్దు. ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్‌ల్లో పన్ను మినహాయింపు పరిశీలిస్తే.. పీపీఎఫ్‌తో పోలిస్తే పన్ను చెల్లింపుల తర్వాత రాబడులు ఈఎల్ఎస్ఎస్‌లోనే ఎక్కువ. పన్ను ఆదా కోసం పెట్టుబడికి ఎంపిక చేసుకునే సాధనాల్లో ముందు రాబడులకే ప్రాధాన్యం ఇవ్వాలి.

బోనమెత్తి.. మొక్కులు చెల్లించి

రేణుక ఎల్లమ్మవారికి గవర్నర్ తమిళిసై పూజలు

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ శివారులో జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో గవర్నర్ తమిళిసై బోనమెత్తి మొక్కులు సమర్పించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత నందీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాలు జరుగుతున్నాయి. ఆయన ఆహ్వానం మేరకు ఆదివారం గవర్నర్‌కు ఇక్కడికి వచ్చారు. ముందుగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. అమ్మవారికి చేయించిన బంగారు ఆభరణాలను గవర్నర్ అలంకరించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని గవర్నర్ తెలిపారు.



ఆధ్యాత్మిక సంస్కృతిని కాపాడుకోవాలి: దత్తాత్రేయ

ఆధ్యాత్మిక సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆయన ఆదివారం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు.

గోవర్ధనగిరిధారిగా శ్రీలక్ష్మీనరసింహస్వామి


యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం శ్రీస్వామి వారు గోవర్ధనగిరిధారి అలంకార సేవలో, సాయంత్రం సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం, పారాయణికులు, రుత్వికులు వేదపారాయణం పఠించారు.



యాదాద్రీశుడికి నిజాం తరపున బంగారు హారం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీస్వామి వారికి నిజాం కుటుంబం తరపున ప్రిన్సెస్ బేగం సాహిబా ఎస్రా బిర్గెన్ బంగారు హారాన్ని వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు ద్వారా అందజేశారు. ఈ హారాన్ని ఆదివారం కిషన్‌రావు ఆలయ ఈవో గీతారెడ్డికి అందజేశారు. శ్రీస్వామి వారి ప్రధానాలయం ప్రారంభమైన తరువాత తొలిసారి జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.4లక్షల విలువైన 67 గ్రాముల బంగారు హారాన్ని నిజాం కుటుంబం తరపున పంపించారని ఆలయాధికారులు వెల్లడించారు.





రైల్వేలో పురాతన బావుల పునరుద్ధరణపై ప్రధాని ప్రశంస

సికింద్రాబాద్ జోనల్ రైల్వేకు ట్విట్టర్‌లో మోదీ అభినందనలు



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: సికింద్రాబాద్ మౌలాలీలోని జోనల్ రైల్వే ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జడ్ఆర్‌టీఐ)లో ఉన్న 200 ఏళ్ల నాటి వారసత్వ బావిని పునరుద్ధరించడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ సంతోషం వ్యక్తంచేశారు. నీటి సంరక్షణ, నీటి వనరుల పునరుద్ధరణ కోసం దక్షిణ మధ్య రైల్వే చేసిన కృషి అభినందనీయమని ట్విట్టర్ వేదికగా ప్రశంసించారు. 'హరిత కార్యక్రమాలు ప్రోత్సహిస్తూ సికింద్రాబాద్ రైల్వే ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోని 200 ఏళ్లనాటి వారసత్వ బావి పునరుద్ధరించారు. నీటి సంరక్షణ సులభతరం చేయడానికి దాని చుట్టూ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్‌లను నిర్మించారు' అన్న రైల్వేశాఖ ట్వీట్‌పై ప్రధాని మోదీ స్పందించారు. దీనివల్ల నీటివనరులను కాపాడుకునేందుకు, సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రూ.6 లక్షలతో దక్షిణ మధ్య రైల్వే ఈ బావి పునరుద్ధరణ ప్రాజెక్టును చేపట్టింది. దీనివల్ల రూ.5 లక్షల వరకు ఆదా అవుతుందని అంచనా. సుమారు 50 అడుగుల లోతు ఉన్న ఈ హెరిటేజ్ బావి రోజుకు 1 లక్ష లీటర్ల నీటిని అందజేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. కాగా, ఈ వారసత్వ మెట్ల బావి 200 ఏళ్ల నాటిది. నిజాం కాలం నాటి ఈ బావికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. సర్ మీర్ తురాబ్ అలీఖాన్, సాలార్‌జంగ్–1 (1829–1883) దీన్ని మామిడి తోటలకు కావాల్సిన నీటికోసం నిర్మించారు. నీటిపారుదల సిబ్బంది నివాసం కోసం బావికి ఉత్తరం వైపు ప్రత్యేకంగా 10 గదులను నిర్మించారు. 1966లో ఈ బావి దక్షిణ మధ్య రైల్వే పరిధిలోకి వచ్చింది.

స్క్రాప్‌గా మార్చి.. కొత్త ఆటోలు తెచ్చి..!

పాత పర్మిట్‌పై కొత్త ఆటోలు తెచ్చే విధానం త్వరలో అమల్లోకి..

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో కాలంచెల్లిన ఆటోరిక్షాలను స్క్రాప్‌గా మార్చి ఆ పర్మిట్లపై కొత్త ఆటోలను తీసుకొనే విధానంపై ప్రస్తుతం కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తేసేందుకు రవాణాశాఖ సిద్ధమైంది. పాత పర్మిట్లపై కొత్త ఆటోలు పొందే విషయంలో భారీ అక్రమాలు జరిగాయంటూ గతంలో ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆ విధానం అమలును నిలిపివేస్తూ గతేడాది డిసెంబర్‌లో రవాణాశాఖ సర్క్యులర్ జారీ చేసింది. కానీ ఇప్పుడు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలతో మళ్లీ పాత పద్ధతిని అమల్లోకి తెస్తున్నట్లు మరో ఆదేశాన్ని జారీచేసి దాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది.

వేలల్లో అక్రమాలు...

కాలంచెల్లిన ఆటో రిక్షాలను తుక్కుగా మార్చి ఆ పర్మిట్ల ఆధారంగా కొత్త ఆటోలు తీసుకొనే పద్ధతికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి విధాన నిర్ణయాన్ని తీసుకోకపోవడాన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేటు బ్రోకర్లు, రవాణా శాఖ అధికారుల అండదండలతో భారీ అక్రమాలకు తెరలేపారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నిజానికి తుక్కుగా మార్చిన ఆటోరిక్షా ఛాసిస్‌ను మూడు ముక్కలు చేయాల్సి ఉంటుంది. కానీ దాన్ని తుక్కుగా మార్చినట్లు రికార్డుల్లో చూపుతూ తక్కువ ధరలకు ఆ ఆటోను మరొకరికి విక్రయించేవారన్నది ఆరోపణ. అటు పాత ఆటో పర్మిట్ లేకుండా తిరుగుతుండగా దాని పర్మిట్‌తో మరో కొత్త ఆటో రోడ్డెక్కేదని ఫిర్యాదుల సారాంశం. అలా దాదాపు 8 వేల వరకు ఆటోలు అక్రమంగా తిరుగుతున్నాయంటూ కొన్ని ఆటో సంఘాలు కూడా ఫిర్యాదు చేశాయి. ఆ ఫిర్యాదుల ఒత్తిడితో అధికారులు ఆ పద్ధతిని నిలిపేశారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన స్క్రాప్ పాలసీని అమలులోకి తెస్తామంటూ అప్పట్లో అధికారులు చెప్పారని యూనియన్ నేతలు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఆ విధానమంటూ లేకుండానే పాత పద్ధతిని పునరుద్ధరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గతంలో వేల సంఖ్యలో ఆటోరిక్షాలు అక్రమంగా తిరిగేందుకు అవకాశం కల్పించిన అధికారులపై చర్యలు తీసుకోకుండా పాత పద్ధతిని పునరుద్ధరిస్తున్నారంటూ ఆటోరిక్షా యూనియన్ నేత దయానంద్ తాజాగా లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. అయితే 'పాత పద్ధతినే పునరుద్ధరిస్తున్నప్పటికీ తుక్కుగా మార్చిన ఆటోరిక్షా ఫొటోలను తీయాలని, ఆటో ఛాసీస్‌ను మూడు ముక్కలు చేయాలని, ఆ వివరాలు పొందుపరచాలని నిబంధన లు విధించాము, వాటిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాము' అంటూ ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

తప్పుగా నింపాడని ఓఎంఆర్ షీట్ మింగేశాడు

- నిజామాబాద్ జిల్లాలో ఘటన
- అభ్యర్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసిన పరీక్ష సూపరింటెండెంట్

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లాలోని ఓ పరీక్ష కేంద్రంలో అభ్యర్థి ఓఎంఆర్ షీట్‌లో తప్పులు నింపాడని ఏకంగా ఆ షీట్‌నే నమిలి మింగేశాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మోపాల్ మండలం బోర్గాం(పి) పాఠశాలలో ఏర్పాటుచేసిన ఓ పరీక్షాకేంద్రంలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన డీఏవో (డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్) పరీక్షకు నిర్మల్ జిల్లాకు చెందిన సహకార శాఖలో క్లర్క్‌గా పని చేస్తున్న అబ్దుల్ ముఖీద్ అనే అభ్యర్థి హాజరయ్యాడు. పరీక్షరాసే క్రమంలో అతడు ఓఎంఆర్ షీట్‌ను తప్పుగా నింపడంతో దానిని చింపి మింగేశాడు. తన బెంచీలో గైర్హాజరైన అభ్యర్థికి సంబంధించిన ఓఎంఆర్ షీట్‌ను తీసుకుని అందులో సమాధానాలు బబ్లింగ్‌చేశాడు. కొంతసేపటికి ఇన్విజిలేటర్ పరీక్షకు హాజరుకాని ఏడుగురు అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను కలెక్ట్ చేస్తుండగా...ఒకటి తక్కువ వస్తోంది. దీంతో అబ్దుల్ ముఖీద్ పక్కన ఉండాల్సిన ఓఎంఆర్ షీట్ గురించి ఆరా తీశారు. అయితే తనకేం తెలియదని ముందు బుకాయించగా..సీసీ టీవీ ఫుటేజీ పరిశీలనలో ఇతగాడి వ్యవహారం అంతా రికార్డు కావడంతో తప్పు ఒప్పుకున్నాడు. దీంతో సూపరింటెండెంట్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా..ఆర్డీవో వచ్చి పరిశీలించారు. అనంతరం నాల్గవ టౌన్‌లో అబ్దుల్‌పై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు.



అబ్దుల్ ముఖీద్

ప్యాక్స్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడిగా శంకరయ్యగౌడ్



సుల్తానాబాద్ రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్యాక్స్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల పీఏసీఎస్ సీఈవో బొంగోని శంకరయ్యగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని విద్యుత్ కార్మిక భవనంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులతో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షునిగా శంకరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జోగులాంబ సన్నిధిలో సుప్రీం న్యాయమూర్తి



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణ్యన్, ఢిల్లీ హైకోర్టు జడ్జి రాజీవ్ షక్దీర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం (అలంపూర్): అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, ఢిల్లీ హైకోర్టు జడ్జి రాజీవ్ షక్దీర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో, చైర్మన్లు అమ్మవారి జ్ఞాపికను బహూకరించారు.

పాము కరిస్తే మంత్రం వేశారు!

పరిస్థితి విషమం, మృతి

ఎడపల్లి (బోధన్): సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా.. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొంతమంది మూఢ నమ్మకాలు విశ్వసిస్తున్నారు. పాము కరిస్తే వైద్యుడిని సంప్రదించకుండా మంత్రం వేయించుకోవడంతో ఓ వ్యక్తి ప్రాణం పోయింది. ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లిలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుర్నాపల్లికి చెందిన గంగారెడ్డి (51)కి శనివారం మధ్యాహ్నం ఇంటి వద్ద బాత్‌రూంలో పాముకాటు వేసింది. దీంతో స్థానికంగా ఉన్న పాము మంత్రం వేసే వారి వద్దకు వెళ్లి మంత్రం వేయించుకున్నాడు. అయితే గంటపాటు పాము మంత్రం వేసే వారి వద్ద ఉంచడంతో పరిస్థితి విషమించింది. స్థానికులు ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించడంతో గంగారెడ్డిని ఆటోలో నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో మల్లాపూర్ గండి వద్ద ఆటోలో డీజిల్ అయిపోయింది. మరో ఆటోలోకి ఎక్కించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గంగారెడ్డి మృతి చెందాడు.



గంగారెడ్డి

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.